www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 269 | బుధవారం | 21 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పంచాంగం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం,
ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం
తిథి : శుక్ల. చవితి సా.3.47 వరకు
అనంతరం పంచమి
నక్షత్రం: భరణి రా.7.25 వరకు
అనంతరం కృత్తిక
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం : ప.11.43 - 12.30 వరకు
రాహుకాలం: ప.12.00 - 1.30 వరకు
యమగండం: ఉ.7.30 - 9.00 వరకు
శుభసమయాలు: లేవు

తెలుగుకు వెలుగు

అన్ని స్కూళ్లలో టెన్త్ వరకు పాఠ్యాంశంగా మాతృభాష

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు, ఈ సమావేశాల్లోనే బిల్లు : ముఖ్యమంత్రి కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న (2018–19) విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు అమలులోకి రానుంది. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ అంశంపై పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రగతిభవన్‌లో మంగళవారం సిఎం కెసిఆర్ సమీక్ష జరిపారు. తెలుగును తప్పనిసరి చేయడంతో పాటు తెలుగులో చదువుకున్న పిల్లలకు ఉజ్జ్వల భవిష్యత్తు ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవడం పైనా సిఎం చర్చించారు. తప్పనిసరి తెలుగు విధానాన్ని రానున్న విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి తీసుకురావడానికి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తెస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్రంలోని తరువాయి 6లో





ఆ 39 మందినీ ఐసిస్ చంపేసింది

ఇరాక్ సమాధుల్లోంచి వారి మృతదేహాలను వెలికి తీశారు

వాటిని ప్రత్యేక విమానంలో తెచ్చి కుటుంబాలకు అప్పగిస్తాం

ఒక్కరు మాత్రమే బంగ్లాదేశీ అని చెప్పకొని బయటపడ్డాడు

ఆధారాలు దొరికాయి కాబట్టే చనిపోయారని చెబుతున్నాను

సుష్మా స్వరాజ్ ప్రకటనతో రాజ్యసభలో విషాదం

న్యూఢిల్లీ: ఇరాక్‌లోని మోసుల్ పట్టణంలో మూడేళ్ల క్రితం ఐసిస్ ఉగ్రవాదుల చేతిలో అపహరణకు గురైన 39 మంది భారతీయులు మృతి చెందినట్లు కేంద్రవిదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం రాజ్యసభలో తనకు తానుగా ప్రకటించారు (సుమోటో స్టేట్‌మెంట్). వారంతా భారతీయులేనని డిఎన్ఎ టెస్టింగ్ ద్వారా రుజువైందని కూడా తెలిపారు. వారెప్పుడు చంపబడ్డారన్నది తెలియకపోయినప్పటికీ వారి మృతదేహాలను మోసుల్ పట్టణం వాయువ్యంలోని బాదోష్ గ్రామంలో తరువాయి 6లో

త్వరలో భువనేశ్వర్‌కు సిఎం కెసిఆర్?

ఫ్రంట్ నిర్మాణ కృషిలో భాగంగా నవీన్ పట్నాయక్‌తో భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో తొలి భేటీ విజయవంతమైన నేపథ్యంలో టిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు మరికొంత మంది ఇతర రాష్ట్రాల నాయకులతో సమావేశం కానున్నారు. అందులో భాగంగా త్వరలో ఒడిశా రాజధాని భువనేశ్వర్ పర్యటనకు వెళ్ళనున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తరువాయి 6లో

మంచి కోసమే అప్పు

- కేంద్రం, బిజెపి రాష్ట్రాల అప్పు కనిపించడం లేదా
- మనకంటే కేంద్ర ప్రభుత్వం అప్పే అధికం
- మేం చేసిన అభివృద్ధి విపక్షాలకు కనిపించలేదా?
- రూ. వెయ్యి పెన్షన్ బిజెపి రాష్ట్రాల్లో ఇస్తున్నారా?
- 22% వృద్ధిరేటుతో మనమే నెంబర్ వన్
- జిఎస్‌డిపిలో 21 శాతమే రుణాలు

- శాసనసభలో ముఖ్యమంత్రి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అప్పులు చేయడం తప్పు కాదని సిఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. శాసనసభలో మంగళవారం బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా బిజెపి సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ రాష్ట్ర అప్పులపై విమర్శలు చేసిన సమయంలో సభలో ఉన్న సిఎం కెసిఆర్ జోక్యం చేసుకొని స్పందించారు. '21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు అప్పులు చేయడం లేదా? అప్పులు చేయకుండానే ఆ తరువాయి 6లో

ఆర్‌టిసిలో ఖాళీలకు మోక్షం 3

ఎయిర్‌పోర్టు వరకూ మెట్రో

- నాగోల్, ఫలక్‌నుమా, హైటెక్ సిటీ నుంచి అనుసంధానం
- పాతబస్తీకీ విస్తరణ, మసీదులు, గుళ్లు, చర్చీలపై సర్వే పూర్తి
- అసెంబ్లీలో మంత్రి కెటి రామారావు ప్రకటన

మన తెలంగాణ / హైదరాబాద్ : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రో రైలు మార్గాన్ని విస్తరిస్తామని, నాగోల్, ఫలక్‌నుమా, హైటెక్ సిటీ మూడు చోట్ల నుండి కూడా మెట్రో మార్గాన్ని ఎయిర్ పోర్టుకు కలుపుతామని పురపాలక పట్టణాభివృద్ధి తరువాయి 6లో



డప్పు, చెప్పుల వృత్తిదారులకూ ఆసరా? 3

- ఈ సమావేశాల్లో సిఎం ప్రకటనకు ఆస్కారం

పిజి మెడికల్ సీట్లలో సగం స్థానికులకే 6

- రెండు జిఒలు విడుదల



మంగళవారం నాడు రాష్ట్రపతి భవన్‌లో ఇళయరాజాకు పద్మవిభూషణ్ పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 11

తెలంగాణకు 17, ఎపికి 16 టిఎంసిలు 6


టెక్స్‌టైల్ పార్కులో రూ.1500 కోట్ల పెట్టుబడులు 3

కుంచెపోటు



నావెనక బిజెపి ఉందని మీకెందుకనిపిస్తుంది..?





వేగంగా తెలంగాణ అభివృద్ధి : శ్రీనివాస్‌గౌడ్



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని టిఆర్ఎస్ ఎంఎల్ఎ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం అప్పులు చేస్తుందని ప్రతిపక్షాలు విమర్శించడం అర్థరహితమని, అది అప్పు కాదని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పెట్టుబడి అని ఆయన అన్నారు. శాసనసభలో మంగళవారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో ఆయన పాల్గొన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశారని, ప్రతిపక్షంలో ఉన్న వారికి అభివృద్ధి కనబడకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలకు ప్రభుత్వం దగ్గరవుతుంటే విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలందరూ గమనిస్తున్నారని, దేశంలో ఉన్న వారందరికీ తెలంగాణ అభివృద్ధి కనిపిస్తుంటే రాష్ట్రంలో ప్రతిపక్షాలకుకనబడకపోవడం విచారకరమన్నారు. సిఎం కెసిఆర్ పాలనలో పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్లాలనే నిర్ణయానికి రావడం అందుకు నిదర్శనమన్నారు. దేశ జిడిపి కంటే రాష్ట్ర జిడిపియే అధికంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉందనడానికి జిడిపియే నిదర్శనమని ఆయన అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

వేరుశనగ వెన్న..మొక్కజొన్న స్వీట్‌కార్న్


- **ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**
- **మొక్కజొన్న రైతుకు మరింత లాభం**
- **రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో ఏర్పాటు**





మన తెలంగాణ/హైదరాబాద్ : వేరుశనగతో వెన్న, మొక్కజొన్నతో స్వీట్ కార్న్, బేబి కార్న్ వంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు లాభాదాయకంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం రాష్ట్రం లో మొక్కజొన్న పంట దాదాపు 19.76 లక్షల ఎకరాలలో సాగువుతోందని, 28.82 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తోందని, ఇందులో 49 శాతం కోళ్ల దాణాకు, 12 శాతం పశువుల దాణాకు వినియోగమవుతోందని పేర్కొనింది. మొక్కజొన్నకు సంబంధించి ప్రాస్‌సింగ్ యూనిట్ల ఏర్పాటు ఆవశ్యకత అంతగా లేనప్పటికీ, రైతులకు మరింత ధర రావాలంటే ఏర్పాటు చేయడంపై కొన్ని సూచనలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సాగవుతున్న పంటల ఆధారంగా 100 నియోజకవర్గాల్లో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత రంగాల వారి నుంచి అభిప్రాయాలు, సూచనలను ప్రభుత్వం కోరింది. ఈ మేరకు శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదించారు. వేరుశనగ సాగు ఉన్న 11 నియోజకవర్గాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో సిద్ధిపేట, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ లేదా జనగాం, ఇబ్రహీంపట్నం లేదా కుత్బుల్లాపూర్, మెదక్ లేదా గజ్వేల్ , కామారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, జగిత్యాల్ లేదా కోరుట్ల, నిర్మల్, మధిర లేదా వైరా నియోజకవర్గాల్లో పొడి, తడి మర యంత్రాల ఏర్పాటు చేయాలని నివేదించారు. పొడి ప్రాసెసింగ్ యూనిట్లతో పిండి, స్వీట్ కార్న్, గ్లూటెన్ ప్రోటిన్,నూనె, ఇథనాల్ వంటి ఉత్పత్తులు తీయవచ్చు. వేరుశనగ పంట ప్రధానంగా సాగయ్యే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాథమిక, సెకండరీ, తృతీయ దశల వారీ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రతిపాదించారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో వీటి ఏర్పాటును సూచించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుశనగ పంట దాదాపు 9.88 లక్షల ఎకరాలలో సాగవుతోంది. అలాగే నిజామాబాద్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, జిల్లాల్లో వరికి అదనపు విలువలు జోడించే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటును సూచించింది. అలాగే ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వివిధ నియోజకవర్గాల్లో సాగవుతున్న పప్పు పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జొన్న, కందులు, ఇతర చిరుధాన్యాలు ప్రాసెస్ చేసేలా గ్రామ స్థాయిలోనే యూని ట్లు ఉంటే ఉపయోగకరంగా ఉంటుందని నివేదించారు.

ప్రజల హెల్త్ ప్రొఫైల్!



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రజారోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రొఫైల్‌ను తయారు చేయాలని నిర్ణయించింది. ఆ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. వారం రోజులుగా దీనిపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ విషయంలో అధికారులు స్పష్టతకు రాలేకపోతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలను ఎలా నిర్వహించాలి, ఇంటింటికి వెళ్ళి పరీక్షలు చేయడంలో ఎదురయ్యే సమస్యలు, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు తదితర అంశాలపై సమగ్రంగా చర్చిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది సంఖ్య సరిపోతుందా, లేనిపక్షంలో ప్రైవేటు వైద్యులు, సిబ్బందిని వినియోగించుకోవాల్సిన అవసరం ఏ మేరకు ఉంటుంది తదితర అంశాలపైనా దృష్టి పెట్టారు. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎ. శాంతికుమారి అధ్యక్షతన కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, వైద్య సంచాలకులు లలితకుమారి, సరోజినిదేవి కంటి ఆసుపత్రి డాక్టర్ రవిందర్‌గౌడ్‌లతో పాటు పలువురు వైద్య, నిపుణులతో వారం రోజులుగా ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులతో పాటు పారా మెడికల్ సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది తో రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ సాధ్యంకాకపోవచ్చనే అంచానకు వచ్చారు. ప్రైవేటు మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, పారా మెడికల్ సిబ్బంది కాలేజీల్లోని సిబ్బందితో పాటు ఫ్యాకల్టీ, విద్యార్థులను కూడా వినియోగించుకోవాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో వివిధ కోర్సులు చదువుతున్న టెక్నికల్ సిబ్బందిని సైతం ఇందుకోసం వినియోగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ప్రైవేటు వైద్యకళాశాలలతో పాటు, ఆసుప్రతుల ప్రతినిధులతో ఇప్పటికే ఒక విడత చర్చలు జరిపినట్లు సమాచారం. ప్రజల ఆరోగ్య పరిస్థితిని 'హెల్త్ ప్రొఫైల్'గా తయారు చేస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని భావించినా అంత సులువుగా ఈ పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరో రెండు వారాల పాటు చర్చలు జరిపితే తప్ప విషయంపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదని అధికారులు వ్యాఖ్యానించారు. ఏప్రిల్ మొదటి వారంలో రోగ నిర్ధారణ పరీక్షలు ప్రారంభించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

ఇంజినీరింగ్ సీట్ల మిగులుకు బ్రేక్

- **ఐఐటి,ఎన్ఐటి సీట్ల కేటాయింపు తర్వాత మూడవ విడత కౌన్సెలింగ్**
- **సీట్లు వృథా కాకుండా చర్యలు**



మనతెలంగాణ/హైదరాబాద్ : విశ్వవిద్యాలయాలలో ఇంజనీరింగ్ సీట్లు మిగిలిపోతున్నాయనే చింతకు ఉపశమనం లభించనుంది. ఐఐటి, ఎన్ఐటి కౌన్సెలింగ్ తర్వాత ఎంసెట్ ఇంజనీరింగ్‌కు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మెరిట్ విద్యార్థులు ఎక్కువగా వర్సిటీలలోని కళాశాలల్లో చేరేందుకే ఆసక్తి కనబరుస్తున్నందున పోటీ అధికంగా ఉం టుంది. ఇంతకాలం వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఆ తర్వాత ఐఐటి,ఎన్ఐటి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీటు లభించగానే అక్కడికి వెళ్లిపోతున్నారు. దాంతో ప్రతి ఏటా వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో కొన్ని సీట్లు వృథాగా మిగిలిపోతున్నా యి. ఈ ఖాళీ సీట్లను మెరిట్ విద్యార్థులతో భర్తీ చేసేందుకు నిబంధనలు అంగీకరించకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. జెఎన్‌టియు (హైదరాబాద్), ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ, మహాత్మాగాంధీ వర్సిటీలలో 201516 విద్యాసంవత్సరంలో 270 ఇంజనీరింగ్ సీట్లు మిగలగా, 201617 విద్యాసంవత్సరంలో 70 సీట్ల వరకు మిలిలాయి. జెఇఇతో పాటు ప్రైవేట్ వర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందుతున్న విద్యార్థులే ఎంసెట్‌లోనూ మంచి ర్యాంకులు సాధిస్తున్నారు. వీరంతా ఐఐటి, ఎన్ఐటి కౌన్సెలింగ్ ద్వారా సీటొచ్చిన కళాశాలల్లో చేరుతున్నారు. ఈ వర్సిటీలలోని కళాశాలల్లో చేరేందుకు తర్వాతి ర్యాంకులు పొందిన విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నా నిబంధనలు అంగీకరించకపోవడంతో ఆ సీట్ల భర్తీకి వీలు కాలేదు. ప్రముఖ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు మాత్రం తమ కళాశాలల్లో సీట్లు మిగిలిపోతే ఎలాగోలా ఇతరులతో భర్తీ చేసుకుంటున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీట్లు మిగలకుండా ఐఐటి, ఎన్ఐటి సీట్ల కేటాయింపు తర్వాత మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

'సాఫ్‌కిన్'ద్వారా ఉత్తమ పౌరులు

రేపే హోం నూతన భవనం ప్రారంభం

మన తెలంగాణ / హైదరాబాద్ : సమాజానికి ఉత్తమ పౌరులను అందించే దిశగా పిల్లలను తీర్చిదిద్దేందుకు 'సాఫ్‌కిన్' సంస్థ తనవంతు సహకారం అందిస్తోందని సంస్థ వ్యవస్థాపకులు ఛాయ పాముల తెలిపారు. ఇందుకోసం సంస్థ ఆధ్వర్యంలో 'సాఫ్‌కిన్' హోంలను నిర్వహిస్తోందని, హైదరాబాద్‌తో పాటు పుణేలో ఐదు హోంలను ఏర్పాటు చేసి వంద మంది పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు ఆటపాటలను నేర్పుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 22న రంగారెడ్డి జిల్లా కీసర మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ కలెక్టర్ ఎంవి.రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎంఎం.భగవత్ ముఖ్య అథితులుగా హాజరవుతున్నట్లు వివరించారు. హోంలోని పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా ఇంటి వాతావరణంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు ఇతర బంధువుల లోటు లేకుండా వారిని చూసేందుకు వీలుగా మహిళా సిబ్బందికి కూడా శిక్షణనిస్తున్నామన్నారు. హోంలో ప్రతి రూమ్‌కు పదిహేను మంది పిల్లలను ఉంచుతున్నామని, వీరి సంరక్షణకు ఇద్దరు 'హౌస్ మదర్'లను నియమిస్తున్నామని తెలిపారు. పిల్లలు రెగ్యులర్‌గా స్కూలుకు వెళ్లడంతో పాటు ఆటపాటలతో చదువులో ఉత్తీర్ణత సాధిస్తున్నారని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పోటీల్లో విజేతలుగా కూడా నిలిచారని తెలిపారు. ప్రజల నుంచి స్పందన ఎక్కువగా ఉన్నందువల్ల హోంలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఎంత ఖర్చు చేశారు?

మన తెలంగాణ/హైదరాబాద్: ఎంబిసిల కోసం 2017–18 ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన రూ.1000 కోట్లలో ఎంత ఖర్చు చేశారని, అసలు ఎంబిసి కులాలను గుర్తించారా అని బిజెపి సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



వచ్చే నెల నుండే పంట పెట్టుబడి పథకం : పోచారం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతులు పంట పండించుకోవడానికి పెట్టుబడి కింద 72 లక్షల 13 వేల మంది రైతులకు రెండు పంటలకు కలిపి రూ. 8 వేల చొప్పున ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వానా కాలం పంట కోసం ఏప్రిల్ 20 నుండి మే మాసాంతం వరకు, యాసంగి పంటకు నవంబర్ 20 నుండి పంట పెట్టుబడి ఇవ్వనున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్ ఎంఎల్ఏలు పుట్టా మధుకర్, వేముల వీరేశం తదితరులు అడిగిన ప్రశ్నకు పోచారం సమాధానం ఇచ్చారు. రైతు వేదిక భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఒక్కో భవనం రూ. 12 లక్షల అంచనా వ్యయంతో 2638 వేదికలను నిర్మించేందుకు సుమారు 300 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణపై ఎంఎల్ఏ కిషన్ రెడ్డి, డా.కె. లక్ష్మణ్‌లు అడిగిన ప్రశ్నకు మంత్రి తుమ్మల సమాధానమిస్తూ కొత్త భూసేకరణ చట్టం ప్రకారమే రోడ్ల నిర్మాణానికి భూసేకరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 1,333 కి.మీ పొడవునా జాతీయ రహదారులుగా ప్రకటించిన కేంద్రం, ఇటీవలే మరో 1767 కి.మీ పొడవు గల 13 రోడ్లను కొత్త జాతీయ రహదారులు ప్రకటించడానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. గువ్వల, మంచిరెడ్డి కిషన్‌రెడ్డిల ప్రశ్నకు జూపల్లి జవాబిస్తూ రాష్ట్రానికి 4271శవ దహన వాటికలకు మంజూరు చేసిందన్నారు.

శాసన మండలి

పోడు భూములకు పట్టాలు!



మనతెలంగాణ/హైదరాబాద్ : ధరణి ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో రైతులకు చాలా ఉపయోగాలు ఉంటాయని రెవెన్యూ శాఖ మంత్రి మహమూద్ అలీ తెలిపారు. శాసనమండలిలో మంగళవారం సభ్యు లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ దొంగ పాస్‌పుస్తకాల నివారణ, డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు వంటివి నివారించడతాయన్నారు. భూముల రికార్డులు, సర్వే సెటిల్‌మెంట్, రిజిస్ట్రేషన్ల వివరాలు ఏకీకృతం చేస్తారన్నారు. ఎక్కడి నుంచైనా ఎవరైనా వారి భూముల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కోర్ బ్యాంకింగ్ తరహా విధానంలోనే కొత్త వెబ్ ఆధారిత సమీకృత భూమి రికార్డుల నిర్వహణ విధానాన్ని డిజైన్ చేసి నిర్వహించడమే ధరణి ప్రాజెక్టు ప్రారంభచర్య అని చెప్పారు. రైతులు తమ ఇబ్బందులను కూడా తెలపవచ్చన్నారు. వారి ఇబ్బందులను దాఖలు చేసిన వెంటనే పరిష్కరించబడతాయని చెప్పారు. వెబ్‌సైట్ ప్రారంభించిన వెంటనే డాక్యుమెంట్ల మ్యుటేషన్ 48గంటల్లో, వారసత్వాన్ని 10రోజుల్లో పూర్తి చేయడం జరగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములు అటవీశాఖకు చెందినవని వాటికి పట్టాలివ్వడం రెవెన్యూశాఖ వల్ల కాదన్నారు. రెవెన్యూ భూములుంటే వాటికి పట్టాలిచ్చే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెల్లి పరిశీలిస్తామని చెప్పారు.

మిషన్ కాకతీయకు సహకరించని కేంద్రం

మిషన్ కాకతీయ పథకానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నా... కేంద్ర ప్రభుత్వం మాత్రం సహకరించడం లేదని నీటిపారుదలశాఖ మంత్రి టి.హరీశ్ రావు అన్నారు. శాసనమండలిలో ఎంఎల్‌సిలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో పాటు పలు దేశాల ప్రతినిధులు మిషన్ కాకతీయను పరిశీలించి వారి వద్ద కూడా దీనిని అమలు చేస్తామన్నారన్నారు. మహారాష్ట్రలోని నీటి ఎద్దడి ఉన్న కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే అమలు చేయడం మొదలుపెట్టారని చెప్పారు. నీతి ఆయోగ్ కూడా మెచ్చుకుని దీనికి రూ.5వేల కోట్లు కేటాయించాలని కేంద్రానికి సిఫారసు చేసిందని, తాము కూడా పలుమార్లు సహాయం కోసం కేంద్రాన్ని అర్థించామని అయినా స్పందన లేదన్నారు.

కాల్షియం కార్బైడ్ వినియోగంపై కఠిన చర్యలు

పండ్లను మగ్గపెట్టడానికి కాల్షియం కార్బైడ్ వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. శాసనమండలిలో మంగళవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అలాంటి వారిని పట్టుకుని కేసులు పెడుతున్నామన్నారు. ఇప్పటి వరకు 19మందికి జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి 10వేల రూపాయల జరిమానా కూడా పడిందని చెప్పారు. కాల్షియం కార్బైడ్ వినియోగం వల్ల కలిగే దుష్పలితాలను బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో సిసిటివిలతో, మీడియా ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మంలో భూబదిలీ జరగగానే పండ్ల మార్కెట్ ఏర్పాటుచేస్తామన్నారు. నల్గొండ, దేవరకొండలలో పండ్ల మార్కెట్ నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. నకిరేకల్‌లో దొండ మార్కెట్‌ను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం గడ్డి అన్నారంలో ఉన్న పండ్ల మార్కెట్‌ను రంగారెడ్డి జిల్లా కోహెడలో 175ఎకరాల్లో, జగిత్యాలలోని మామిడి పండ్ల మార్కెట్‌ను చెల్గల్ గ్రామంలోని 23.05ఎకరాల్లో ఆధునిక వసతులతో ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ఆసుపత్రి లీజు రద్దుపై ఆలోచిస్తున్నాం



మల్లేపల్లి ఐటిఐ స్థలాన్ని అప్పటి వైఎస్ ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆసుపత్రికి స్థలం లీజుకు ఇచ్చిందని, దీనిని రద్దుచేసే విషయమై ఆలోచన చేస్తున్నామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. సోమవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆసుపత్రి అప్పట్లో ఒక భవనాన్ని కూడా నిర్మించిందన్నారు. ఈ ఐటిఐ స్థలంలో గుడి నిర్మాణం, నీలోఫర్ క్యాన్సర్ హాస్పిటల్‌కు స్థలం కేటాయింపు, ఎపిఎస్ఎస్ఐడిసికి లీజుకు ఇవ్వడం జరిగాయన్నారు. బాలకార్మికుల రక్షణ, పునరావాసం కోసం 'ఆపరేషన్ స్మైల్' పేరుతో పోలీసుల సమన్వయంతో కార్మిక శాఖ దాడులు నిర్వహిస్తోందన్నారు.

అన్ని జిల్లాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలు



రాష్ట్రంలో ప్రస్తుతం 13జిల్లాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలను ప్రారంభించామని త్వరలో అన్ని జిల్లాల్లో ఏర్పాటుకు కృషిచేస్తానని వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఈ స్క్రీనింగ్ కేంద్రాలు క్యాన్సర్‌ను ముందుగానే కనుగొనడానికి దోహదపడుతున్నాయన్నారు. ఈ కేంద్రాలలో 5లక్షల మందికి స్క్రీనింగ్ చేయడం జరిగిందని వీరిలో 2 వేల మందికి క్యాన్సర్ ఉన్నట్లు తేలిందని ఆయన చెప్పారు. ఎన్‌పిసిడిసిఎస్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్‌ను ముందుగానే కనిపెట్టడానికి 277మంది వైద్యాధికారులు, 275మంది స్టాఫ్ నర్సులు, 9217 మంది ఎఎన్ఎంలకు శిక్షణ ఇచ్చామన్నారు.

మరో హరిత విప్లవానికి దోహదం

ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ నిధులను కేటాయించడం ద్వారా మరో హరిత విప్లవానికి దోహదం చేస్తోందని పలువురు టిఆర్ఎస్ ఎంఎల్‌సిలు అన్నారు. శాసన మండలిలో మంగళవారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో అధికారపక్ష ఎంఎల్‌సిలు కొంపల్లి యాదవరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే వ్యవసాయం, అనుబంధ రంగాలకు కలిపి రూ.40వేల కోట్ల బడ్జెట్ కేటాయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. వన్ నేషన్ – వన్ టాక్స్, వన్ నేషన్ – వన్ ఎలక్షన్ అం టున్న ప్రధాన మంత్రి వన్ నేషన్ వన్ రిజర్వేషన్ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఎంఎల్‌సి గంగధర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి రైతుకు రూ. 5 లక్షల బీమా కల్పించిన ఘనత సిఎం కెసిఆర్‌దే అన్నారు. మైనార్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2000 కోట్ల కేటాయించడం చాలా సంతోషంగా ఉందని ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. ఎంఎస్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాలసాని లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. అయితే బిసిలతో పాటు ఆయా ఫెడరేషన్లకు మరిన్ని నిధులను కేటాయించాలని ఆయన కోరారు. పూల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కొత్త పిఆర్‌సి జూలై 1నుంచి అమల్లోకి రావాల్సిన ఉందని, ఈసారి కూడా ఓ మంచి పిఆర్‌సిని ప్రకటించాలని కోరారు. డాక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను బాధల నుంచి విముక్తి చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం హర్షనీయమన్నా రు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓ ఆదర్శవంతమైన బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. కాటేపల్లి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ లక్ష్యానికి ఈ బడ్జెట్ ప్రతి రూపం అన్నారు.

డప్పు, చెప్పుల వృత్తిదార్లకూ ఆసరా?

- ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే సిఎం కెసిఆర్ ప్రకటన?
- ఆర్థిక భారాన్ని అంచనా వేసిన అధికారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : వివిధ కుల వృత్తులవారికి ప్రస్తుతం ప్రతి నెలా అందిస్తున్నట్లుగానే ఇకపైన డప్పులు చేసేవారికి, చెప్పులు కుట్టేవారికీ ప్రభుత్వం పింఛను అందించనుంది. ఒకప్పుడు ఈ వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి ఉన్నప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్లాస్టిక్ డప్పులు రావడం, కార్పొరేట్ చెప్పుల కంపెనీలు రావడంతో వీరి ఆదాయ వనరులు కుంచించుకుపోయాయని భావించిన ప్రభుత్వం వారిని ఆదుకోడానికి ప్రతి నెలా ఆసరా పింఛను రూపంలో ఆదుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లోనే ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ మేరకు ప్రకటన చేయనున్నట్లు సమాచారం.







రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు వృత్తులపై ఆధారపడి సుమారు 40 వేల మంది ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారులు ఇప్పటికే వివరాలను సేకరించారు. వీరందరికీ ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున ఆసరా పింఛనును ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై నెలకు సుమారు నాలుగు కోట్ల రూపాయల మేర ఆర్థిక భారం పడుతుందని, సంవత్సరానికి రూ. 48 కోట్లు ఖర్చవుతుందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. ఆసరా పింఛన్‌ను ఇవ్వాలని ప్రాథమికంగా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినప్పటికీ కనీస వయోపరిమితిని 45 ఏళ్ళుగా నిర్ణయించాలన్న అభిప్రాయానికి వచ్చింది. అయితే దీన్ని 40 ఏళ్ళకు తగ్గించడం ద్వారా చాలా మందికి లబ్ధి చేకూరుతుందని వృత్తి సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. వయోపరిమితిని తగ్గించడం ద్వారా ప్రభుత్వంపై ఏ మేరకు అదనంగా ఆర్థిక భారం పడుతుందనే దానిపై ఇంకా సమగ్ర వివరాలు ఆర్థికశాఖకు అందకపోయినా స్వల్ప మోతాదులోనే ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే చేనేత, కల్లుగీత, బీడీ కార్మికులకు ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున పింఛన్లను చెల్లిస్తున్న ప్రభుత్వానికి ఇప్పుడు ఈ రెండు వృత్తులవారికి ఏటా రూ. 48 మేరకు చెల్లించడం పెద్దగా ఆర్థిక భారం కాదని సిఎం భావించినట్లు తెలిసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయాన్ని రూ. 25 వేలు పెంచడంతో వివిధ సెక్షన్ల నుంచి ప్రభుత్వానికి ప్రశంసలు లభించాయి. ఇప్పుడు డప్పులు చేసేవారికి, చెప్పులు కుట్టేవారికి సైతం ఆసరా పింఛన్లను విస్తరింపజేయడం ద్వారా మరింత మంచిపేరు వస్తుందని ప్రభు త్వం భావిస్తోంది. సుమారు 61 వేల మంది కల్లు గీత కార్మికులకు, 36 వేల చేనేత కార్మికులతో పాటు బీడీ కార్మికులకు ప్రభుత్వం వెయ్యి రూపాయల చొప్పున ఆసరా పింఛన్లను చెల్లిస్తోంది. మరోవైపు ఎస్‌సి వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ సమితి ఆందోళనలు నిర్వహిస్తుండడం, రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచుతుండడంతో ఇప్పుడు ఈ రెండు వృత్తులపై ఆధారపడేవారికి ఆసరా పింఛన్లను అందజేయడం ద్వారా ఒక సెక్షన్ ప్రజలను ఆకట్టుకోవచ్చని టిఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యాంత్రీకరణ పెరిగిపోవడంతో చెప్పులు కుట్టే వృత్తి దాదాపు కనుమరుగై కేవలం రిపేర్లు చేయడానికి వృత్తిదారులు పరిమితమైపోయారని, పల్లెల్లోనూ కం పెనీలు తయారుచేసిన చెప్పుల వినియోగమే పెరిగిపోయిందని, డి.జె. సంస్కృతి విస్తృతం కావడంతో సంప్రదాయ డప్పుల చప్పుడు మూగబోయి ఇంతకాలం ఆ వృత్తిపై ఆధారపడి న వృత్తిదారులు ప్రత్యామ్నాయ ఉపాధి పై దృష్టి పెట్టారని ఆ వృత్తిపై ఆధారపడిన పలువురు వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాలుగా ఈ వృత్తిపై ఆధారపడినవారి బతుకులు దుర్భరమయ్యాయని వ్యాఖ్యానించారు.

50 అర్జీలు పెట్టినా రూపాయైనా ఇచ్చారా?

- రైతు ఆత్మహత్యల నివారణలో కేంద్రం చర్యలు శూన్యం
- రాబోయే రోజులన్నీ టిఆర్ఎస్‌వే
- బడ్జెట్‌పై మంత్రి ఈటల సమాధానం

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ ప్రభుత్వం తన నాలుగేళ్ళ కాలంలో ప్రజా హృదయాలను చూరగొన్నదని, భవిష్యత్తులో తెలంగాణ గడ్డ మీద ఏ పార్టీకి పుట్టగతులు ఉండ బోవని, రోజులు టిఆర్ఎస్‌వేనని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం 95 శాతం వరకు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని తాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి 50సార్లు దరఖాస్తు పెట్టుకున్న కనీసం ఒక్క రూపా యి కూడా ఇచ్చారా అని ప్రశ్నించారు. తమ బతుకులు మారుతాయని, జీవితాలు బాగుపడుతాయని ప్రజలు ఎంతో ఆశతో కేంద్రంలో బిజెపికి ఓట్లు వేస్తే, ప్రజల హృదయాలను దోచుకునే ప్రయత్నం తప్ప కార్య క్రమాలు ఏమైనా చేశారా? అని నిలదీశారు. తాము ఆశించిన స్థాయిలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు గ్రాంట్లను మంజూరు చేయలేదన్నారు. మిషన్‌కాకతీయకు రూ.5వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.19,205 కోట్ల సహాయం చేయాలని నీతిఅయోగ్‌కు ప్రతిపాదించినప్పటికీ కేంద్రం ఒక్క రూపాయీ కూడా ఇవ్వలేదన్నారు. శాసనసభలో మంగళవారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో మంత్రి ఈటల సమాధానమిచ్చారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బిజెపి పాలిత 21 రాష్ట్రాలలో 24 గంటల విద్యుత్‌ను ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ పుస్తకాలు ముద్రించిన తర్వాత, బడ్జెట్‌పై సలహాలు, సూచనల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులను సమావేశాన్ని ఆహ్వానించిందని వివరించారు. అప్పులు చేసి సాగునీటి ప్రాజెక్టులను, 24 గంటల విద్యుత్ సరఫరాను, రహదారుల నిర్మాణం, గురుకుల పాఠశాలలను తదితర కార్యక్రమాలను చేపట్టడం తప్పా అని అన్నారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సమన్యాయం, సమదృష్టితో ముందుకెళ్తుందన్నారు. బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రగతి భవన్ వేదిక ద్వారా సిఎం బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీకి చెందిన కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 27,588 ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. విశ్వవిద్యాలయాల పోస్టుల భర్తీకి మంజూరు చేశామన్నారు.

బడ్జెట్‌లో 95 శాతం ఖర్చులు : రాష్ట్ర ప్రభుత్వం 2014–15 బడ్జెట్‌లో (62%) ఖర్చు, 2015–16లో 1,15, 600 కోట్ల కేటాయిస్తే, రూ. 97,564 కోట్లు, (84.33%) ఖర్చు చేసిందని మంత్రి ఈటల తెలిపారు. 2016–17లో రూ. 1, 30,415 కోట్ల బడ్జెట్‌లో రూ.1,21,735కోట్లు,(93. 34%), 2017–2018లో 1,49,640 కోట్లు, కేటాయించగా,రూ.1,42,506కోట్లు (95%) ఖర్చు అవుతుందన్నారు. పన్నుల విషయంలో 2014– 15లో రూ. 9,740 కోట్లు వసూలు చేయాలని అంచనా పెట్టుకుంటే అందులో రూ. 8,189 కోట్లు వసూలయ్యాయని, అలాగే 2015–16లో రూ.12,823కోట్లు అంచనా వేయగా, రూ. 12,353 కోట్లు వసూలయ్యాయని, 2016–17లో 13,955 కోట్లు అంచనా వేయగా రూ. రూ. 14,873 కోట్లు, 2017–18లో 17,004 కోట్లు కాగా రూ. 16,420 కోట్లు వసూలయ్యాయని, 2018–19లో రూ. 19,207 కోట్లను వసూలు అవుతుందని అంచనా పెట్టుకున్నట్లు వివరించారు.



తగ్గిన కేంద్ర గ్రాంట్లు : తెలంగాణ రాష్ట్రానికి 2014–15లో రూ 21,721 కోట్ల గ్రాంట్ వస్తుందని ఆశపెట్టుకుంటే కేంద్రం కేవలం రూ. 7,118 కోట్లను మాత్రమే విడుదల చేసిందని మంత్రి ఈటల అన్నారు. 2015–16లో రూ. 12, 400 కోట్లు ఆశించగా రూ. 9,076 కోట్లు, 2016–17లో రూ. 14,557 కోట్లుగాను రూ. 9052 కోట్లు వచ్చాయని తెలిపారు. బిజెపి సభ్యులు తమపై ఆరోపణలు చేసేబదులుగా రాష్ట్రానికి నిధులు వచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని, పార్టీ అధిష్టానాన్ని ఒప్పించాలని సూచించారు. ఐటి రంగంలో దేశంలోనే తెలంగాణ మూడవ స్థానంలో ఉన్నదని, అతిత్వరలోనే మొదటి, లేదా రెండవ స్థానానికి చేరుకుంటామన్నారు. ఐటి రంగంలో రూ. 85,470 కోట్ల ఎగుమతులు అయ్యాయని, ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లలో 3.23వేల మంది పనిచేస్తే, తమ మూడేళ్ల పాలనలో 4.31.891 మంది పని చేస్తున్నారని గుర్తు చేశారు.

దేవుళ్ల పేర్లతో గెలిచేవాళ్లం కాదు :తాము దేవుళ్ల పేర్లు చెప్పుకుని ఓట్లు పొంది, గెలిచేవాళ్లం కాదని, దేవాలయాలకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. యాదగిరిగుట్ట, వేములవాడ, కొండగట్టు అంజన్న దేవాలయానికి వస్తే ప్రభుత్వం చేపడుతున్న పనులు కనిపిస్తాయని చెప్పారు. పట్టణాలకే పరిమితం కాకుండా ఒకసారి గ్రామాలకు, జిల్లాలకు వస్తే అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను చూపిస్తామని ఈటల బిజెపి సభ్యులకు సూచించారు.

రూ. 1500 కోట్ల పెట్టుబడులు..!

- వరంగల్ టెక్స్‌టైల్ పార్కుపై టికె కెమికల్స్ ఆసక్తి
- టిఎస్ఐఐసితో కలిసి నేడు క్షేత్రస్థాయి పర్యటన

మన తెలంగాణ/ హైదరాబాద్ : వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో రూ. 1500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియా టికె కెమికల్స్ కార్పొరేషన్ టైక్స్‌టైల్స్ కంపెనీ ఆసక్తిగా ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. రాష్ట్ర మంత్రి కెటి రామారావు ఇటీవల కొరియాకు వెళ్లిన సందర్భంలో తెలంగాణలో పెట్టుబడులకు వారు ఆసక్తిని కనబరిచారని, ఈ క్రమంలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆ కంపెనీ ప్రతినిధులు టిఎస్ఐఐసి ఉన్నతాధికారులతో కలిసి బుధవారం వరంగల్ టెక్స్‌టైల్ పార్కును సందర్శించనున్నట్లు తెలిపారు. దక్షిణ కొరియా ప్రతినిధి బృందంతో జయేష్ రంజన్, టిఎస్ఐఐసి వైస్ ఛైర్మన్ వెంకట నర్సింహారెడ్డి, బోర్డు సభ్యులు మంగళవారం సమావేశం అయ్యారు.

వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి వివరించారు. పారిశ్రామిక అభివృద్ధిలోనూ, సులభతర వాణిజ్య విధానంలోనూ తెలంగాణ ముందంజలో ఉందని గుర్తుచేశారు. టికె కెమికల్స్ కార్పొరేషన్‌కు యార్న్ ఫిలమెంట్ వస్త్ర తయారీలో దక్షిణ కొరియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని జయేష్ రంజన్ వివరించారు. కొరియన్ ఫెడరేషన్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలోని ఈ కంపెనీ ఫిలమెంట్ స్పాండెస్, లైక్రా యార్న్ ఫిలమెంట్ దుస్తులను తయారు చేస్తున్న అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఆర్‌టిసిలో ఖాళీల భర్తీకి మోక్షం



మన తెలంగాణ / హైదరాబాద్ : టిఎస్ఆర్‌టిసిలో కండక్టర్, డ్రైవర్, మెకానిక్ తదితర కేటగిరిలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు, సకల జనుల సమ్మె కాలాన్ని 'స్పెషల్ క్యాజువల్ లీవ్'గా పరిగణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఆర్‌టిసి సమస్యలపై సంస్థ యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులతో రాష్ట్ర మంత్రులు మంగళవారం చర్చలు జరిపారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, టి.హరీష్‌రావు, పి.మహేందర్‌రెడ్డి, టిఎస్ఆర్‌టిసి ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, రవాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణ రావు, టిఎంయు కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.థామస్‌రెడ్డి, అధ్యక్షులు వి.తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు పై నిర్ణయాలు తీసుకున్నట్లు టిఎంయు ఒక ప్రకటనలో తెలియజేసింది. కార్మికుల ఉద్యోగ భద్రతకు సంబంధించి యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేశారు.

ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ఎనిమిది ఎకరాల అనువైన స్థలాన్ని ఎంపిక చేశామని, ప్రభుత్వం ఇందుకు సమ్మతి తెలిపి ఆ స్థలాన్ని జర్నలిస్టుల ఇండ్ల కోసం కేటాయించాలని ఎంఎల్ఏ పువ్వాడ అజయ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 200 మంది జర్నలిస్టులకు ఈ స్థలం సరిపోతుందని శాసన సభ జీరో అవర్‌లో ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకునివచ్చారు. దీనికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పందిస్తూ సభ్యుడు చెప్పిన అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంజాన్ పండుగ సమీపిస్తోందని, చార్మినార్ వద్ద నున్న మక్కా మసీదుకు రంగులు, ఇతర మరమ్మతులు చేయాలని చార్మినార్ ఎంఎల్ఏ మహ్మద్ పాషా ఖాద్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాల్మీకీ, మోచీ, బుడగ జంగం తదితర 59 ఎస్‌సి ఉప కులాలకు అధికారులు సకాలంలో కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఉప్పల్ ఎంఎల్ఏ ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ సభ దృష్టికి తీసుకుని వచ్చారు. 1100 మంది విద్యార్థుల సంఖ్య గల నారాయణపేట డిగ్రీ కళాశాలకు 75 లెక్చరర్ పోస్టులు మంజూరు అయితే ప్రస్తుతం 11 మందితోనే నెట్టుకొస్తున్నారని, ఇలా చేయడం వల్ల ఉన్న అధ్యాపకులపై భారం పడడంతో పాటు విద్యార్థులకు సరైన న్యాయం జరగదని నారాయణపేట ఎంఎల్ఏ రాజేందర్ రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి డిప్యూటి సిఎం కడియం సమాధానమిస్తూ ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాజ్యసభ ఎన్నికల మాక్ పోలింగ్



మన తెలంగాణ/హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి టిఆర్ఎస్ భవన్ లో ఎంఎల్ఏలకు మంగళవారం సాయం త్రం తెలంగాణ భవన్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. తొలుత ఎంఎల్ఏలందరి కీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎన్నికల విధానం, ఓటు వేసే పద్ధతి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏలకు నమూ న ఓటరు స్లిప్పులతో పాటు, వారు ఏ అభ్యర్థికి ఏ క్రమపద్ధతిలో ఓటు వేయాలనే కాగితాలను కూడా అందజేశారు. మాక్ పోలింగ్ సందర్భంగా అందరూ సక్రమంగానే ఓటు వేసినట్లు తెలిసింది. టిఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులకు కేటాయించిన ఎంఎల్ఏలకు అవగాహన కల్పించడంతో పాటు, వారిని సక్రమంగా ఓటు వేయిచేందుకు ఇద్దరు చొప్పున మంత్రులను ఇంఛార్జులుగా నియమించారు. ఇలా మంత్రులు ఈటల, కెటిఆర్‌లకు జోగినపల్లి సంతోష్‌కుమార్, కడియం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు బండా ప్రకాశ్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావులకు బడుగుల లింగయ్య యాదవ్ బాధ్యతలను అప్పగించారు. బుధ, గురువారాల్లో కూడా అసెంబ్లీ ఆవరణలోని టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మాక్ పోలింగ్‌ను నిర్వహించనున్నారు.

ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అసెంబ్లీలోని స్పీకర్ మధుసూదనచారి చాంబర్‌లో మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, టిఆర్ఎస్ పార్టీ ఎంఎల్‌ఎల సమక్షంలో ఈటల కేక్ కట్ చేయగా అందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సభలో సిఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. అంతకు ముందు ఉదయమే మంత్రి ఇంటికి పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధులు వెళ్లి బర్త్‌డే విషెస్ చెప్పారు.



“ మూఢవిశ్వాసాలను, హేతువాదానికి నిలబడని వాదనలను విశ్వసించకూడదు. సమాజం చైతన్యవంతంగా రూపొందాలంటే కాలాన్ని అనుసరించి పురోగమించాలి. – డా॥బి.ఆర్.అంబేద్కర్ ”



తిరుగులేని విజేత పుతిన్

సంపాదకీయం

ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన రష్యా అధ్యక్షునిగా వ్లాదిమిర్ పుతిన్ మరో పదవీ కాలానికి ఎన్నికైనారు. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో 67.7శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, పుతిన్‌కు 76.69శాతం ఓట్లు లభించాయి. అత్యంత ప్రజాదరణగల నాయకునిగా రుజువు చేసుకున్నాడు. 2000సంవత్సరం నుంచి రష్యాను అధ్యక్షునిగా లేక ప్రధానిగా ఏదోక అత్యున్నత హోదాతో పరిపాలిస్తున్న ఈ కెజిబి పూర్వాధికారి, జోసఫ్ స్టాలిన్ తర్వాత ఎక్కువకాలం అధికారంలో ఉన్న వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. పుతిన్ ఓడిపోతే వార్తగాని గెలుపొందటంలో ఆశ్చర్యం లేదు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తదుపరి అతిపెద్ద భౌగోళిక ప్రాంతం, అధిక జనాభా కలిగిన రష్యన్ ఫెడరేషన్ దాని వారసురాలైంది. ఆ విచ్ఛిన్నానికి మూలకారకుల్లో ఒకరైన బోరిస్ ఎల్ట్సిన్ 1991లో అధ్యక్షునిగా ఎన్నికై 1996లో తిరిగి అధికారం నిలుపుకున్నాడు. 2000 సంవత్సరం ఎన్నికల్లో పుతిన్ రంగంలో దిగి అధ్యక్షునిగా తొలిసారి ఎన్నికైనాడు. 2004లో మళ్లీ గెలిచాడు. అయితే ఏ వ్యక్తీ వరుసగా రెండు పదవీ కాలాలకు మించి అధికారంలో ఉండరాదన్న రాజ్యాంగ ఆంక్ష దృష్ట్యా, 2008లో పుతిన్ అనుయాయి ద్విత్రీ మెద్వెదేవ్ అధ్యక్షునిగా ఎన్నికకాగా, పుతిన్ ప్రధానిమంత్రి పాత్రలోకి మారాడు. 2012లో వారు పాత్రలు మార్చుకున్నారు. అంతేగాక అధ్యక్ష పదవీకాలాన్ని నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచుతూ డిక్రీ జారీ చేశారు. 65 సంవత్సరాల పుతిన్ 2024 వరకు పదవిలో ఉంటారు.

సోవియట్ యూనియన్ నిర్మించిన సోషలిస్టు వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థలోకి తిరోముఖం పట్టించే క్రమంలో రష్యన్‌లు అనేక కష్టనష్టాలకు గురైనారు. అయితే చారిత్రకంగా బలమైన శక్తి అయిన రష్యాను, సోవియట్ పాలనలో అగ్రరాజ్యంగా ఎదిగి అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఢీకొన్న రష్యాను అదే ఆత్మగౌరవంతో నడిపించలేక పుతిన్ ఆరంభంలో పెట్టుబడిదారీ ప్రపంచంతో కొంతమేరకు రాజీపడ్డాడు. అయితే పూర్వపు సోవియట్ రిపబ్లిక్‌ల్లో కాలుమోపి రష్యాను చక్రబంధంలో ఇరికించటానికి నాటో కూటమి చేసిన ప్రయత్నాలు రష్యన్ ఆత్మాభిమానానికి సవాలు విసిరాయి. ఆ తదుపరి పుతిన్ అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకంగా ముందుకు వచ్చాడు. సామ్రాజ్యవాదుల పన్నాగాలను భగ్నం చేసేందుకు రష్యా 2014లో క్రిమియా, సెవస్తోపోల్‌లను స్వాధీనం చేసుకుంది. సిరియా అంతర్యుద్ధంలో అధ్యక్షుడి పక్షాన సైనికంగా నిలబడింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకుందనే ఆరోపణలు, బ్రిటన్‌లో మాజీ రష్యన్ గూఢచారిని, అతని కుమార్తెను రసాయన ప్రయోగంతో చంపిందనే ఆరోపణలకు గురైంది. ఈ చివరి ఆరోపణపై బ్రిటన్, రష్యాల మధ్య తాజాగా దౌత్యాధికారుల బహిష్కరణలతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. రసాయనిక ఆయుధాలన్నిటినీ ధ్వంసం చేసిన రష్యా, ఎన్నికలు, సాకర్ ప్రపంచ కప్ పోటీల ముందు అటువంటి పనిచేస్తుందా అంటూ పుతిన్ బ్రిటన్ ఆరోపణల ను తోసిపుచ్చాడు

అయితే, ప్రపంచంలో ఏ ప్రాంతాన్నైనా చేరుకోగల అణ్వస్త్రాలను రష్యా అభివృద్ధి చేసిందని ఎన్నికల సమయంలో ప్రకటించిన పుతిన్, ఎన్నికల ఫలితం తదుపరి ‘ఆయుధ పోటీ పెంచే ఉద్దేశం’ తమకు లేదని, రాజకీయ, దౌత్యమార్గాల్లో సమస్యల పరిష్కారం కోరుకుంటున్నట్లు స్వరం మార్చారు. అంతర్జాతీయం కన్నా దేశీయ విషయాలపై దృష్టి పెడతానని, రక్షణ ఖర్చు తగ్గించి విద్య, వైద్యం, మౌలిక వసతులకు పెట్టుబడులు పెంచి జీవన ప్రమాణాలు మెరుగుచేసేందుకు కృషి చేస్తానని పుతిన్ దేశ ప్రజలకు వాగ్దానం చేశారు.

బలమైన ప్రత్యర్థిగా పరిగణించబడిన అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అలెక్సీ నవాల్నీని అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించటం వల్ల పుతిన్ గట్టి ప్రత్యర్థి లేకుండా జాగ్రత్త పడ్డాడు. ఆ విధంగా ఏకవ్యక్తి నిరంకుశ పాలనను పటిష్టం చేసుకోవటం రష్యన్ ఎన్నికల్లో గమనించాల్సిన అంశాల్లో మొదటిది. రన్నరప్(రెండవస్థానం)గా ఉన్న కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థుల ఓటు ఒక ఎన్నికల నుంచి మరో ఎన్నికలకు తగ్గుతూ రావటం (తాజా ఎన్నికల్లో 13.3శాతం)రెండవది. ఏమైనా, అమెరికా, పశ్చిమ దేశాలకు దీటుగా నిలబడటంలోనే రష్యా అంతర్జాతీయ ప్రతిష్ట ఉందనుట నిర్వివాదం.

కేజ్రీ ఆరోపణలు, క్షమాపణలు


చూపు

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తాజాగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కూడా క్షమాపణలు చెప్పారు. దీనితో కేజ్రీవాల్‌పై పరువు నష్టం దావా ఉపసంహరణకు ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టులో వారిద్దరి సంయుక్త దరఖాస్తు దాఖలైంది. ఇందుకు కొద్దిరోజుల ముందు కేజ్రీవాల్ అకాలీదళ్ నాయకుడు విక్రమ్‌సింగ్ మజీతా మీద కూడా డ్రగ్స్ వ్యవహారంలో ఆరోపణలు చేసి క్షమాపణలు చెప్పుకున్నారు. ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభానికి ప్రయాణిస్తున్న పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీకి పేరుంది. గత సంవత్సరం జరిగిన పంజాబ్ శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ, కాంగ్రేస్ రెండు పార్టీలూ అక్కడి డ్రగ్స్ సమస్యను ప్రముఖంగా ప్రస్తావించాయి. శిరోమణి అకాలీదళ్ పార్టీ డ్రగ్స్ మాఫియాకు వత్తాసు పలుకుతుందన్న ఆరోపణలున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఈ ఆరోపణలతోనే ప్రచారం ఉధృతంగా చేశారు. అక్కడ డ్రగ్స్ మాఫియాకు మద్దతిస్తున్న నాయకుడుగా మజీతా పేరు ను కేజ్రివాల్ తో సహా మరికొందరు ఆప్ నేతలు ప్రస్తావించారు. మజీతా పేరును ఇందులోకి లాగడంతో ప్రకాష్ సింగ్ బాదల్ ప్రభుత్వం ఇరుకున పడింది. బాదల్ ప్రభుత్వంలో మజీతా మంత్రి మాత్రమే కాదు, కేంద్ర మంత్రి హరిసిమ్రత్ కౌర్ బాదల్‌కు సోదరుడు. సుఖ్ బీర్ సింగ్ బాదల్ కూతురే హరిసిమ్రత్ సింగ్ బాదల్.

కేజ్రీవాల్ అకస్మాత్తుగా క్షమాపణ లేఖ మజీతాకు పంపడంతో ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కసారి ఖంగుతింది. ఈ క్షమాపణల గురించి పంజాబ్ పార్టీ విభాగాన్ని సంప్రదించలేదని కొందరు తిరుగుబాటు చేశారు. పంజాబ్ రాజకీయాల్లో ఈ సమస్యపైనే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పోరాడుతున్నారు. అలాంటిది పార్టీ అధినాయకుడు ఒక్కసారి యు టర్న్ తీసుకోవడంతో వారికి ఏం చేయాలో పాలుబోలేదు. ఈ క్షమాపణ లేఖ రాగానే మజీతా ప్రెస్ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసి ఢిల్లీ ముఖ్యమంత్రిని ప్రశంసించాడు. మజీతా ఈ క్షమాపణలను స్వీకరించడంతో ఇక కేజ్రీవాల్ పై పరువునష్టం కేసు లేనట్లే. కాని పంజాబులో ఆమ్ ఆద్మీ పార్టీ నేతల్లో ఒకరైన సుఖ్ పాల్ సింగ్ ఖేరా ఈ క్షమాపణలపై మండిపడ్డాడు. కుంవర్ సందూ, ఆప్ రాష్ట్ర నాయకుడు బల్వంత్ సింగ్ మాన్, ఉపాధ్యక్షుడు అమన్ అరోరా తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ తిరుగుబాటును కేజ్రీవాల్ చాలా చాకచక్యంగానే అణిచేశాడని అనుకోవాలి. పంజాబ్ పార్టీ నాయకులతో కేజ్రీవాల్ మొన్న నిర్వహించిన సమావేశానికి సగంమందికి పైగా హాజరయ్యారు. పంజాబ్‌లో ఆప్‌కుగల 20 మంది శాసనసభ్యుల్లో 10మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. కేజ్రీవాల్ ఇచ్చిన వివరణతో వారంతా సంతృప్తి చెందినట్లు తెలుస్తోంది.

అకాలీ నాయకుడు బిక్రమ్ సింగ్ మజీతాకు కేజ్రీవాల్ అకస్మాత్తుగా ఈ క్షమాపణ లేఖ పంపలేదని, దీని వెనుక తెరచాటు ప్రయత్నాలు చాలా జరిగాయని కూడా వార్తలు వచ్చాయి. న్యూఢిల్లీ, చండీగఢ్ లలో ఆప్, అకాలీదళ్ నేతల మధ్య జరిగిన అనేక సమావేశాల ఫలితమే ఈ క్షమాపణ లేఖ అని తెలుస్తోంది. ఈ సమావేశ విషయంలో బిజెపి ఢిల్లీ శాసనసభ్యుడు మంజిందర్ సింగ్ సిర్సా కూడా కీలకపాత్ర పోషించినట్లు వార్త. నిజానికి కేసు కేవలం అరవింద్ కేజ్రీవాల్ ఒక్కడిపైనే లేదు. బిక్రమ్ సింగ్ మజీతాపై ఆరోపణలు చేసింది ఆయన ఒక్కడే కాదు. ఆప్ నాయకులపైన సంజయ్ సింగ్, ఖేతాన్‌లు కూడా ఈ ఆరోపణలు చేశారు. వారిపై కూడా పరువునష్టం కేసులున్నాయి. ఇప్పుడు కేవలం అరవింద్ కేజ్రీవాల్‌పై మాత్రమే కేసు ఉపసంహరించుకోవడం జరుగుతోంది. మిగిలిన ఇద్దరిపై కేసులు కొనసాగుతున్నాయి. వారిద్దరు క్షమాపణలు చెప్పడానికి సిద్ధం కాలేదు.

అరవింద్ కేజ్రీవాల్ ఘర్షణాత్మక రాజకీయాలకు పెట్టింది పేరు.




కాని ఈ క్షమాపణల ఉదంతం తన రాజకీయాల శైలి మార్చుకుంటున్నాడా అనిపిస్తుంది. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయానికి ముఖ్యమైన కారణం అవినీతిపై పోరాటం. అవినీతిని కూకటివేళ్ళతో పెకలిస్తామని వాగ్దానం చేయడమే కాదు, పలువురు నాయకుల అవినీతిపై నిర్భయంగా కేజ్రీవాల్ మాట్లాడాడు. ఆయన అధికారంలోకి వస్తే ఖచ్చితంగా వ్యవస్థ ప్రక్షాళనమవుతుందని ప్రజలు నమ్మే వాతావరణం ఏర్పడింది. మరో విధంగా చెప్పాలంటే బిజెపి కూడా ఇలాంటి ఎత్తుగడనే అమలు చేసింది. కాంగ్రేసు నేతల అవినీతిపై బిజెపి నాయకులు అలుపెరుగని దాడులు చేశారు. అదేపని కేజ్రీ కూడా మరింత ఉధృతంగా చేశాడు. కాని కేవలం ఆరోపణలుచేస్తే సరిపోదు వాటిని రుజువు చేయవలసి ఉంటుంది. ఆరోపణల రాజకీయాలు కొంతకాలం వరకు ప్రజలు వింటారు కాని ఆ తర్వాత కేవలం ఆరోపణలే తప్ప మరేమీ లేదని గ్రహిస్తారు. ఆ తర్వాత ఈ ఆరోపణలకు విలువ ఉండదు. ఈ వాస్తవాన్ని కేజ్రీవాల్ గుర్తించినట్లు కనబడుతుంది. ఆరోపణల రాజకీయాలు ఎంతో కాలం నడపలేమన్నది ఆయనకు అర్థమైంది. ఇప్పుడు మజీతాకు నితిన్ గడ్కరీకి క్షమాపణలు చెప్పడం ద్వారా మరోసారి సంచలనాత్మక రాజకీయాలకు కేజ్రీవాల్ కారణమయ్యాడు. బహుశా ఇలా ఏ నాయకుడు ఇంతకు ముందు చేయలేదు. నేనింతకు ముందు చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేనందు వల్ల క్షమాపణ చెబుతున్నట్లు ఆయన లేఖలో రాశాడు. ఆధారాలు లేని ఆరోపణలు అసలెందుకు చేశాడన్నది మొదటి ప్రశ్న. కేజ్రీవాల్ చాలా తెలివిగా రాజకీయాల స్క్రిప్టు మార్చే ప్రయత్నం చేస్తున్నారని అనుకోవాలి లేదా చాలా అతితెలివిగా వ్యవహరించి దెబ్బతింటున్నాడని అనుకోవాలి. అవినీతి ఆరోపణలు, నినాదాలు, ఫలానా అవినీతి పరుడిని జైల్లో పడేస్తానన్న హూంకరింపులు ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకుంటాయి. ఈ ఆరోపణలు కొంతకాలం సంచలనాత్మకంగా ఆరోపణలు చేస్తున్న నాయకుడికి కావలసిన ప్రచారం చేసి పెడతాయి. కాని ఆరోపణల్లో కొన్నయినా రుజువు చేయలేకపోతే విలువ ఉండదు. కాబట్టి ఇలాంటి ఆరోపణలు కేజ్రీ చేసినప్పుడు, ఆయనకు ఇదంతా మామూలే అన్న ధోరణిలో అందరూ మాట్లాడతారు. కాని నిర్దిష్టంగా చేసిన ఇలాంటి ఆరోపణలను రుజువు చేయవలసిన బాధ్యత కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. అక్కడ వైఫల్యం ఎదురైంది. కేజ్రీ ఎవరినీ లెక్క చేయలేదు. సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా, బిజెపి నాయకుడు నితీష్ గడ్కరి, మాజీ న్యాయశాఖ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇలా అనేకమందిపై ఆరోపణలు చేశాడు. ఈ పనే బిజెపి కూడా చేస్తూ వస్తోంది. వాద్రాపై బిజెపి నేతల ఆరోపణలూ అలాంటివే.

ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు అవతలి వ్యక్తి తన నిర్దోషిత్వం నిరూపించుకునేందుకు ఆత్మరక్షణలో పడతారు. రాజకీయంగా ఇది ప్రత్యర్థులను ఇబ్బందిపెట్టే ఎత్తుగడ. ఈ ఎత్తుగడను ఆప్ గొప్పగా అమలు చేసింది. బిజెపి కూడా ఇదే ఎత్తుగడను అమలు చేస్తుంది. అవినీతిపై పోరాటం పేరుతో రంగంలోకి దిగిన అన్నా హజారే కూడా ఇప్పుడు మాట్లాడడం లేదు. బిజెపికి వ్యతిరేకంగా ఒక్కటవుతున్న రాజకీయపార్టీలు దాని వాగ్దానాల్లో డొల్లతనాన్ని ఎండగట్టడానిక ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెసు ఈ రాజకీయ పార్టీలతో కలుస్తుందా లేక ఒంటరిగా పోరాడుతుందా అన్నచ ర్చలు జరుగుతున్నాయి. నీరవ్‌మోడీ వంటి అవినీతి కుంభకోణమే ఇప్పుడు లోపలిపేజీల్లోకి వెళ్ళిపోయిన పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో రుజువులులేని ఆరోపణలకు పెద్ద విలువ ఉండదు.

* ఆయెషా

ఈశాన్యం కాషాయం అయ్యిందా?



లంకా పాపిరెడ్డి
8500853792

మార్చిమూడున మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఒకటి, రెండు పత్రికలు, ఛానెళ్లు తప్ప ప్రధాన స్రవంతి అని చెప్పుకునే మీడియా పైపై పరిశీలనలతో, అర్ధ సత్యాలతో ఈశాన్యం అంతా కాషాయమయం అయ్యిందంటూ ఊదరగొట్టింది. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు అనే విషయాన్ని మాత్రమే గీటురాయిగా తీసుకుని విజయగాథలు అల్లింది. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి, ఎన్ని సీట్లు వచ్చాయి అనే లెక్కలు పక్కన పెట్ట బడ్డా యి. ఎలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నది కూడా మీడియా పట్టించుకోలేదు. అనైతిక పద్ధతిలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసినా ప్రశ్నించేది పోయి విజయ గీతికలు ఆలాపించింది. స్వంతగా బలం లేకపోయినా ఇతర పార్టీల ఎమ్.ఎల్.ఎ.లను కొనుగోలు చేసి, మంత్రి పదవుల ఆశలు చూపెట్టి, ఎలా కుదిరితే అలా చేసి మెజారిటి సాధించినా, పరవశించి పొగిడింది మీడియా. కాని అటువంటి పార్టి నైతికతను ప్రశ్నించ లేదు, విమర్శించలేదు. కాకపోగా, అవకాశవాదాన్ని, అనైతికతను గొప్ప ఎత్తుగడలుగా విశ్లేషిస్తున్నది. అపర చాణక్యం అంటూ కీర్తిస్తున్నది. ఇది మీడియా దయనీయ పరిస్థితిని, ప్రజాస్వామ్యంలో దాని అసమర్థ పాత్రనే ప్రతిబింబిస్తున్నది. మేఘాలయ విషయానికి వస్తే మొత్తం మేఘాలయలో బి.జె.పి. విజయ దుందుభి మోగించినట్లుగా ప్రచారం జరిగింది. కొన్రాడ్ సంగ్మా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజున షిల్లాంగ్‌లో దారులన్నీ కాషాయమయం చేసారు. బి.జె.పి. నే మేఘాలయలో అన్ని సీట్లను గెలిచినట్లుగా భ్రమింపచేశారు. నిజానికి అక్కడ బి.జె.పి.కి వచ్చింది రెండు సీట్లు మాత్రమే. ఇక బి.జె.పి.వి గొప్ప ఎత్తుగడలుగా, దానిని గొప్ప సోషల్ ఇంజనీరింగ్‌గా జరిగిన ప్రచారం కూడా ఉత్తిదే అని, అంతా అవకాశవాదమే అని మేఘాలయ ఉదాహరణ చూస్తే తెలుస్తుంది. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్.డి.ఎ.)లో భాగస్వామి అయినప్పటికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్.పి.పి.) స్వతంత్రంగానే పోటీ చేసింది. మొత్తం 59 సీట్లకు ఎన్నికలు జరిగితే ఎన్.పి.పి. 52 సీట్లకు పోటీచేసింది. బి.జె.పి. 47సీట్లకు పోటీ చేసింది. ఎన్.డి.ఎ.లో ఉన్న అన్ని పార్టీలు పరస్పరం పోటీ పడ్డాయి. పేరుకే తప్ప వాస్తవంలో ఎన్నికల ముందు ఒక కూటమిగా ఏర్పడడం గాని, ఎన్నికల్లో ఒక కూటమిగా పోటీ చేయడం గానీ జరగలేదు. ఎన్.పి.పి. తన స్వంత బలం పైన ఆధారపడే 19 స్థానా లు గెలిచింది. ఎన్.డి.ఎ. లోని ఇతర పార్టీలు కూడా వాటి బలం పైనే ఆధారపడి స్వతంత్రంగా గెలిచాయి. బి.జె.పి. నుండి గెలిచిన అభ్యర్థులు ఇద్దరు కూడా ఏ పార్టీ టికెట్ పైన అయినా గెలవగలిగే అభ్యర్థులే. బి.జె.పి. గాలి కాని, దుమారం కాని అంతా ఒట్టిదే. ఎన్నికలు తర్వాతనే ఎవరికి ఎన్ని సీట్లు వచ్చాయనే దాన్ని బట్టే కూటమి కట్టేందుకు బి.జె.పి. సిద్ధమైంది. ఇది అపర చాణక్యం కాదు, అవకాశవాదం. ఈ లెక్కన మిగతా పార్టీల కంటే ఎక్కువ సీట్లు(21)సాధించిన కాంగ్రెస్ పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ముందు ఆహ్వానించ వలసి ఉండింది. కేంద్రంలో బి.జె.పి. అధికారంలోకి వచ్చినప్పటినుండి ఈ సాంప్రదాయాన్ని తుంగలో తొక్కింది. గోవా, మణిపూర్ రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ కంటే తక్కువ సీట్లు సాధించిన బి.జె.పి., ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేసింది. ఇంకా విచిత్రం ఏమిటంటే మేఘాలయలో బి.జె.పి. కి మొదటి సారి రెండు సీట్లు వచ్చినట్లు కొన్ని పత్రికలు, ఛానెళ్లు ప్రచారం చేసాయి. కాని 1998లోనే బి.జె.పి. కి మూడు సీట్లు ఉన్నాయి. అయినా ఇప్పటి రెండు సీట్లను పట్టుకునే గొప్ప విజయంగా గానం చేస్తున్నది మీడియా. నాగాలాండ్ విషయంలోనూ బి.జె.పి. విజయం గురించి చిలువలు పలువలుగా ప్రచారం జరిగింది. అన్ని సీట్లూ బి.జె.పినే గెలిచిందని అనుకునేలా ఊదర గొట్టింది మీడియా. మొత్తం 59 స్థానాలకు పోటీ జరిగితే, బి.జె.పి. 20 స్థానాలలో పోటీ చేసి గెలుచుకున్నది 12 స్థానాలు మాత్రమే. నాగాలాండ్ లాంటి రాష్ట్రంలో బి.జె.పి. 12 సీట్లు గెలవడం గొప్ప విషయమే. కాని ఇది, దాని భావజాలం విస్తరించడం వల్లనో, లేక బి.జె.పి. దాని సిద్ధాంతాల ఆధారంగా బలపడడం వల్లనో జరగలేదు. మొత్తం ఈశాన్య భారతంలో చేసిన విధంగానే ఇక్కడ కూడా ఇతర పార్టీల ఎమ్.ఎల్.ఎ.లను చేర్చుకోవడం ద్వారానే, బి.జె.పి. ఇతరుల బలాన్ని తన బలంగా చూపించుకున్నది. గత అసెంబ్లి ఎన్నికలలో బి.జె.పి. ఒక్క సీటు మాత్రమే గెలుచుకున్నది. అప్పు డు కూడా కాంగ్రెస్ పార్టీ కి చెందిన ముగ్గురు ఎమ్.ఎల్.ఎ .లను తన వైపుకు తిప్పుకుని బి.జె.పి. తన బలాన్ని నాలుగుకు పెంచుకున్నది. ఇతర పార్టీలకు చెందిన, గెలవగలిగిన అభ్యర్థులనే చేర్చుకుని, బి.జె.పి. టికెట్‌లు ఇచ్చింది. అంతే తప్ప తన బలంతో గెలిపించగలిగింది. నిజానికి అటువంటి అభ్యర్థుల పైన ఆధారపడి బి.జె.పి. ఈశాన్య భారతంలో విస్తరించడానికి ప్రయత్నిస్తున్నది. ద వైర్ నిర్వహించిన చర్చలో కరణ్ థాపర్ తో మాట్లుడుతూ, మేఘాలయలోను,నాగాలాండ్‌లోనూ ప్రజలు 70శాతం మంది వరకు అభ్యర్థులకే ఓటు వేశాము పార్టీలకు కాదని, తమ సర్వేలో చెప్పారని సిఎస్‌డిఎస్ (సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్)డైరెక్టర్ సంజయ్ కుమార్ అన్నాడు. అంటే ఎవరి గాలితో ఎవరు గెలుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు ఈశాన్య భారత దేశంలోని అన్ని పార్టీలలోని అంతర్గత వైరుధ్యాలను బి.జె.పి. అవకాశ పద్ధతిలో వాడుకున్నది. ఏ ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకున్నదో ఎన్‌పిఎఫ్ పార్టీలను కూడా వదల లేదు. నాగా పీపుల్స్‌ఫ్రంట్ తో 15సం॥లుగా పొత్తు కొనసాగుతున్నా బి.జె.పి. కి పెద్ద లాభం లేకపోయేసరికి, NPF ను కూడా చీల్చడానికి పూనుకున్నది. గతంలో ఈశాన్య భారత బి.జె.పి. ఇంఛార్జ్ గా ఉండిన పి.బి. ఆచార్య నే నాగాలాండ్ గవర్నర్ గా ఉన్నారు. అధికార NPF లోని అంతర్గత సంక్షోభానికి గవర్నర్ ఊతం ఇచ్చాడని ఆరోపణలు కూడా ఉన్నాయి. చివరికి నాగా నేషనల్ ఫ్రంట్ చీలిపోయి, మాజీ ముఖ్య మంత్రి నెఫ్రియో రియో నాయకత్వంలో నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (NPP) ఏర్పడింది. బి.జె.పి. ఈ నూతన ఎన్.డి.పి.పి. తో పొత్తు పెట్టుకుని ఈసారి ఎన్నికల బరిలోకి దిగింది. NPF ను, దాని ఓటు బ్యాంకునుచీల్చడం ద్వార బి.జె.పి. గతంకంటే ఎక్కువ సీట్లు సాధించగలిగినా, బి.జె.పి. ఎన్.డి.పి.పి. కూటమికి మేజారిటి రాలేదు. బి.జె.పి. అంచనాలు విఫలం అయ్యాయి. మీడియాకు మాత్రం బి.జె.పి.ఈ వైఫల్యం కనించలేదు. ఎన్.డి. పి.పి. కి 17 సీట్లు మాత్రమే వచ్చాయి. బి.జె.పి. తెగతెంపులు చేసుకున్న, ఎన్.పి.ఎఫ్.కు 27సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 4సీట్లు మాత్రమే తక్కువ ఉండినాయి. ఇక్కడ కూడా ఎక్కువ సీట్లు సాధించిన ఎన్.పి.ఎఫ్. ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించ లేదు. చిన్న పార్టీలు, స్వతంత్రులు చివరికి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వైపే అనివార్యంగా మొగ్గుచూపాల్సి వచ్చింది. నాగాలాండ్ ఉదాహరణలో ప్రాంతీయ పార్టీల పట్ల బి.జె.పి. వ్యూహం ఏమిటో మరోసారి అర్థం చేసుకోవచ్చు. బి.జె.పి. ఏ ప్రాంతీయ పార్టీలతో ముందు పొత్తు పెట్టుకుంటుందో ఆ ప్రాంతీయ పార్టీలనే అణగదొక్కి పైకి ఎక్కాలని చూస్తుంది. అయినా ఇక్కడ అంచనాలు విఫలం అయ్యి ఎన్.పి.ఎఫ్. కే ఎక్కువ సీట్లు వచ్చాయి. దానితో బి.జె.పి. తిమ్మిని బమ్మి చేసి మాత్రమే ఎన్.డి.పి.పి.కి చెందిన రియో నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మీడి యా మాత్రం బి.జె.పి.ని, దాని ఎత్తుగడలను పొగడ్తలలో ముంచివేసింది. కాని ఈ అవకాశవాద రాజకీయాలు, నిరంతర అస్థిరతకు, అరాచకత్వానికి దారితీస్తాయని హెచ్చరించే స్థాయిలో మీడియా లేకుండా పోయింది. త్రిపుర మాత్రం మేఘాలయ నాగాలాండ్ లాంటి రాష్ట్రం కాదు. ఆ రెండు రాష్ట్రాలలో మూలవాసుల సంఖ్య ఎక్కువ. కాని త్రిపురలో వారి సంఖ్య తక్కువ. 1941లో అక్కడ 50శాతం కంటే ఎక్కువగా ఉన్న మూలవాసులు ఈ రోజు 28 శాతానికి పడిపోయారు. దేశ విభజన సమయంలోనూ తరువాత 1971యుద్ధసమయంలోనూ బెంగాలీ ప్రజలు పెద్దఎత్తున త్రిపురలోకి వలస వచ్చారు. ఈ కారణంగా బెంగాలీ ప్రజలకు ఆదివాసులకు మధ్య వైరుధ్యాలు కొనసాగు తూ వస్తున్నాయి. ఈ వైరుధ్యాలను తగ్గించడానికి CPI M ప్రయత్నించింది. ఈ వైరుధ్యాలను బి.జె.పి. వాడుకుని మూలవాసుల పార్టీ, ఇండీజియనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (IPFT)తో పొత్తు పెట్టుకున్నది. మరో వైపు మెజారిటి బెంగాలీ ప్రజలు హిందువులు కావడంతో వారిలో చొచ్చుకు పోవడం, బి.జె.పి.కి పెద్ద సమస్య కాలేదు. కేవలం బెంగాలీ ప్రజలు హిందువులు కావడం వల్లనే బి.జె.పి.కి సులువు కాలేదు, అప్పటికే త్రిపురలో ప్రతిపక్షానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడి ఉన్నది. త్రిపురలో నిజానికి వామపక్ష ప్రభుత్వం 1978 నుండి అధికారంలో ఉన్నది. మధ్యలో 1988–93లో మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండింది. అంటే మధ్యలో కాంగ్రెస్ పార్టీ ఐదు సంవత్సరాల పాలన తీసివేస్తే వామపక్ష ప్రభుత్వం మొత్తం 35 సంవత్సరాలు త్రిపురలో ప్రభుత్వాన్ని నడిపింది. ఈ సుదీర్ఘ కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినా, మౌలికమైన మార్పులు, ప్రజల ఆదాయాలను పెంచే అభివృద్ధిని సాధించలేకపోయింది వామపక్ష ప్రభుత్వం. విద్య(94 శాతం), వైద్య విషయాలలో ఉన్నతమైన కొలమానాలను నెలకొల్పినా నిరుద్యోగాన్ని పరిష్కరించ లేకపోయింది. తీవ్ర మైన నిరుద్యోగంవామపక్ష ప్రభుత్వానికి శాపం గా మారింది. ప్రజల్లో నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి కారణం కేవలం ఆర్థిక పరమైన విషయాలే కాదు, రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. అవే ప్రధానం కూడా. CPIM ఎప్పుడూ త్రిపుర ముఖ్యమంత్రి నిస్వార్థత గురించి, సాధారణ జీవితం గురించిన ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తుంది. కాని మొత్తం పార్టీకి ప్రజలకు మధ్య ఉన్న సంబంధాల గురించి పట్టించుకున్నట్లు లేదు. మిగతా పార్టీలతో ఉన్న సంబంధాలకు ప్రాముఖ్యత ఇవ్వలేదు. CPI M మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగింది. త్రిపురలో ఏమీ లేని బి.జె.పి. కి 43 శాతం ఓట్లు రావడమే దీనికి నిదర్శనం. అయితే త్రిపురలోకి బి,జె.పి. దూసుకు రాకపోయినా వామపక్ష ప్రభుత్వం ఓడిపోయి ఉండేది. అప్పుడది తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోయి ఉండేది. త్రిపురలో వామపక్ష ప్రభుత్వం పైన ఏర్పడిన వ్యతిరేకతను కాంగ్రెస్‌పార్టీ సమర్థ వంతంగా ఉపయోగించుకోలేకపోయింది. దానితో త్రిపుర ప్రజలు కాంగ్రెస్ పార్టీని సి.పి.ఐ.(ఎమ్)కు ప్రత్యామ్నయంగా చూడ నిరాకరించారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, వామపక్ష ప్రభుత్వానికి ప్రత్యామ్నయంగా ఆవిర్భవించింది. త్రిపుర ప్రజలే కాదు త్రిపుర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులు కూడా తృణ్ మూల్ కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు. దాదాపుగా కాంగ్రెస్ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీగా మారిపోయింది. మరో వైపు కేంద్రంలోని బి.జె.పి., ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి పూనుకున్నది. కేంద్ర ప్రభుత్వం రకరకాల ఎత్తుగడలతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఇబ్బందుల పాలుజేసింది. పశ్చిమ బెంగాల్‌లోని పరిణామాలు, త్రిపుర రాజకీయాలను ప్రభావితం చేశాయి. అసంతృప్తిలో ఉన్న త్రిపురప్రజలు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులు, మార్క్సిస్టు పార్టీని ఎదుర్కోవడానికి, అనివార్యంగా కేంద్రంలో ఉన్న బి.జె.పి. నే ప్రత్యామ్నాయంగా ఎంచుకోవల్సి వచ్చింది.. త్రిపురలో ఇప్పుడు బి.జె.పి. అంటే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులే. అసలైన బి.జె.పి.అప్రధానమే. ఇతర పార్టీలను, బి.జె.పి.గా మార్చడం వల్లనూ, త్రిపురలో ఆదివాసీయేతర ప్రజలు అధికంగా ఉండడం వల్లనూ, సూత్రరహిత పొత్తుల వల్లనూ బి.జె.పి.43 ఓట్లు సాధించ గలిగింది. దీన్ని బి.జె.పి. నాయకులు తమ భావజాల విజయంగా చెప్పుకోవడం భావదారిద్ర్యం తప్ప మరేమీ కాదు. మిగతా ఈశాన్య రాష్ట్రాలలో కూడా బి.జె.పి. ఇటువంటి ఎత్తుగడలనే అవలంబించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, బి.జె.పి. కూల్చి వేసింది. దీన్ని సుప్రీం కోర్టు తప్పు పట్టిం ది కూడా. తరువాత క్రమంలో, కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులందరూ ముఖ్యమంత్రితో సహా (ఒక్కరు మినహా) అందరూ పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ ప్రదేశ్ లో చేరారు. ఈ పి.పి.ఎ. బి.జె.పి. కి చెందిన నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయన్స్‌లో భాగస్వామి. మళ్లి తరువాత వీరందరు బి.జె.పి.లో కలిసారు. ఇదీ బి.జె.పి. భావజాలం విజయం. మణిపూర్ లో ఎక్కువ సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీని పక్కన పెట్టి, అడ్డ దారిలో బి.జె.పి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అస్సాం లోనూ అంతే. ఇప్పుడు అస్సాం ముఖ్యమంత్రిగా ఉన్న సర్వానంద్ సోనోవాల్, అస్సాం గణపరిషత్ పార్టీకి చెందిన నాయకుడు. 1992–99 మధ్యలో ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్ (ఆసు) ప్రెసిడెంటు గా పని చేశాడూ. ఎ.జి.పి. తో విభేదాలు వచ్చి బయటికి వచ్చిన సోనోవాల్ కు బి.జె.పి. తీర్థం ఇచ్చి బి.జె.పి. నాయకుని గా చేసుకున్నరు. అస్సాం లో బి.జె.పి. గెలుపుకు ముఖ్య కారకుల్లో మరొకరు హిమంత్ బిస్వ సర్మ . సర్మ కాంగ్రెస్ పార్టీ కి చెందిన వాడు. కాంగ్రెస్ ముఖ్య మంత్రి తరుణ్ గగోయి ప్రభుత్వం లో మంత్రి మాత్రమే కాదు, ప్రభుత్వంలోనూ పార్టీలోనూ నెంబర్ టు కూడా. తరుణ్ గగోయి పుత్ర రత్నం అస్సాం రాజ్జకీయాలలోకి వారసునిగా దిగుమతి చేయబడడం తో తరుణ్ గగోయి తో సర్మ సంబంధాలు దెబ్బతిన్నాయి. అంతే హిమంత బిస్వ సర్మ , బి.జె.పి. నాయకుడు అయ్యాడు. ఇప్పుడు సర్మ బి.జె.పి. కి చెందిన నార్థ్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయన్స్‌కు కన్వీనర్‌గా ఉన్నారు. సిద్ధాంతాలను, సూత్రాలను గాలికి వదిలేసి, సామ దాన భేద దండోపాయాలతో ఇతర పార్టిల నాయకులను కలుపుకుని విజయాలు సాధించడం, అడ్డదారులలో ప్రభుత్వాలను ఏర్పరచడం అనైతికం. దీన్ని బి.జె.పి. భావజాల విజయంగా చెప్పడం, మీడియా ఆహా ఓహో ఏమి విజయం, ఏమి ఎత్తుగడలు అంటూ పొగడడం మన దేశ ప్రజాస్వామ్యపు దారుణ స్థితినే తెలుపుతుంది. ఈ అవకాశవాద రాజకీయాల విషాద ఫలితాలు త్వరలోనే ఈశాన్య భారతంలో ప్రతిఫలించక తప్పదు.

ఎడిటర్‌కు లేఖ

పూణే ఆంధ్ర సంఘంలో ఉగాది సంబరాలు

శ్రీ విళంబి నామ ఉగాది సంబరాలు మార్చ్ 18 సా 4:30 నుండి 9:30 వరకు నిలపూలే రంగమందిర్, నవి సంఖ్విలో అత్యంత ఘనంగా జరిగాయి. సినీనటులు చంద్రమోహన్ గారు ముఖ్య అతిథిగా వారణాసి రామ చంద్ర ప్రసాద్ గౌరవ అతిథిగా విచ్చేసారు. అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ శేషగిరిరావు దంపతులు ప్రస్తుతించిన షడ్రుచుల ఉగాది పచ్చడిని అతిథులు సేవించారు. చిన్నారి హాసిత సంధ్యా దీపారాధన ప్రార్థన పాడగా శేషగిరి దంపతులు, మహిళ విభాగ అధ్యక్షురాలు శ్రీమరి వీణధారి మరియు సంగీత కార్యక్రమ సమన్వయకర్త శ్రీమతి కె లక్ష్మీ దీపారాధన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.స్థానిక కళా ప్రదర్శనలో భాగంగా చిన్నారి శ్రీ యుతి స్వాగత నృత్యం, ప్రద్యుమ్న అన్నమాచార్య కీర్తనపై భరత నాట్యం, శ్రీమతి శశికళ స్వామి అమ్మవారి పాట సమారంభ ప్రారంభానికి ఉత్సుకత నింపారు. అనంతరం శ్రీ మల్లాది వెంకట గోపాల కృష్ణచే పంచాంగ శ్రవణంతో బాటు మనం అన్దరామ్ సంవత్సరం పొడవునా పఠించవలసిన ముఖ్యమైన ఏడు శ్లోకాలను అతిథిలతో కూడా చెప్పించడం బాగుంది. అధ్యక్షులు శ్రీ శేషగిరి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతోప న్యాసం చేసి తెలుగు భాష శ్రీ చంద్రమోహన్ గారి చేతుల మీదుగా ఉగాది ప్రత్యేక సంచికను విడుదల చేశారు.

గౌరవ అతిథి, సామాజిక వేత్త శ్రీ వారణాసి రామ చంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ, తాను వారణాసి నేత్ర కేంద్ర సంస్థాపకులని, వారి వద్ద ఆరు వేలకి పైగా నేత్రాలు దానం చేయడానికి ఉన్నాయని, ఎప్పుడైనా ఎవరికైనా నేత్ర మార్పిడికి సిద్ధమేనని తెలియజేశారు.

విశిష్ట అతిథి కార్యక్రమ ముఖ్య దాత శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ పూణె విభాగ ప్రతినిధి శ్రీ శివ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ గురించి వివరించారు. ప్రామాణికమైన, ఉన్నత విద్యకు తమ సంస్థ ఎంతో కృషి చేస్తుందంటూ తమ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులని ఆహ్వానించారు.

అంధ కళాకారిణి నిలోఫర్ మాట్లాడుతూ మేము హిందీలో మాట్లాడినా మీరు తెలుగులో మాట్లాడినా ఈనాడు మనమధ్య సంగీత అనుబంధం ఏర్పడిందని, ఇకపై ఆంధ్ర సంఘం ఏ కార్యక్రమం నిర్వహించినా తాము సిద్ధమేనన్నారు. చంద్రమోహన్ గారి సినిమాలు చూడలేకున్నా పాటలు విన్నామని, ఇకపై సినిమాలు చూస్తామని తెలియజేసారు. భాగవతుల ప్రసాద్ శ్రీ చంద్రమోహన్ గారి సినీ జీవితం గురించి ప్రేక్షులకి తెలియజేసి సన్మాన పత్రం చదివారు. ట్రస్టీ సి హెచ్ సత్యనారాయణ, అధ్యక్షులు శేషగిరి, మరియు ఇతర వాలంటీర్లు కమ్మని తెలుగు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శ్రీమతి వీణధారి, మానేజింగ్ కమిటీ చైర్మన్ శ్రీమతి రవీణ చవాన్, కోశాధికారి శ్రీ రోశయ్య, ట్రస్టీలు శ్రీ ఐవి రెడ్డి, ఎంసికె రెడ్డిలు కూడా పాల్గొన్నారు. షుమారు ఆరు వందలకు పైగా తెలుగు వారు ఉగాది సంబరాల్లో పాల్గొనడం విశేషం. – రవీణ చవాన్

కంటి చూపు సమస్యకు చెక్ పెట్టవచ్చు!

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఏడాదికోసారైనా కంటి డాక్టర్ దగ్గరకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరం. ఏటా లక్షల సంఖ్యలో కంటి చూపునకు సంబంధించిన సమస్యలతో బాధపడుతూ వైద్యులను సంప్రదిస్తున్నారు. వీటిలో కొన్ని శాశ్వత అంధత్వానికి దారితీసేవి కూడా ఉంటున్నాయి. కొందరికి కళ్లద్దాలు, మందులతోనే సమస్యకు చెక్ పెట్టవచ్చు. కొందరికి సర్జరీలతో నయం చేయడానికి అవకాశం ఉండవచ్చు. కొందరి విషయంలో అప్పటికే చేయి దాటి ఉండవచ్చు. కొన్ని సమస్యలు పైకి కనిపించవు. అయితే, కొంత కాలానికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అదే వైద్యులను సంప్రదించినట్టయితే పరీక్షల ద్వారా సమస్యలను గుర్తించేందుకు వీలుంటుంది.

కాంప్రహెన్సివ్ డైలేటెడ్ ఐ ఎగ్జామ్: కంటి సమస్యలు



ఈ పరీక్ష ద్వారా బయటపడతాయి. గ్లకోమా, డయాబెటిక్, వయసును బట్టి వచ్చే మాక్యులర్ డీజనరేషన్ ఏఎండీ సమస్యలు తెలుస్తాయి.

కుటుంబ సభ్యుల ఆరోగ్య చరిత్ర : కొన్ని వ్యాధులు వారసత్వంగా సంక్రమిస్తుంటాయి. మీ కుటుంబ సభ్యుల ఆరోగ్య సమాచారాన్ని వైద్యులకు తెలియజేయడం అవసరం.

అప్పటికే కుటుంబంలో ఎవరైనా కంటి వ్యాధులతో బాధపడుతుంటే అవి వారసత్వంగా మీకూ వచ్చే రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అప్పటికే ఏదైనా కంటి సమస్య ఉన్నట్టు బయటపడితే అది వారసత్వంగా వచ్చిందా, కాదా? అన్నది తెలుస్తుంది. దాన్నిబట్టి వైద్యం చేసేందుకు వీలుంటుంది.

ఎలాంటి ఆహారం : ముదురు ఆకుపచ్చటి కూరగాయలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా పాలకూర మంచి చాయిస్. చేపలు కంటిచూపును కాపాడే మంచి బలమైన ఆహారమట. వీటిలో ఉండే ఓమేగా ఫ్యాటీ 3యాసిడ్స్ కంటిని కాపాడతాయంటున్నారు నిపుణులు. చేపలు తినలేని వారు వాల్ నట్స్ తీసుకోవడం బెటర్. వీటిలోనూ ఓమేగా ఫ్యాటీ 3 యాసిడ్స్ లభిస్తాయి. ముఖ్యంగా విటమిన్ ఏ ఎక్కువగా లభించే క్యారట్లు కళ్లకు మంచివి. అలా అని ఒక్క క్యారట్లే తినడం కూడా సరికాదు. పైన చెప్పుకున్నవి కూడా ఆహారంలో భాగం కావాలి. మొలకెత్తిన గింజలు కూడా మంచివి. కళ్లకు, మెదడుకు మధ్య అనుసంధానం చాలా కీలకమైనది. ప్రతీ కణం చక్కగా పనిచేసేందుకు వీలుగా ఎన్నో చానల్స్ నిర్మాణమై ఉంటాయి. కణాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై పనిచేయడం వల్ల కంటి చూపు బాగుంటుంది. ఇందులో రెటీనా, స్కెలరా, పుపిల్, ఐరిస్, కార్నియా, లెన్స్, మాక్యులా, ఆక్వియెస్, విట్రియెస్ హ్యూమర్, ఆప్టిక్ డిస్క్, ఆప్టిక్ నెర్వ్ మొదలైనవి ఉంటాయి. వీటి మధ్య సమాచారం సరిగా జరిగేందుకు వీలుగా తగిన పోషకాలు అవసరపడతాయి. ల్యూటీన్, జెక్సాంతిన్, క్రిప్టోక్సాంతిన్, బెటా కెరోటిన్, జింక్, బయోఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఏ, సీ అనేవి రెటీనాలోని కణాలు సరిగా పనిచేసేందుకు చాలా చాలా అవసరం.

పొగతాగినా ముప్పే: చాలా మందికి తెలియని విషయం. పొగతాగడం వల్ల దీర్ఘకాలంలో కంటిచూపు దెబ్బతింటుందని. పొగతాగడం వల్ల మాక్యులర్ డీజనరేషన్ (ఏఎండీ) సమస్యకు దారితీస్తుంది. కేటరాక్ట్, ఆప్టిక్ నెర్వ్ దెబ్బతింటాయి. దీంతో అంతిమంగా అంధత్వం ఏర్పడుతుంది. అధిర రక్త పోటు సమస్య వల్ల కూడా కంటిలోని కణాలు దెబ్బతిని చూపుకు సంబంధించిన సమస్యలు ఏర్పడతాయి. పర్యావరణ కాలుష్యం, స్టెరాయిడ్స్, యాంటీ డిప్రెసెంట్ మందులు, సంతాన నిరోధం కోసం నోటి ద్వారా తీసుకునే మాత్రలు కంటికి కావాల్సిన పోషకాలు అందకుండా చేస్తాయి. దీంతో చూపునకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయి.

శస్త్రచికిత్సలు : చూపు మందగించి కళ్లద్దాలు ధరించడం ఇబ్బందిగా అనిపిస్తే... వైద్యులను సంప్రదించినట్టయితే శస్త్రచికిత్స ద్వారా సరిచేస్తారు. అలాగే కంటిలో శుక్లం సమస్యకు, గ్లకోమాకు కూడా శస్త్రచికిత్సలు ఉన్నాయి.

కంట్లో ఏవైనా పడితే : సబ్బు నీరు పొరపాటుగా కంటిలోకి వెళితే వెంటనే భగ్గుమని మండుతుంది. కంటిని నలపకుండా వెంటనే ధారగా కంటిలోకి ఫిల్టర్ వాటర్ ను స్ప్రే చేయండి. లేదా దోసిలితో తీసుకుని కంటిలోకి నీటిని చిమ్మండి. ఏదైనా క్లీనింగ్ లిక్విడ్ కంట్లో పడినా ఇలానే చేయండి. లేదా సెలైన్ వాటర్ తో అయినా కంటిని శుభ్రం చేసుకోవచ్చు. అప్పటికీ తగ్గకపోతే ఆలస్యం చేయకుండా వెంటనే కంటి డాక్టర్ దగ్గరకు వెళ్లాలి.

కళ్లకు విశ్రాంతి : కంప్యూటర్ల ముందు పనిచేస్తున్నారా...? అయితే, మధ్య మధ్యలో కళ్లకు విశ్రాంతి తప్పనిసరి. కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్ల ముందు ఎక్కువ సమయం గడిపేవారు 20, 20, 20 సూత్రాన్ని పాటించాలి. ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వాటిని 20 సెకండ్ల పాటు చూడాలి. దీంతో కళ్లపై ఉన్న ఒత్తిడి తగ్గిపోతుంది.

చలువ అద్దాలు : కళ్లకు చలువ అద్దాలతో తగిన ఉపయోగం ఉంది. ఎండ సమయంలో వీటిని ధరించడం వల్ల సూర్యుడి అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ లభిస్తుంది.

అయితే, కొనే ముందు అద్దాలు అల్ట్రా వయలెట్‌ఏ, అల్ట్రా వయలెట్‌బీ కిరణాలను నిరోధించేవా, కావా అన్నది చూడాలి. ఈ కిరణాలు కళ్లపై పడితే శుక్లం సమస్య ఎదురవుతుందని, ఏఎండీకి దారితీస్తుందని నిపుణులు అంటున్నారు. చలువ కళ్లద్దాలు ధరించడం వల్ల క్యాటరాక్ట్ సమస్య రాకుండా చూసుకోవచ్చుట. ముఖ్యంగా చిన్నారులు, యుక్తవయసులోని వారికి కళ్లద్దాల ద్వారా రక్షణ కల్పించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ఇవి కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి : ఎర్రబారి, కంట్లో నొప్పిగా ఉంటే ఆలస్యం చేయకుండా కంటి డాక్టర్ వద్దకు వెళ్లాలి. ఉన్నట్టుండి పాక్షికంగా, పూర్తిగా కంటి చూపు మందగిస్తే... ఎదురుగా ఉన్నవి రెండుగా కనిపిస్తే. కంటి పాప ముందు నల్లటి చుక్కలు కనిపిస్తే. ఏదో కంటిచూపునకు అడ్డంగా ఉన్నట్టు అనిపిస్తుంటే... కుడి ఎడమవైపుల ఉన్నవి కనిపించకుంటే... రాత్రి సమయాల్లో చూపు మందగించినట్టు అనిపిస్తే... రంగుల మధ్య తేడాను గుర్తు పట్టలేకుంటే. దగ్గర్లో ఉన్న వస్తువులు మసకబారినట్టు అనిపిస్తుంటే. కళ్ల వెంట నీరు కారుతుంటే... బాగా దురదగా అనిపిస్తుంటే వైద్యులను సంప్రదించి తగిన సూచనలు, చికిత్స పొందాలి.

అధిక కాంతి వల్ల రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతుంటే కంటి వైద్యుడి సూచన మేరకు యాంటీగ్లేర్ కోటింగ్ ఉన్న గ్లాసెస్ ను వాడుకోవాలి. చలువ కళ్లద్దాలు పెట్టుకున్నప్పటికీ సూర్యుడి వైపు చూడొద్దని నిపుణుల సూచన. కళ్ల నుంచి మానిటర్ కనీసం అడుగు దూరంలో ఉండాలి. కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు మీ వెనుక వైపున లైట్, విండో ఉండరాదు. ఎందుకంటే ఆ వెలుగు స్క్రీన్ పై పడి గ్లేరింగ్ ఉంటుంది. దీంతో కళ్లు శ్రమకు గురవుతాయి. బ్లూ రంగు కళ్లకు హానికరం. అందుకే గ్రాఫిక్ ప్రాపర్టీస్ లోకి వెళ్లి కలర్ సెట్టింగ్స్ లో ఈ మేరకు మార్పులు చేసుకోవాలి. కళ్లలో పెట్టుకునే కాంటాక్ట్ లెన్స్ అయితే, ఆ లెన్స్ లో కళ్లలో అమర్చుకునే ముందు, తర్వాత తీసే సమయంలోనూ కళ్లను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం చాలా అవసరం.



మన తెలంగాణ
5
హైదరాబాద్
బుధవారం
21 మార్చి, 2018
www.manatelangana.news

మచ్చలతో మరింత జాగ్రత్త!

శరీరంపైవచ్చే తెల్లమచ్చలనే బొల్లి అంటారు. దీనినే వైద్య పరిభాషలో 'లూకోడెర్మా' అంటారు. ఈ సమస్య శరీరాన్ని బాధపెట్టవు కాని చూడటానికి తెలుపు రంగు మచ్చలు అగుపడి మానసికంగా బాధకు లోనౌతారు. తెలుపు రంగు మచ్చలు శరీరంపై అగుపడిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

కారణాలు : ఎండోక్రైన్ హార్మోన్ల లోపం వల్ల వంశపారంపర్యం, మెలనిన్ లోపం వల్ల మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలున్నప్పుడు అమీబియాసిస్, బద్దెపురుగులు వంటి పరాన్నజీవుల వల్ల జీర్ణవ్యవస్థ సరిగా లేకపోవడం.
డిప్రెషన్, ఆందోళన వంటి భావోద్వేగాల తీవ్రత వల్ల, ఆటోఇమ్యూనిటీ, తగ్గటం వల్ల కల్తీ ఆహారం, వాతావరణ కాలుష్యం, దీర్ఘకాలికంగా యాంటీబయాటిక్స్ మందులు వాడటం వంటి కారణాలచే తెల్ల మచ్చలు ఏర్పడే అవకాశముంది.



జాగ్రత్తలు : హార్మోన్ల సమతుల్యతను కాపాడటానికి, మానసిక ఒత్తిడిని నివారించటానికి నిత్యం యోగా, ప్రాణాయామం చేయటం.
విటమిన్స్ లోపం ఏర్పడకుండ తాజా పండ్లు, కూరగాయలు, మొలకెత్తిన విత్తనాలు తీసుకోవాలి.
తెల్లమచ్చలే కదా అని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలి.
ఫాస్ట్‌ఫుడ్, ఎక్కువ రోజులు నిలువ ఉంచిన ఆహారపదార్థాలు తీసుకోవటం మానాలి.
మద్యం, స్మోకింగ్ అలవాట్లు, ఎక్కువగా టీ, కాఫీలు తీసుకోవటం, సమయపాలన లేకుండ ఆహారం తీసుకోవటం చెయ్యకూడదు.
రోజుకు కనీసం 5 నుంచి 7 గంటల నిద్ర ఉండే విధంగా చూసుకోవాలి.

చికిత్స : మానసిక శారీరక లక్షణాలను ఆహారం అలవాట్లను పరిగణలోకి తీసుకొని మందులను ఎన్నుకొని కానిస్టుట్యెషినల్ పద్ధతిలో చికిత్స చేసిన బొల్లి సమస్య నివారణ అవుతుంది.

మందులు :

ఆర్సినిక్ సల్ఫ్లీవస్ : తెల్లమచ్చలకు ఈ మందు చాలా బాగా పనిచేయును తెల్లమచ్చలు దురదగా ఉండుట, దదుర్లు రావటం, ఆయసం వంటి లక్షణాలున్నప్పుడు ఈ మందు వాడుకొని ప్రయోజనం పొందవచ్చును.

కాలీకార్బ్ : చర్మవ్యాధులు ఊపిరితిత్తుల సమస్య జీర్ణసంబంధ వ్యాధులు ఉండి తెల్లమచ్చలతో బాధ పడేవారికి ఈ మందు వాడుకోదగినది. వీరు మానసిక స్థాయిలో ఆందోళనతో కుంగిపోయి ఉంటారు. వీరి సమస్యలన్ని తెల్లవారుజామున ఎక్కువ ఆగుట గమనించదగిన లక్షణం.

కాల్కేరియా కార్బ్ : తెల్లమచ్చలు ఏప్రాంతములోనైన గుండ్రముగా ఏర్పడును. వీరికి జలుబు తేలికగా చేయును. తలకు చెమటలు ఎక్కువగా పడుతుంటాయి. పడుకుంటే తలగడ తడిసిపోతుంది. పొట్ట బోర్లించిన మూకుడు లాగా ఉంటుంది. ఈ లక్షణాలున్న వారికి ఈ మందు ఆలోచించదగినది.

ఆర్సనికం ఆల్బ్ : చర్మం పొడిబారి ఉంటుంది చర్మంపై అక్కడక్కడ తెల్లటి మచ్చలు ఉండి మానసిక స్థాయిలో ఎల్లప్పుడు చావు గురించి భయపడుతుంటారు. వ్యాధిని తరుచుగా ఆలోచిస్తూ మధనపడుతూ ఉంటారు. వీరు ప్రతి వస్తువును చాలా శుభ్రంగా ఉంచుతారు. ఇంట్లో ప్రతీది ఒక క్రమమైన పద్ధతిలో ఉండే విధంగా సర్దుతూ ఉంటారు. ఇలాంటి లక్షణాలుండి తెల్లమచ్చలతో బాధ పడే వారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

సెపియా : వీరు మానసిక స్థాయిలో ఆందోళనతో, చిరాకుతో ఉంటారు. వేడి సెగలు శరీరం నుంచి వస్తున్నట్లు గా అనిపిస్తుంది. ఏ పనిపై శ్రద్ధ పెట్టలేకపోవటం.ఇటువంటి లక్షణాలున్న వారికి ఈ మందు ఆలోచించదగినది.

సోరేలియాకార్ : ఈ మందు మాతృద్రవాన్ని తెల్ల మచ్చలపైన ఉదయం, సాయంత్రం పూసి సూర్యరశ్మి తగిలే విధంగా ఉంచిన మంచి ఫలితం ఉండును.

సైలీషియా : వీరు భయస్తులు, సభలు సమావేశాలుకు వెళ్ళి మాట్లాడలేరు అరచేతులు, అరికాళ్లు చెమటతో తడిసిపోతాయి. వీరికి ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండి అంతర్మధనం చెందుతారు. ఇలాంటి లక్షణాలుండి బొల్లితో బాధపడేవారికి ఈ మందు వాడుకోదగినది.

ఈ మందులేకాకుండా సల్ఫర్, హైడ్రోకోటైల్, నేట్రంమూర్, కాలిఫాస్, సిఫిలినమ్, మెర్కసాల్, తూజ వంటి మందులను వాడుకొని తెల్లమచ్చల నుంచి ఉపశమనం పొందవచ్చును.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్, హన్మకొండ

పిజి మెడికల్ సీట్లలో సగం స్థానికులకే



మన తెలంగాణ / హైదరాబాద్ : పిజి మెడికల్ సీట్ల భర్తీపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండి యా నిబంధనల మేరకే వెయిటేజీ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిం ది. 50 శాతం సీట్లు నేషనల్ పూల్‌లో పోతే మిగిలిన 50 శాతం సీట్లను స్థానికులకే కేటాయిస్తామని తెలిపింది. దీంతో పాటు గ్రామీణ, ఏజన్సీ ప్రాంతాల్లో పనిచేసే వారి వెయిటేజీ మార్కుల మీద కూడా ప్రభుత్వం ఒక స్పష్టతనిచ్చింది. ఇందుకోసం ప్రభుత్వం మంగళవారం రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది. ఇందులో జీవో నెం. 21 ప్రకారం పిజి సీట్లలో సర్వీసులోని అభ్యర్థులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వాళ్ళకు సర్వీ సు రిజర్వేషన్లకు బదులుగా నీట్‌లో వచ్చిన మార్కులకు అదనంగా వెయిటేజీ మార్కులను కలుపుతారు. ఇందులో రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు యథావిధిగా అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఏజన్సీ ప్రాంతాల్లో మూ డేళ్ళు లేదా అంతకంటే ఎక్కువ సంసవత్సరాలు పనిచేసిన అభ్యర్థులకు నీట్‌లో వచ్చిన మార్కులకు అదనంగా 30 శాతం మార్కులను, గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్ళు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పనిచేసిన వారికి నీట్‌లో వచ్చిన మార్కులకు అదనంగా 24 శాతం మేరకు మార్కులను కలుపుతారని స్పష్టం చేశారు. డిప్లొమో చేసిన సబ్జెక్టులోనే తప్పకుండా పిజి చేయాలనే నిబంధనలను కూడా తొలగించారు.

పరీక్ష పేపర్ల లీకేజీ సంగతేంటి?

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్రం నుంచి రావాల్సిన హామీలను సాధించుకోకుండా సిఎం కె.చంద్రశేఖర్‌రావు దేశ పర్యటన చేస్తున్నారని టిడిపి ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. విభజన చట్టం హామీలు అమలు చేయకపోవడంతోనే టిడిపి అవిశ్వాసం పెడుతుందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంగళవారం సండ్ర మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ పరీక్షలు పెట్టినా పేపర్ లీకేజీ ఎందుకు జరుగుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఏ విషయంలోనూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా, పకడ్బందీగా వ్యవహరించడం లేదన్నారు. ప్రశ్నించాల్సిన జనసేన పాదాలకు దండం పెడుతోందన్నారు.

బిజెపి, టిడిపి, సిపిఐ(ఎం) వాకౌట్

మన తెలంగాణ/హైదరాబాద్: బడ్జెట్ చర్చలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ సమాధానం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ బిజెపి, టిడిపి, సిపిఐ(ఎం) సభ్యులు శాసనసభ నుంచి మంగళవారం వాకౌట్ చేశారు. శాసనసభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ మధుసూదనాచారి ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌లో 70 శాతం ఆదాయాన్ని సమకూరుస్తున్న హైదరాబాద్‌కు ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, ఉద్యోగుల పెన్షన్ స్కీము పట్ల వివక్షత చూపడం పట్ల నిరసిస్తూ బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి, ఉద్యోగులపాత పెన్షన్‌పై స్పష్టత ఇవ్వలేదని, జర్నలిస్టుల గృహాలపై స్పష్టత ఇవ్వలేదని నిరసిస్తూ టిడిపి సభ్యులు సండ్రవెంకటవీరయ్య, కౌలుదార్లకు వ్యవసాయ పెట్టుబడులపై స్పష్టత ఇవ్వకపోడం పట్ల సిపిఐ(ఎం) సభ్యులు సున్నం రాజయ్య వాకౌట్ చేశారు. కాగా అంతకుముందు బడ్జెట్ చర్చలో మంత్రి ఈటల రాజేందర్ సమాధానంలో తప్పులు ఉన్నాయంటూ బిజెపి సభ్యులు పలు మార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అన్నీ అబద్ధాలే చెబుతున్నారని, తమకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని కిషన్ రెడ్డి కోరగా అవకాశం లభించలేదు. దీంతో 'మీరే మాట్లాడుకోండి.. మేమేపోతాం'' అన్నారు. అందుకు స్పీకర్ మధుసూధనచారి జోక్యం చేసకోని తర్వాత అవకాశం కల్పిస్తామనడంతో బిజెపి సభ్యులు కూర్చు న్నారు. మంత్రి ఈటల సమాధానం పూర్తి కాగా తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కిషన్ రెడ్డి కోరగా అందుకు మంత్రి హరీష్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు కిషన్ రెడ్డి ప్రతిస్పందిస్తూ ''హరీష్‌రావు కొత్త రూల్స్ రాయండి'' అన్నారు. ఇంతలో స్పీకర్ మధుసూధనచారి జోక్యం చేసుకుని కిషన్‌రెడ్డికి అవకాశం ఇవ్వడంతో వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి: ఎఐటియుసి



మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన పథకం, ఆశా తదితర స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.18 వేలు, పెన్షన్ రూ.3 వేలు అమలుచేయాలని స్కీమ్ వర్కర్ల యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) డిమాండ్ చేసింది. ఎఐటియుసి కార్యాలయం ముందు మంగళవారం జరిగిన స్కీమ్ వర్కర్ల ధర్నాను ఉద్దేశించి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ప్రధానకార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని ప్రసంగించారు. శాశ్వత ప్రాతిపదికన కొనసాగుతున్న సం క్షేమ పథకాలైన అంగన్‌వాడీలు, ఆశా, ఐకెపి, సర్వశిక్ష అభియాన్, సాక్షర భారతి, జాతీయ బాల కార్మికుల ప్రాజెక్టులు తదితర సంస్థలలో తాత్కాళిక ప్రాతిపదికన లక్షలాది కార్మికులు, ఉద్యోగులను నియమిస్తూ తక్కువ జీ తాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని వారు విమర్శించారు. స్కీమ్ వ ర్కర్లు దేశవ్యాపితంగా సంఘటితంగా ఎన్నో పోరాటాలు, నిర్వహిస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి, ఉపప్రధాన కార్యదర్శి కె. సమ్మయ్య, మధ్యాహ్నభోజన పథకం గౌరవ అధ్యక్షులు కమలారెడ్డి, కార్యదర్శి బి.ప్రసాద్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు వరకూ మెట్రో

(మొదటిపేజీ తరువాయి)

శాఖమంత్రి కె. తారక రామారావు అన్నారు. ప్రస్తుతం జూబ్లీ బస్‌స్టేషన్ నుండి ఫలక్‌నుమా వరకు మెట్రో పనులు కొనసాగుతున్నాయన్నారు. మెట్రో ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ. 14 వేల 133 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.2,296 కోట్లు ఖర్చు చేశామన్నారు. శాసన సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా మెట్రో రైలు మార్గం , తొలి, రెండో దశ విస్తరణ పనులు, మతపరమైన ప్రార్థనా మందిరాలు ఎన్ని అడ్డువస్తున్నాయంటూ మజ్లీస్ ఎంఎల్‌ఏలు అక్బరుద్దీన్ ఓవైసీ, జాఫర్ హుస్సేన్, అహ్మద్ పాషా ఖాద్రీ తదితరులు అడిగిన ప్రశ్నకు కెటిఆర్ పై విధంగా సమాధానం చెప్పారు. పాత బస్తీ ప్రజలకు కూడా మెట్రో రైలు ప్రయాణం అందుబాటులోకి తెస్తామని, ఇందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెట్రో మార్గాలపై ఇప్పటికే అధికారులు సర్వే నిర్వహించారని, మసీదులు, గుళ్లు , చర్చిలు, వారసత్వ కట్టడాలు చిన్నవి పెద్దవి కలిపి 103 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. మరో 25 కట్టడాలను కూడా తప్పని సరిగా కూల్చాల్సి వస్తుందని అధికారుల నివేదికల ద్వారా వెల్లడైందన్నారు. వ్యక్తిగత కార్లు, నాల్గు చక్రాల వాహనాల కోసం పార్కింగ్ ప్రదేశాలపై మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఏ వి. శ్రీనివాస్ గౌడ్ ప్రస్తావిస్తూ ఖాళీ ప్రదేశాలు, నిర్మాణాలు ఇంకా చేపట్టని ఓపెన్ స్థలాలను గుర్తించి లీజు పద్దతిలో పార్కింగ్‌కు వినియోగించుకుంటే బావుంటుందని ప్రభుత్వానికి సూచించారు. భారీ లోడ్‌లతో వచ్చే లారీల కోసం కూడా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ అన్ని ప్రాంతాల్లో కూడా ట్రక్ పార్కింగ్ సదుపాయాలకు కల్పించాలని సూచించారు. కూకట్‌పల్లి , హైదర్‌నగర్ ప్రాంతాల్లో ట్రక్ పార్కింగ్ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. దీనికి మంత్రి కెటిఆర్ సమాధానం చెబుతూ శ్రీనివాస్ గౌడ్ సూచనను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. న్యూయార్క్ నగరంలో పార్కింగ్ స్థలాలు 2వ అతిపెద్ద ఆదాయ వనరుగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం జిహెచ్‌ఎంసికి 54 పార్కింగ్ స్థలాల ద్వారా ఏటా 96 లక్షల ఆదాయమే వస్తుండడంతో పేయిడ్ పార్కింగ్‌కు స్వస్థి పలికి చాలా చోట్ల ఉచిత పార్కింగ్ సదుపాయాన్నే కల్పించినట్లు తెలిపారు. తమకు వీలు కాని చోట్ల ప్రైవేటు సంస్థలు పార్కింగ్‌ను చూస్తున్నాయని , అది కూడా నామమాత్రపు రుసుములోనే అని కెటిఆర్ అన్నారు. వాహనాల పార్కింగ్ నిమిత్తం ప్రభుత్వానికి ప్రత్యేక ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. వాహన, ట్రక్ పార్కింగ్ కోసం స్మార్ట్ యాప్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. భారీ కంటేయినర్లు సైతం గూగుల్‌లో సర్చ్ చేసి తమకు సమీపంలో ఉన్న ట్రక్ పార్కింగ్ స్థలాలను తెలుసుకునేలా చూస్తామన్నారు. కంటేయినర్లు, ట్రక్ పార్కింగ్‌లు ఎక్కడెక్కడే అవసరం కావచ్చన్న దానిపై రవాణా శాఖ, మున్సిపల్, హెచ్‌ఎండిఏతో సంయుక్తంగా అధ్యయనం చేయిస్తామని కెటిఆర్ అన్నారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకముంది

- ఆ ఇద్దరు రాజ్యసభకు ఓటేస్తారు
- పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్ : తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, శాసనసభ సభ్యత్వం కోల్పోయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్.ఎ.సంపత్‌కుమార్‌లు రాజ్యసభ ఎన్నికల్లో ఓటేస్తారని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఎంఎల్‌ఏలంతా రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయాల్సిందేనని చెప్పారు. బహిష్కరణకు గురైన ఎంఎల్‌ల అంశం, రాజ్యసభ ఎన్నికలు,కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు సిఎల్‌పి నేత కుందూరు జానారెడ్డి నివాసంలో మంగళవారం కాంగ్రెస్ ముఖ్యనేతలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు, మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్ అలీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్, రేవంత్ రెడ్డి ,మాజీ స్పీకర్‌లు కె.ఆర్.సురేశ్‌రెడ్డి,నాదెండ్ల మనోహర్, హైకోర్టు అడ్వొకేట్ జంధ్యాల రవిశంకర్ పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శాసన సభలో జరిగిన సంఘటనపై హై కోర్ట్ ఇచ్చిన మధ్యంతర ఉత్తరువుపై హర్షం వ్యక్తం చేశారు. కుట్ర పూరితంగా ఇద్దరి ఎంఎల్‌ఏలను బహిష్కరించారని, మిగిలిన అందరిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. భారత దేశంలో ఇలాంటి సంఘటన ఎక్కడా జరగలేదని, ప్రతిపక్షం సభలో ప్రజలపక్షాన మాట్లాడుతారనే భయంతోనే కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలను సస్పెండ్ చేశారన్నారు. మండలి చైర్మెన్ స్వామిగౌడ్ కు దెబ్బ తగిలింనదున చర్య తీసుకున్నట్లు చిత్రీకరించారని, కోర్టులో అడ్వొకేట్ జనరల్ వాదన సమయంలో చైర్మెన్ కు దెబ్బతాకిన ప్రస్తావనే తెలేదన్నారు.స్వామిగౌడ్ అంటే తమకు అభిమానం ఉందని, దెబ్బతగిలిందంటే ఆధారాలు చూపాలని మొదటి నుండీ తాము అడుగుతున్నామని చెప్పారు.

వారి ఓటింగ్‌పై నేడు సిఇసికి వినతి

శాసనసభ బహిష్కరణకు గురైన ఇద్దరు ఎంఎల్‌ఏలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్.ఏ.సంపత్‌కుమార్‌లకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ పార్టీ కోరనుంది. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు వారిరువురితో పాటు, టిపిసిసి ఎన్నికల సంఘం సమన్వయకర్త, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, సభ్యులు శ్యాంమోహన్, నిరంజన్‌లు కలవనున్నారు. రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే సమయానికి కోమటిరెడ్డి, సంపత్‌లు ఓటర్లుగా ఉన్నారని, అలాగే వారివురు నామినేషన్‌పత్రాలపై సంతకాలు కూడా చేశారని సిఇసికి వివరించనున్నారు. వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండానే సభ్యత్వాలను రద్దు చేశారని, ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల నోటిఫికేషన్ కూడా ఇవ్వొద్దని హైకోర్టు ఉత్తరువులు కూడా ఇచ్చిన విషయాన్ని ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసకెళ్లనున్నారు.

టిడిపి మద్దతు కోరిన కాంగ్రెస్

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని టిడిపిని కోరినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు టిడిపి ఎంఎల్‌ఏ సండ్ర వెంకట వీరయ్యతో మాట్లాడినట్లు వెల్లడించారు. ప్రస్తుతం టిడిపికి శాసనసభలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. దీనిపై తమ అధినేత చంద్రబాబుతో మాట్లాడి నిర్ణయం చెబుతామని సండ్ర వెంకటవీరయ్య 'మన తెలంగాణ'కు చెప్పారు.

22న మాక్ పోలింగ్

రాజ్యసభ ఎన్నికల గురించి చర్చించేందుకు ఈ నెల 22న కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు, ఇతర ముఖ్యనాయకులు గోల్కొండ హోటల్‌లో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మాక్ xపోలింగ్ కూడా నిర్వహించే అవకాశముంది.

విప్‌గా రామ్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ శాసనసభాపక్ష విప్‌గా పరిగి ఎంఎల్‌ఏ టి.రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శుకు సిఎల్‌పి నేత కె.జానారెడ్డి మంగళవారం లేఖ రాశారు. అంతకుముందు వరకు సిఎల్‌పి విప్‌గాఉన్న సంపత్‌కుమార్ ఎంఎల్‌ఏ సభ్యత్వం రద్దవడంతో, ఆయన స్థానంలో రామ్మోహన్‌రెడ్డిని విప్‌గా ని యమించారు. రాజ్యసభఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయాలంటూ బుధవారం నాడు విప్ జారీ చేయనున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన విరమణ

మనతెలంగాణ /హైదరాబాద్ : గత మూడు రోజులుగా విధులు బహిష్కరిస్తున్న రెవిన్యూ ఉద్యోగులు మంగళవారం ఆందోళనను విరమిస్తున్నట్లు ప్రకటించారు. రెవిన్యూ ఉద్యోగుల రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ ఇచ్చిన హామీ మేరకు బుధవారం నుంచి విధుల్లో చేరుతున్నామని తెలంగాణ రెవిన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో రెవిన్యూ ఉద్యోగులతో మంత్రి చర్చలు జరిపారు. మూడు రోజుల క్రితం ఆసిఫ్‌నగర్ ఎంఆర్‌ఒ కార్యాలయంలో సిబ్బందిపై దాడి జరగడంతో శనివారం నుంచి విధులు బహిష్కరించి నిరసనకు దిగినట్లు ఉద్యోగులు మంత్రికి తెలిపారు. ఉద్యోగులపై దాడి జరిగిన ఘటనలో 16 మందిపై కేసు నమోదు కాగా, ఇప్పటివరకు 8 మందిని మాత్రమే అరెస్ట్ చేశారని, మిగతా వారిని ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ ఆక్రమణల కూల్చివేతల సమయంలో రెవిన్యూ ఉద్యోగులతో పాటు నామమాత్రంగా ఒక కానిస్టేబుల్ మాత్రమే వస్తున్నారని, కూల్చివేతల ఆదేశాలు అమలు చేసే సమయంలో కొంతమంది దాడులకు దిగుతున్నారని ఉద్యోగులు వివరించారు. కూల్చివేతల సమయంలో కనీసంగా ఎస్‌ఐ స్థాయి అధికారి నేతృత్వంలో సిబ్బందిని పంపిస్తే తప్ప కూల్చివేతలను చేపట్టడం కష్టమని తేల్చిచెప్పారు.

తెలంగాణకు 17, ఆంధ్రకు 16 టిఎంసిలు

కృష్ణాబోర్డు సమావేశంలో నిర్ణయం

మన తెలంగాణ / హైదరాబాద్ : కృష్ణా జలాలను మే నెల చివరి వరకూ వినియోగించుకోవడంపై రెండు రాష్ట్రాల మధ్య పరస్పర అంగీకారం కుదిరింది. కృష్ణా నది నిర్వహణ బోర్డు సభ్య కార్యదర్శి అధ్యక్షతన హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణకు 17 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 16 టిఎంసిల చొప్పున కృష్ణా జలాలను వాడుకునేందుకు ఏకాభిప్రాయం కుదిరింది. రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ ఛీఫ్‌లతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగినట్లు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని మే నెల 31వ తేదీ వరకు రెండు రాష్ట్రాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వినియోగించుకోవాల్సిన నీటిని లెక్కించామని, రెండు రాష్ట్రాల ఇఎన్‌సిల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం మేరకు పై విధంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఒక టిఎంసిని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ త్రాగునీటి అవసరాలకు, నల్లగొండ జిల్లా అవసరాలకు ఆరు టిఎంసిలు, సాగునీరు త్రాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి పది టిఎంసిల మేర నీటిని తెలంగాణ వాడుకోవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా శ్రీశైలం నుంచి ఒక టి ఎంసిని, నాగార్జునసాగర్ కుడి కాల్వ నుంచి ఏడు టిఎంసిలు, ఎడమ కాల్వ నుంచి నా లుగు టిఎంసిలు, కృష్ణా డెల్టాకు నాలుగు టిఎంసిలు (పులిచింతలను కలుపుకుని) వాడుకోవాలని స్పష్టం చేశారు.

మార్చి 21వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఈ నీటిని వినియోగించుకోవాలని, శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 800 అడుగులు ఉండేలా రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఏ అవసరాల కోసం ఈ సమావేశంలో నీటి వినియోగాన్ని రెండు రాష్ట్రాలూ చర్చించాయో రెండు ప్రాజెక్టుల నుం చీ విడుదలవుతున్న నీటిని ఆ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. శ్రీశైలం నుంచి విడుదల చేసే నీటి మోతాదును కాలువల ద్వారా జరిగే సరఫరాలో చోటుచేసుకునే నష్టాన్ని, ఆవిరయ్యే మోతాదును కూడా కలి పి లెక్కించి (ప్రో రాటా పద్ధతిలో 12% అంచనాతో) రెండు రాష్ట్రాల వాటాను నిర్ణయించిన ట్లు తెలిపారు. శ్రీశైలం నుంచి విడుదల చేసే నీటిని కుడివైపున ఉండే విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా వదలాలని, ఒకవేళ విద్యుత్ ఉత్పత్తి అవసరం లేనట్లయితే స్లూయిజ్ గేట్ల ద్వారా విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు నాలుగు వేల క్యూసెక్కుల వంతున మార్చి 21వ తేదీ నుంచే నా లుగు టిఎంసిలను విడుదల చేయాలని పేర్కొన్నారు. కుడి కాల్వ ద్వారా ఏడు వేల క్యూసె క్కు వంతున ఈనెల 25వ తేదీ నుంచి విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలకు విడుదలవుతున్న నీటిని, ఆ తర్వాత జరి గే వినియోగాన్ని సంయుక్తంగా కృష్ణా బోర్డు కు తెలియజేయాలని స్పష్టం చేశారు.

తెలుగుకు వెలుగు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు ఒక పాఠ్యాంశంగా ఉంటుందని సిఎం ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతం అమలవుతున్న మాతృభాష భోధన విధానాన్ని అధ్యయనం చేసి వచ్చిన అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. మన రాష్ట్రంలోనూ తెలుగును తప్పనిసరిగా ఒక పాఠ్యాంశంగా బోధించాలని నిర్ణయించినట్లు ఆ ప్రకటనలో సిఎం పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆంగ్ల మాధ్యమంలో చదవడం చాలామందికి అనివార్యమవుతోందని, కానీ అదే సమయంలో తెలుగు భాష కనుమరుగు కావద్దని పేర్కొన్నారు. అందువల్లనే ఆంగ్ల మాధ్యమంలో చదివే విద్యార్థులకు సైతం తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధనను పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తెలుగు చదివే పిల్లలకు సైతం ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడంపైనా ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. తొలుత ఇంటర్మీడియట్ వరకు తెలుగు అభ్యాసాన్ని తప్పనిసరి చేయాలని భావించామని, అయితే ఇంటర్ సిలబస్ అన్ని విద్యా సంస్థల్లో ఒకే తీరులో లేనందువల్ల అమలు సందర్భంగా కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని ఆ ప్రకటన స్పష్టం చేసింది. తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో మాతృభాష బోధన అమలు జరుగుతున్న తీరును పరిశీలించిన తర్వాత మొదటి దశలో పదవ తరగతి వరకుమాత్రమే తప్పనిసరి తెలుగును అమలుచేయాలని నిర్ణయించినట్లు సిఎం తెలిపారు. తరగతులవారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్‌ను రూపొందించడంపై తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడమీ నిర్వాహకులను సిఎం సూచనలు చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కెటిఆర్, జూపల్లి కృష్ణారావు, పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విద్యాశాఖ) రాజీవ్ రంజన్ ఆచార్య తదితరులున్నారు.

మంచి కోసమే అప్పు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలు పరిపాలనను కొనసాగిస్తున్నాయా? తమ పరిమితికి లోబడి అప్పులు చేస్తున్నాం. అప్పులు తీసుకోవడం బడ్జెట్‌లో భాగం. అభివృద్ధి చెందుతున్న అమెరికా, జపాన్ దేశాలు కూడా అప్పులు చేస్తున్నాయి'' అని సిఎం అన్నారు. అప్పులు తీసుకోవడం బుద్ధి తక్కువ ఆలోచన కాదని అన్నారు. దేశ జిడిపి రూ.167 లక్షల కోట్లు ఉండగా, కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 82 లక్షల కోట్ల మేరకు 49.5 శాతం అప్పులు చేసిందని సిఎం తెలిపారు. ఈ ఏడాది కేంద్రం చెల్లిస్తున్న అప్పులు రూ. 8.76 లక్షల కోట్లు అని వెల్లడించారు. గత మూడు సంవత్సరాలలో బిజెపి ప్రభుత్వం చేసిన అప్పులు 2016 – 17 ఆర్థిక సంవత్సరంలో రూ. 5,35,618 కోట్లు, 2017 – 18లో రూ. 5,94,849 కోట్లు అప్పులు తీసుకోగా 2018 – 19లో రూ.6,24,276 కోట్లు అప్పు తీసుకోనున్నట్లు 2018 – 19 ఏడాది బడ్జెట్‌లో ఆర్థికమంత్రి జైట్లీ చెప్పారని ఆయన వివరించారు. చాలా దేశాల్లో జిడిపి కంటే అప్పులే ఎక్కువ ఉన్నాయని కెసిఆర్ తెలిపారు. తెలంగాణ జిఎస్‌డిపిలో 21 శాతం అప్పులు ఉన్నాయని, ఉదయ్ పథకం కింద రూ. 9 వేల కోట్ల అప్పు వచ్చిందన్నారు. ఈ నాలుగేళ్ళలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క మంచి పని చేయలేదా, విపక్షాలకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఆసరా పెన్షన్లు, గురుకుల పాఠశాలల ఏర్పాటు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కనిపించడం లేదా అని సిఎం ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదన్నట్లు ప్రతిపక్షాలు మాట్లాడటం బాధాకరమన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో 22 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఉందని, చిన్న చిన్న పొరపాట్లు జరిగితే రైతు రుణమాఫీ జరగలేదంటారా? అంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణ మాఫీ, వడ్డీ మాఫీ ఒకటి రెండు చోట్ల అమలు కాకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ఉద్యోగులకే జీతాలు ఎక్కువగా ఉన్నాయని సిఎం చెప్పారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కెసిఆర్ కిట్ పథకాన్ని ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తుందన్నారు. రూ.1000 పెన్షన్ బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్నారా? అని కెసిఆర్ వ్యాఖ్యానించారు.

త్వరలో భువనేశ్వర్‌కు కెసిఆర్?

(మొదటిపేజీ తరువాయి)

నవీన్ పట్నాయక్‌తో కూడా ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత, రూపురేఖలు, ప్రాధాన్యతల గురించి చర్చిస్తారని సమాచారం. ఇరువురి భేటీ గురించి సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలిసింది. నవీన్ పట్నాయక్ వరుసగా నాలుగవ సారి ఒడిషా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. తొలి రెండు ఎన్నికల్లో బిజెపితో కలిసి ఎన్నికల్లో పోటీ చేయగా, తరువాత రెండు ఎన్నికల్లో స్వంతంగా గెలిచారు. అక్కడ చాలా కాలం కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నది. ఇటీవల కాలంలో బిజెపి రెండవ స్థానానికి ఎగబాకింది. ఒడిషాలో కాషాయజెండాను ఎగురవేసేందుకు బిజెపి సర్వ శక్తులు ఒడ్డుతుంది. ఒక విధంగా ఆ రాష్ట్రంలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్‌కు అటు కాంగ్రెస్, ఇటు బిజెపి రెండు కూడా సమాన శత్రువులే. మరోవైపు సిఎం కెసిఆర్ ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ కూడా ఇరు పార్టీలతో సంబంధం లేదని స్పష్టంగా చెబుతున్నారు. దీంతో నవీన్ పట్నాయక్ ఈ ప్రతిపాదనకు సహజ మిత్రునిగా ఉండే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.


ఐసిస్ చంపేసింది

(మొదటిపేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. సామూహిక సమాధుల నుంచి వారి మృత దేహాలను తవ్వి వెలికితీశారు. వాటిని ప్రత్యేక విమానంలో భారత్‌కు తీసుకువచ్చి వారి బంధువులకు అప్పగించనున్నట్లు సుష్మ చెప్పారు. 'ఆధారాలు లేకుండా చనిపోయినట్లు ఎవరి గురించి చెప్పబోనని గతంలో చెప్పాను...అయితే నేడు తగిన ఆధారాలు లభించినందునే వారు చనిపోయారని ప్రకటిస్తున్నాను' అని సుష్మాస్వరాజ్ సభలో చెప్పారు. ఇరాక్‌లోని రెండో అతి పెద్ద నగరం మోసుల్‌ను 2014లో ఐసిస్ ఉగ్రవాదులు ఆక్రమించుకున్నప్పుడు 40మంది భారతీయ కార్మికులను బందీలుగా పట్టుకున్నారు. వారిలో ఎక్కు వ మంది పంజాబ్, బంగ్లాదేశ్‌కు చెందిన వారే. పట్టుకున్న ఆ 40 మంది భారతీయుల్లో గురుదాస్‌పూర్‌కు చెందిన హర్జిత్ మాసీ అనేవ్యక్తి ఎలాగోలా తప్పించుకున్నాడు. మిగతావారిని ఉగ్రవాదులు ఊచకోత కోయడాన్ని తాను చూశానని అతడు చెప్పినప్పటికీ భారత ప్రభుత్వం దానిని తిరస్కరించింది. 'బంగ్లాదేశ్ ముస్లింగా చెప్పుకుని తప్పించుకున్నానని అతడు చెప్పినదంతా కట్టుకథ' అని సుష్మా స్వరాజ్ అన్నారు. బందీలుగా పట్టుకున్న భారతీయులను మొదట మోసుల్‌లోని జౌళి కర్మాగారంలో ఉంచారు. హర్జిత్ మాసీ తప్పించుకున్నాక మిగతా వారిని బాదోష్‌లోని కారాగారానికి తరలించారు. ఐసిస్ ఉగ్రవాదులు మోసుల్‌ను ఆక్రమించుకున్న సమయంలో దాదాపు 10 వేల మంది భారతీయ కార్మికులు ఇరాక్‌లో ఉన్నారు.

వారి గాలింపు చివరికి...

వారి కోసం చేపట్టిన నిరంతర గాలింపు చివరికి బాదోష్ సామూహిక సమాధుల వద్దకు చేరింది. అక్కడ లోతుగా పరిశోధించే రాడార్ల ద్వారా భారతీయుల మృతదేహాలను గుర్తించారు. ఇరాక్ అధికారుల సాయంతో వారి మృత దేహాలను తవ్వి వెలికి తీశారు. ప్రత్యేకమైన పొడవాటి జుట్టు, 'కడా', ఇరాకేతర బూట్లు, ఐడిల ఆధారంగా మృతి చెందినవారు భారతీయులే అని ధ్రువీకరించుకున్నారు. తర్వాత వారి మృతదేహాలను డిఎన్‌ఎ పరీక్షల నిమిత్తం బాగ్దాద్‌కు పంపారు. 38 మంది భారతీయుల డిఎన్‌ఎ సరిపోయిందని, కాగా ఒకరిది మాత్రం 70 మేరకు సరిపోయిందని భారత ప్రభుత్వానికి తెలిసిందని సుష్మాస్వరాజ్ తెలిపారు. తగిన ఆధారాలు లేకుండా కిడ్నాప్‌కు గురైన భారతీయులు చనిపోయినట్లు ప్రకటించలేనని ఆమె ఇదివరలో చెప్పారు. కాగా ఇప్పుడు ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఇంకా ఆమె వివరిస్తూ...ఐసిస్ ఉగ్రవాదులు మోసుల్ పట్టణాన్ని ఆక్రమించిన సమయంలో చాలా మంది ఇరాకీలు ఆ నగరాన్ని వదిలిపోయారు. కానీ భారతీయులు, బంగ్లాదేశీయులు అక్కడే ఉండిపోయారని చెప్పారు. భారతీయ కార్మికులు భోంచేసి తిరిగి వస్తున్నప్పుడు ఐసిస్ ఉగ్రవాదులు వారిని బందీలుగా పట్టుకున్నారని, మొదట వారిని జౌళి కర్మాగారానికి తీసుకెళ్ళారని, అక్కడ బంగ్లాదేశీ కార్మికులను వేరుచేసి ఇర్బిల్ నగరానికి పంపారని అక్కడి క్యాటరర్‌ను విచారించినప్పుడు తెలిసింది. బంగ్లాదేశీ కార్మికులను ఇర్బిల్ నగరానికి తరలించేందుకు క్యాటరర్ ఏర్పాటు చేసిన వ్యానులో 'అలీ' అనే మారుపేరుతో హర్జిత్ మాసీ తప్పించుకున్నాడు. మరునాడు లెక్కించినప్పుడు భారతీయుల్లో ఒకరు లేరని తెలిశాక బాదోష్ కారాగారానికి వారిని ఐసిస్ ఉగ్రవాదులు తరలించారు.





సుష్మా స్వరాజ్, హర్జిత్ మాసీ(ఫైల్ ఫొటో)

ఇరాక్‌కు భారత విదేశాంగ సహాయమంత్రి

ఇరాక్‌లో ఐసిస్ పాలన పడిపోయాక విదేశాంగ సహాయ మంత్రి వి.కె.సింగ్‌ను అదృశ్యమైన భారతీయులను వెతికేందుకు పంపామని, అక్కడి భారతీయ రాయబారి, ఇరాక్ అధికారి కలసి బాదోష్ కారాగారంలో వెతికారని సుష్మాస్వరాజ్ తెలిపారు. వెతికేప్పుడు ఆ ముగ్గురు ఓ చిన్న ఇంట్లో నేలపై పడుకుని చేసిన కృషిని ఆమె శ్లాఘించారు. స్థానికంగా విచారించినప్పుడు సమూహిక సమాధుల గురించి తెలిసింది. బాగ్దాద్‌లోని అమరవీరుల ఫౌండేషన్ సాయంతో మృతి చెందిన భారతీయులను గుర్తించారు. బాగా సహకరించిన ఇరాక్ అధికారులకు కూడా సుష్మ కృతజ్ఞతలు తెలిపారు. వి.కె.సింగ్ ఇరాక్‌కు వెళ్లి ప్రత్యేక విమానంలో మృతదేహాలను తీసుకొస్తారని, మొదట అమృత్‌సర్‌లో ఆ ప్రత్యేక విమానం దిగినప్పుడు పంజాబ్‌కు చెందిన 31 మంది, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన నలుగురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించనున్నారు. తర్వాత ఆ ప్రత్యేక విమానం పాట్నా, కోల్‌కతాలో కూడా ఆగనున్నదని సుష్మా వివరించారు. రాజ్యసభ చైర్మన్ 'ఇది చాలా విషాదకరమైన వార్త' అన్నప్పుడు రాజ్యసభలోని ఎంపిలు లేచి నిల్చుని మౌన సంతాపాన్ని ప్రకటించారు. ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాదుల చేతిలో బందీలుగా చిక్కిన 39 మంది భారతీయులు చనిపోయారన్న వార్తపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం ప్రకటించారు.



వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే : నల్ల సూర్యప్రకాష్

మన తెలంగాణ/కరీంనగర్ టౌన్: 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది తామేనని, రాగానే సంపూర్ణ మద్యం నిషేదం అమలు చేస్తామని బిఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వంపరంగానే అందిస్తామని, సేద్యానికి రెట్టింపు ప్రోత్సాహం ఇస్తామని తెలపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూగార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన బీఎల్ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలని తాము డిమాండ్ చేసినా చెవికెక్కలేదని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడితో పాటు 50 శాతం అదనంగా జోడించి చెల్లిస్తామని తెలిపారు. కార్పోరేట్ విద్య ధనికులకు పరిమితమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో తాము ప్రభుత్వంగానే ఉచిత విద్య,వైద్యం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో బిఎల్ఎఫ్ ఆవిర్భావంతో దేశం చూపు ఇటువైపు మళ్లిందని రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం అన్నారు. సభకంటే ముందు తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి నుండి సభాస్థలి వరకు భారీ ఎత్తున రోడ్ షో నిర్వహించారు.సమావేశంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, బిఎస్‌పి నాయకులు శ్రీనివాస్, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

‘స్టార్ హోటల్’ దొంగ

13 ప్రధాన నగరాల్లో చోరీలు, అంతర్రాష్ట్ర ఘరానా దొంగ అరెస్టు, రూ. 30 లక్షల నగలు స్వాధీనం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో : స్టార్ హోటళ్ళే వేదికలుగా, కొత్త జంటలు లేదా శుభకార్యాలు జరుపుకునే వారే లక్ష్యంగా చేసుకుని వారి నగలు, వజ్రాలు వంటి విలువైన వస్తువులను చోరీ చేస్తూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అంతర్రాష్ట్ర ఘరానా దొంగను నగర పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ. 30 లక్షలు విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతడు నగరంలోని పార్క్ హయత్ హోటల్‌లో నగలను చోరీ చేశాడు. ఇతడు చేసిన చోరీల వివరాలను మంగళవారం నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రంలోని వాపి అనే పట్టణంలో చికువాడిచాత ప్రాంతానికి చెందిన జయేష్ రావ్‌జీ సెజ్‌పాల్ (46) ఇతడు దేశంలోని 13 రాష్ట్రాల ప్రధాన నగరాల్లోని స్టార్ హోటళ్ళలోనే చోరీలకు పాల్పడ్డాడు. ఇప్పటి వరకు ఇతడిని 5 కేసుల్లో పలు నగరాల పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. దొంగతనం కేసులో మొదటిసారిగా 2003లో కొలాబా పోలీసులు అరెస్టు చేశారు. 2005లో చెన్నైలో నేరం చేశాడు. 2007లో చోరీకేసులో ఆగ్రా కోర్టు ఇతడికి 5 ఏండ్లు శిక్ష విధించింది.శిక్షపూర్తి కాగానే చోరీలు మొదలుపెట్టాడు. ప్రస్తుతం ఇతడు 19 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. చండీగడ్, కోల్‌కతా, కొచ్చిన్, కోయంబత్తూర్, చెన్నై, బెంగళూరు, డిల్లీ, ముంబై నగరాల్లోని స్టార్‌హోటళ్ళలో చోరీలు చేశాడు. నగరంలోని బంజారాహిల్స్, విశాఖపట్నం, ఆబిడ్స్, ఎస్ఆర్‌నగర్ స్టేషన్‌ల పరిధిలోనూ నేరాలు చేశాడు. చోరీలు చేసిన ప్రాంతాల్లో ఇతడి ఫోటోగ్రాఫ్స్ లభిస్తున్నాయి. కానీ, ఇతడు ఎవరు, చిరునామా లభించకపోవడంతో తప్పించుకోగలుగుతున్నాడు.

విరక్తితో యువకుడి ఆత్మహత్య

మన తెలంగాణ/సదాశివనగర్ (కామారెడ్డి జిల్లా) : ఉపాధి కోసం విదేశాలకు వెళ్లడానికి ఓ యువకుడు మెడికల్ పరీక్షలో అన్‌ఫిట్ కావడంతో మనస్తాపం చెంది ఆత్మహ్యకు పాల్పడిన ఘటన సదాశివనగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం... సదాశివనగర్ గ్రామానికి చెందిన పబ్బహరీష్ (25) గతంలో గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చాడు. కొంతకాలం తరువాత మళ్లీ వెళ్లడానికి ప్రయత్నించి వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. పరీక్షల్లో తాను అన్‌ఫిట్‌గా రిపోర్ట్ రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. తండ్రి నర్సయ్య ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాల పేరిట రూ.83 లక్షల టోకరా

బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు




మన తెలంగాణ/లక్షెట్టిపేట : నిరుద్యోగుల జీవితాలను ఆసరాగా తీసుకొ ని వివిధ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ. 83 లక్షల టోకరా వేసి, పరారైన సంఘటన మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో చోటు చేసుకుంది. లక్షెట్టిపేట సిఐ ప్రతాప్ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ సర్దార్ 2016లో ఆలిండియన్ ఉమెన్ డైర్ ఆసోసియేషన్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. వివిధ మండలాల్లో మండలానికి ఒక ఆర్గనైజర్‌ను ఏర్పాటు చేశాడు. అనంతరం వీరి కార్యాలయాన్ని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి, సర్కార్ నౌకరి అనే వెబ్ సైట్‌ను ఏర్పాటుచేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని వెబ్ సైట్‌లో పొందుపర్చారు. ఈ వెబ్‌సైట్ చూసిన కొంత మంది నిరుద్యోగులు నమ్మి ఆయా మండలాల్లోని ఆర్గనైజర్లకు ఒక్కొక్క వ్యక్తి రూ. 1.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ముట్ట జెప్పారు. 39 మంది బాధితుల వద్ద 83 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఆదిలాబాద్ జిల్లా కేంద్ర కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తాము మోసపోయినట్లు గుర్తించారు. దీనికి సహకరించిన హైదర్, రహీం, రజాక్, రవికిరణ్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నామని వారు తెలిపారు. ప్రధాన నిందితుడైన షేక్ సర్ధార్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

119 స్థానాల్లో పోటీకి సిద్ధం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మన తెలంగాణ / తిమ్మాపూర్ : టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి 4 ఏళ్లు గడిచినప్పటికి ప్రజలకు చేసింది ఏమి లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బిఎల్ఎఫ్ చేపట్టిన యాత్ర మండలంలోని ఎల్ఎండి కాలనీకి చేరుకున్న సందర్భంగా మంగళవారం తమ్మినేని వీరబద్రం కు సిపిఎం, బిఎల్ఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎల్ఎండి నుండి బైక్ ర్యాలీ నిర్వహించి, అలుగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీర భద్రం మాట్లాడుతూ ప్రజలు ఆశించిన విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పాలన కొనసాగించడం లేదని విమర్శించారు. రాష్ట్రం లో సామాజిక న్యాయం సాధించడానికి బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ లోని 119 సీట్ల లో పోటీ చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. తమ పార్టీ అన్ని రాజకీయ పార్టీలతో కలసి పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నల్ల సూర్యప్రకాశ్, జి. రాములు, నాగయ్య, మజీద్ ఉల్లాఖాన్, ముకంద రెడ్డి, మర్రి వెంకట స్వామి, వెంకట్ రెడ్డి, గుడి కందుల సత్యం, మాతంగి శంకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయని ప్రభుత్వం



మన తెలంగాణ/డిచ్‌పల్లి (నిజామాబాద్ జిల్లా) : రైతులకు మేలు చేయడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర జెఎసి చైర్మన్ కోదండరాం అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కెఎన్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రైతు సమస్యల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా అదేమీ పట్టనట్టుగా సిఎం కెసిఆర్ ఢిల్లీలో కూర్చొని దేశాన్ని ఉద్ధరిస్తాననడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోగా అకాల వర్షాలతో నష్టపోయిన పంటకు పంటనష్టం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జెఎసి చైర్మన్ గోపాల్‌శర్మ, నడిపల్లి ఎంపిటిసి సాయిలు, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, ఉప్పు సంతోష్ పాల్గొన్నారు.

సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు

▸▸ ఎట్టకేలకు కారుణ్య నియామకాలకు మోక్షం



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : సింగరేణి కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు మంగళవారం సింగరేణి యాజమాన్యం త్వరలోనే మెడికల్ బోర్డును ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. సింగరేణి సిఅండ్ఎండి శ్రీధర్‌తో పాటు ముఖ్య అధికారులు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ప్రత్యేక సమావేశంలో ఏర్పాటు చేసుకొని మెడికల్ బోర్డు ఏర్పాటుపై చర్చించి త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలకు వారసత్వ ఉదోగ్యంగా కారుణ్య నియామకాలు చేపడుతామని సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చనుంది. ఇటీవలనే కారుణ్య నియామకాలపై ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం మెడికల్ బోర్డులో ఉన్న జబ్బులకు మరో పది జబ్బులను చేర్చుతూ ఉత్తర్వుల సంఖ్య సిఆర్‌పి/పిఇఆర్/ఐఆర్/సి/081/305ను జారీ చేసింది. ఇంక త్వరలోనే కారుణ్య నియామకాలకు దరఖాస్తుల ప్రక్రియ మొదలు కానుండగా కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దాదాపు మొదటి విడత కింద 1500 మంది కార్మికులకు లాభం చేకూరే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కారుణ్య నియామకాల అమలు ఏవిధంగా ఉటుందోనని కార్మికులు సందిగ్ధంలో ఉన్నారు. సిఎం సూచనల మేరకు ఇటీవల సింగరేణి సిఎండి శ్రీధర్ నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను కూడా జారీ చేశారు. అయితే విధి విదానాలపై కొంత వరకు స్పష్టత లేకపోవడంతో ఆ కార్మికులు కొంత మేరకు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న జబ్బులకు తోడుగా మరో 16 జబ్బులు చేర్చి వెంటనే కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని దేశించారు. ఇందులో పక్షవాతం, మూత్రపిండ, కాలేయ వ్యాధులు, క్యాన్సర్, పార్కిన్సన్, అవయవాలు కోల్పోవడం, గుండె వ్యాధి, టిబి కుష్టువ్యాధి, హెచ్ఐవి, కీళ్లనొప్పులు, కంటిచూపు లోపం, మానసిక వ్యాధులు, ఊపిరితిత్తులను బలహీన పర్చే దీర్ఘకాలిక వ్యాధులు, ప్రమాదాలలో గాయపడి ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్నవారు మెడికల్ బోర్డుకు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని సింగరేణి యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుతం మెడికల్ బోర్డు ఏర్పాటు నిర్ణయంతో కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సంచార జాతులకు మంచిరోజులు



మనతెలంగాణ/మేళ్ళచెర్వు : సంచార జాతుల కులాలకు విద్య, రాజకీయ, అన్నిరంగాల్లో రిజర్వేషన్ కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలంగాణ బిసి కార్పోరేషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కందిబండ గ్రామంలో జీవిస్తున్న సంచారజాతుల జీవనస్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల కాలంలో బిసి కులాల జీవనస్థితిగతులు మారకపోవడం తన మనసుకి ఎంతో బాధ కలిగించాయని తెలిపారు. తెలంగాణరాష్ట్రం వచ్చిన తరువాత వారి జీవన విధానాలు సమాజంలో సగభాగంగా ఉన్నా బిసి కులస్థుల జీవన విధానాన్ని మారేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిసి కమిషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసినప్పుడే తెలంగాణ వికాసం సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బిసి కార్పొరేషన్ సభ్యులు అత్యంత వెనుకబడిన 24 కులాలను గుర్తించినట్లు వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంచారజాతుల వారు 35 లక్షల మంది ఉన్నారని వారి స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం త్వరలోనే ఒక ప్రణాళిక సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు. మేళ్ళచెర్వు మండలకేంద్రంలో ఎస్టీ, బిసి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేసి గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవకరుణ, సర్పంచ్ రుక్కు యాదవ్, ఉపసర్పంచ్ బి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో వెండి నాణేలు లభ్యం





మన తెలంగాణ/ఆత్మకూరు రూరల్ : తమ వ్యవసాయ పొలంలో ఉన్న గుట్టలను రైతులు తవ్వుతుండగా నిజాం కాలం నాటి వెండి నాణేలు బయటపడ్డాయి. నల్గొండ జిల్లాకు చెందిన దేవల్ల నారాయణరావు కత్తెపల్లి గ్రామంలోని 12/ఇ సర్వే నెంబర్ గల 4 ఎకరాల 26 గుంటల భూమిని కొనుగోలు చేశారు. తమ వ్యవసాయ పొలంలో ఉన్న గుట్టలను తొలగించడానికి గత వారం రోజులుగా ఇటాచితో చదును చేస్తున్నాడు. శనివారం చదును చేస్తుండగా నిజాం కాలం నాటి వెండి నాణేలు బయటపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మట్టి కుండలో నిండుగా వెండి, బంగారు నాణేలు బయటపడ్డాయని, గ్రామస్థులకు పంచి వారి సహకారంతో భూమి యాజమాని స్వాధీనం చేసుకున్నట్లు పుకార్లు వినిపిస్తున్నారు. సిఐ శంకర్, అమరచింత ఎస్ఐ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మోహన్‌లు కత్తేపల్లి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.


చౌటుప్పల్‌లో పోలీసుల నిర్బంధ తనిఖీలు

▸▸ 45 వాహనాలు, అరకిలో గంజాయి స్వాధీనం
▸▸ పోలీసుల అదుపులో ఐదుగురు




మన తెలంగాణ/చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని శివాజీనగర్ కాలనీలో రాచకొండ పోలీసులు నిర్బంధ తనిఖీలు (కార్డెన్ సెర్చ్) చేపట్టారు. భువనగిరి డిసిపి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాటాక కాలనీలోని పలువురి ఇళ్లల్లోకి చొరబడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీసులు నిర్వహించిన సోదాల్లో పత్రాలు సరిగ్గా లేని 42 బైకులు, ఒక కారు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురు నిందితులు, అరకిలో గంజాయితో పట్టుబడ్డ మరో వ్యక్తితో సహా ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం గొలుసు దుకాణాల్లో పట్టుబడ్డ మద్యం బాటిళ్లను ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవసరమైన పత్రాలు చూపిన వారికి మాత్రమే వాహనాలను తిరిగి అప్పగిస్తామని డిసిపి రామచంద్రారెడ్డి వెల్లడించారు. పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో చౌటుప్పల్ ఎసిపి రామోజు రమేష్ తో పాటు స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ వెంకటయ్య, ఎస్ఐలు చిల్లా సాయిలు, నవీన్‌బాబు, చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం



మన తెలంగాణ/చౌటుప్పల్ : కార్పొరేట్ వైద్యాన్ని గ్రామీణ పేద ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని మల్లికార్జున ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో, పవర్‌గ్రిడ్ కార్పోరేషన్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ ముఖ్య అతిధిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్, ప్రభుత్వ సలహాదారు పాపారావు ఈ మెగా వైద్య శిబిరాన్ని సందర్శించారు. చౌటుప్పల్ ఆర్‌డిఒ సూరజ్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయలక్ష్మీ, ఎంపిపి చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఎసిపి రమేష్, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

మోడీ పాలనలో అరాచకం : చాడ



మన తెలంగాణ / సిరిసిల్ల : మోడీ అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై, దళితులపై దాడులు పెరిగాయని గోరక్షక దళాల పేరిట సంఘ పరివార్ శక్తులు దాడులు చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్లలో సిపిఐ రెండవ జిల్లా మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ మొదటివారంలో తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలను, ఏప్రిల్ చివరి వారంలో (25 నుండి 29 వరకు) కేరళలో జాతీయ మహాసభలను నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశానికి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కెవి అనసూర్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మంత్రి చంద్రన్న, నల్ల చంద్రమౌళి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సమావేశంలో ఆహ్వానసంఘం అధ్యక్షులు సామల మల్లేశం, జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రసంగించారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సృజన, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలు కొమురయ్య, బూర శ్రీనివాస్, వద్దెపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, ఇద్దరు పిల్లల్ని హత్య చేసిన కిరాతక భర్త

▸▸ పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు
▸▸ మీర్‌పేట్‌లో సంఘటన



కిరాతక భర్త సురేందర్, వరలక్ష్మీ, యశస్వీని, నితిన్.

మన తెలంగాణ/బాలాపూర్ : కిరాతక భర్త...భార్యతో పాటుగా అన్నెం పున్నెం ఎరుగని ఇద్దరు కన్న బిడ్డలను అతి దారుణంగా హతమార్చిన సంఘటన మంగళవారం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివనారాయణపురంలో చోటు చేసుకుంది. ఏడేళ్ల క్రితం బిహెచ్ఇఎల్ లింగంపల్లి, తెల్లాపూర్ నివాసి ఆటో మెకానిక్ సురేందర్ (35)తో శివనారాయణపురానికి చెందిన తుమ్మ మహేష్, జ్యోతిల కుతురైన వరలక్ష్మీ (28)తో వివాహం జరిగింది. సురేందర్, వరలక్ష్మి దంపతులకు నితీష్ (5), యశస్విని (3) సంతానం ఉన్నారు. అయితే తెల్లాపూర్ నుంచి సురేందర్ తన భార్య పిల్లలతో ఉగాది పండుగకు అత్తవారింటికి శివనారాయణపురం వచ్చారు. పండుగకు అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం ఊరికి పోదామనుకునే సమయంలో సురేందర్ తన మామను కల్లుకోసం పంపించాడు. అత్తయ్య జ్యోతి సరుకుల కోసం కిరాణా షాపునకు వెళ్లింది. అంతకు ముందే ఇంట్లో సురేందర్ కుటుంబ సభ్యులతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. గదిలో సురేందర్ కొడుకు నితీష్, కూతురు యశస్విని గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం భార్య వరలక్ష్మీ ని హత్య చేసి నేరుగా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఇంటికి వచ్చిన తల్లి తండ్రులు కూతురు, మనమడు, మనమరాలును చూసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈ మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎల్ఏ రాజాసింగ్‌పై సైఫాబాద్ పిఎస్‌లో ఫిర్యాదు

మన తెలంగాణ/గోషామహల్ : తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేసిన గోషామహల్ ఎంఎల్ఏ రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ మమతాగుప్తా సైపాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేటర్ మమతాగుప్తా, టిఆర్ఎస్ నేత సంతోష్‌గుప్తా, సుదర్శన్, హర్‌ప్రీత్, వార్డు కమిటి సభ్యులు సంజయ్, శ్రీనివాస్‌యాదవ్, నార్మన్ కొల్లిన్స్, విజయ్, జగదీష్, కిరణ్‌లతోకలిసి సైపాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఎం కెసిఆర్‌ను కచ్‌రా సిఎం అంటూ వ్యాఖ్యానిస్తూ ఎమ్మెల్యే రాజాసింగ్ చిన్న రాష్ట్రాల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన పశ్చిమబెంగాల్ సిఎం మమతాబెనర్జీని ఎలా కలుస్తారంటూ ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేసిన పత్రాలను కార్పొరేటర్ మమతాగుప్తా పోలీసులకు అందజేశారు. ఈ మేరకు పోలీసులు కార్పొరేటర్ ఫిర్యాదును స్వీకరించి విచారణ ప్రారంభించారు.

సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కబడ్దార్ : తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే నెంబర్‌వన్‌గా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అహర్నిషలూ కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల గోషామహల్ టిఆర్ఎస్ ఎం ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ను వెంటనే ఉపసంహరించుకుని, సిఎం కెసిఆర్ కుటుంబానికి. తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాం డ్ చేశారు.

కన్న తండ్రిని కడతేర్చిన తనయుడు

మన తెలంగాణ / పెద్దపల్లిరూరల్ : మద్యం సేవించి తల్లిని వేధిస్తున్నాడన్న కారణంతో తండ్రిని కొట్టడంతో మృతిచెందిన ఘటన రాగినేడులో జరిగింది. పెద్దపల్లి జిల్లా రూరల్ మండలం రాగినేడులో సోమవారం రాత్రి మాటేటి శ్రీనివాస్ (38) భార్య సునీతల మధ్య గొడవ కావటంతో కొడుకు రాజశేఖర్(20)శ్రీనివాస్‌ను ఇనుప రాడుతో కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి సునీత అందించిన వివరాల ప్రకారం.. తన కొడుకు తండ్రిని కొట్టాలని కొట్టలేదని తెలిపింది. తన కొడుకుకు మంగళవారం నుండి డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. తన భర్త కూలి పని చేసుకుని పోషించేవాడని, కుమార్తె సంధ్యారాణి (18) ఇంజినీరింగ్ చదువుతోందని తెలిపారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్యాంగ్ రేప్ నిందితులకు రిమాండ్

మన తెలంగాణ / పినపాక : గిరిజన మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ చేసిన నిందితులను మంగళవారం పట్టుకున్నట్లు మణుగూరు డిఎస్‌పి సాయిబాబా తెలిపారు. ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ... ఐదుగురు ప్రధాన నిందితులు కుంజా ఏసు, భరత్, కె. కిరణ్, నవీన్, వినోద్‌లతో మరో 8 మందిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లుతెలిపారు. మార్చి11న బాలిక పుట్టినరోజు నాడు మధ్యాహ్నం 1గంట సమయంలో ప్రధానరహదారిపైన గల కిరాణా దుకాణానికి రాగా అక్కినపల్లి మల్లారం వెళ్లే మార్గానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఆ గ్రామానికి దగ్గరలో ఉన్న సమ్మిరెడ్డి అనే ఒకరి ఇంట్లో ఉండాలని బాలికను బెదిరించారు. ఆ సమయంలో సమ్మిరెడ్డి కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక బంధువులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసులో రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో సీజ్‌చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుని అరెస్టు

మన తెలంగాణ/సిటీబ్యూరో : భారత ఉప రాష్ట్రపతి వ్యక్తిగత సహాయకుడి (పిఎ)నని ఆయన కార్యాలయం నుండి ఫోన్ చేస్తున్న మీరు ఈ కేసుకు సహాయాన్ని చేయాలని సూచిస్తూ, బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిని హైదరాబాద్ నగర సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా భోగాపురంకు చెందిన పసుపులేటి నవీన్ అలియాస్ అర్జున్‌రావు (20) నగరంలోని పలువురు అధికారులకు ఫోన్‌లు చేసి తనకుతానుగా భారత ఉపరాష్ట్రపతి పిఎగా పరిచయం చేసుకుని పలు రకాలుగా సహాయాన్ని కోరడంతోపాటు అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఇది తెలిసిన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కిషనర్‌రెడ్డి నగర పోలీసులకు ఫిర్యాదు చేసి అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అరెస్టు చేశారు.

ముగిసిన కస్టడీ జైలుకు పురుషోత్తంరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ / మాదన్నపేట్ : హెచ్ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, అతని సన్నిహితుడైన శ్రీనివాస్‌రెడ్డిల కస్టడీ ముగియడంతో ఎసిబి అధికారులు మంగళవారం సాయంత్రం తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. గత ఆరురోజుల క్రితం ఎసిబి అధికారులు జైలు నుంచి కస్టడీకి తీసుకున్నారు.

గొప్ప చిత్రానికి వాయిస్ ఓవర్

అలనాటి అందాల తార సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'మహానటి'. తెలుగుతో పాటు తమిళ్‌లో కూడా ఒకేసారి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు యువ దర్శకుడు నాగ్ అశ్విన్. వైజయంతి మూవీస్ బ్యానర్‌లో ఈ చిత్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సావిత్రి పాత్రలో యంగ్ హీరోయిన్ కీర్తిసురేష్ నటిస్తోంది. అయితే సీనియర్ నటి భానుప్రియ కూడా ఈ సినిమాలో భాగం కావడం విశేషం. తమిళ్‌లో ఆమె ఒక పాత్రకు డబ్బింగ్ చెబుతోందట. అదేవిధంగా సినిమా ప్రారంభంలో ఆమె వాయిస్ ఓవర్‌తో గొప్ప నటులకు శ్రద్ధాంజలి ఘటిస్తారట. ప్రస్తుతం భానుప్రియ డబ్బింగ్ పనుల్లో బిజీగా ఉందట. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, సమంత, షాలిని పాండే, క్రిష్, తరుణ్‌భాస్కర్‌తో పాటు సీనియర్ నటులు మోహన్‌బాబు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడిన ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ ప్లాన్ చేశారు.


భానుప్రియ

ఏప్రిల్ 12న సెట్స్‌పైకి...


ఎన్టీఆర్

ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమా ఏప్రిల్ 12న ప్రారంభంకానుంది. హారిక హాసిని సంస్థ నిర్మించే ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లోని సినిమాపై అప్పుడే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఏప్రిల్ 12న ప్రారంభయ్యే ఈ చిత్రం షూటింగ్ ఆ నెలాఖరు వరకు కొనసాగుతుంది. అనంతరం నాలుగు రోజుల గ్యాప్ ఇచ్చి రెండో షెడ్యూల్‌ను మొదలుపెడతారు. మొదటి షెడ్యూల్ మొత్తం హైదరాబాద్‌లోనే ఉంటుంది. రామోజీ ఫిల్మ్‌సిటీలో వరుసగా షూటింగ్ జరిగే అవకాశం ఉంది. రెండో షెడ్యూల్ లొకేషన్ వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సినిమాను ఎలాగైనా దసరా పండుగ లోపున పూర్తి చేయాలన్నది ఎన్టీఆర్ సంకల్పం. అలా అయితే ఎటువంటి పోటీ లేకుండా దసరా బరిలో సోలోగా రావచ్చని ఈ స్టార్ హీరో అనుకుంటున్నాడు. లేదంటే సినిమా సంక్రాంతికి వెళ్లిపోవాలి. అలా అయితే బాలకృష్ణ నిర్మించే ఎన్టీఆర్ బయోపిక్ మూవీతో పోటీపడాల్సి వస్తుంది. అందుకే సంక్రాంతికి తన సినిమా వెళ్లకుండా చూడాలన్నది ఎన్టీఆర్ ఆలోచనగా తెలిసింది. కానీ వంద కోట్ల బడ్జెట్ సినిమా అంటే సంక్రాంతి అన్నది సరైన సీజన్ అని నిర్మాతలు భావిస్తున్నారట. అయితే పెద్దగా గ్యాప్ లేకుండా వరుస షెడ్యూళ్లతో సినిమా షూటింగ్‌ను ప్లాన్ చేశారు.


శరణ్ కొప్పిశెట్టి, సంయుక్త హెగ్డే, బ్రహ్మాజీ, అనిల్ సుంకర, నిఖిల్, రాకేందు మౌళి

ఘన విజయం దిశగా 'కిరాక్ పార్టీ'

నిఖిల్, సిమ్రాన్ పరింజా, సంయుక్త హెగ్డే హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఏటివి సమర్పణలో ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ చిత్రం తాజాగా విడుదలై విజయవంతంగా థియేటర్లలో ఆడుతోంది. నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్‌ను ఈ సినిమా సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో అనిల్ సుంకర మాట్లాడుతూ "కిరాక్ పార్టీ విడుదలైన అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. అన్ని చోట్ల సినిమాకు మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా విద్యార్థులకు ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతోంది. నిర్మాతగా మాకు మూడు రోజుల్లోనే బ్రేక్‌ఈవెన్ ఇచ్చిన చిత్రమిది. ఓవర్సీస్‌లో అరమిలియన్ వసూళ్లను సాధించింది. నిఖిల్ కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రమిది"అని అన్నారు. నిఖిల్ మాట్లాడుతూ "మూడు రోజులుగా థియేటర్లలో సినిమా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో ప్రదర్శించబడుతోంది. నా కెరీర్‌లో ఈ చిత్రం ఓ మైలురాయిగా నిలిచిపోయింది. క్లైమాక్స్‌కు ముందు సన్నివేశాల్లో నా నటన బాగుందని చెబుతున్నారు. రెండో వారంలోనూ ప్రేక్షకుల స్పందన ఇలాగే ఉంటుందని అనుకుంటున్నాం. ఓవర్సీస్‌లో మంచి వసూళ్లు లభిస్తున్నాయి"అని తెలిపారు. శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ "సినిమాను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థాంక్స్. ప్రతి విద్యార్థి తమ కథగానే ఈ సినిమాను భావిస్తున్నారు. సినిమాకు అనూహ్య స్పందన రావడం ఆనందంగా ఉంది"అని చెప్పారు. ఈ సమావేశంలో సంయుక్త హెగ్డే, బ్రహ్మాజీ, హేమంత్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల తర్వాత జంటగా...

యంగ్ హీరో రామ్, అందాల తార కాజల్ కలిసి ఇప్పటివరకు ఒకే ఒక్క సినిమాలో నటించారు. 2009లో వచ్చిన 'గణేష్ జస్ట్ గణేష్' సినిమాలో వీళ్లిద్దరూ జంటగా నటించారు. ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు రామ్, కాజల్ కలసి మరో చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వీళ్లిద్దరు ఓ సినిమా చేయబోతున్నారు. సీనియర్ హీరో రాజశేఖర్‌కు 'గరుడవేగ' సినిమాతో మంచి హిట్‌ను అందించిన ప్రవీణ్ సత్తారు తన తదుపరి చిత్రాన్ని రామ్‌తో చేయనున్నాడు. కథ నచ్చడంతో రామ్ వెంటనే ఈ సినిమాకు ఓకే చెప్పేశాడు. దీంతో ప్రవీణ్ సత్తారు ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ను ప్రారంభించేశాడు. భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై త్వరలోనే ఈ చిత్రం ప్రారంభంకానుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా కాజల్‌ను తీసుకున్నారు. ఇక ప్రస్తుతం దిల్‌రాజు బ్యానర్‌లో త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు రామ్. ఈ మూవీ షూటింగ్ పూర్తయిన తర్వాత ప్రవీణ్ సత్తారు సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది.


కాజల్, రామ్


'గులేబకావళి' ఆడియో వేడుకలో రసమయి బాలకిషన్, ఎన్.శంకర్, కల్యాణ్, మల్కాపురం శివకుమార్, జీవిత, జానీ మాస్టర్

మల్కాపురం శివకుమార్ ప్రతి సినిమా సక్సెస్ కావాలి

ప్రభుదేవా, హన్సిక హీరోహీరోయిన్లుగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రేవతి ప్రధాన పాత్రలో నటించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి. పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందజేస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్ర గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. బిగ్ సీడీని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి, శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ విడుదల చేశారు.

ఆడియో సీడీలను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ ఆవిష్కరించి తొలి సీడీని శ్రీమతి జీవిత రాజశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ "అన్నం ఉడికిందా లేదా అని తెలియాలంటే ఒక్క మెతుకు చూస్తే చాలంటారు. పాటలు, ట్రైలర్ బట్టే ఈ సినిమా సక్సెస్ తెలిసిపోయింది. నృత్య దర్శకుడిగా, దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు ప్రభుదేవా. ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగులోనూ ఘన విజయం సాధించాలి. ఇక నేను ఓ సినిమా చేయబోతున్నాను. ఆ సినిమాకు మల్కాపురం శివకుమార్ పంపిణీదారుడిగా వ్యవహరించనున్నారు. ప్రయోగాత్మకంగా తెరకెక్కనున్న ఆ సినిమాను జూన్ 2న విడుదల చేయనున్నాం"అని పేర్కొన్నారు.

ఎన్.శంకర్ మాట్లాడుతూ "హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ అంశాలు మిళితమైన అందమైన చిత్రమిది. నిధి అన్వేషణ నేపథ్య కథాంశాలతో దక్షిణాదిలో వచ్చిన సినిమాలన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఈ సినిమా ఆ జాబితాలో చేరాలని కోరుకుంటున్నాను. చిన్న నిర్మాతల సినిమాల్ని విడుదల చేసి వారికి సహాయపడాలనే తపన మల్కాపురం శివకుమార్‌లో కనిపిస్తుంది. ఆయన చేసే ప్రతి సినిమా సక్సెస్ కావాలి"అని అన్నారు. దర్శకుడు కల్యాణ్ మాట్లాడుతూ తమిళ, తెలుగు నేటివిటీకి సరిపోయే కథ ఇదనీ, అందరికీ నచ్చే విధంగా సినిమా ఉంటుందని తెలిపారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ "చెన్నైలో ఐదో వారంలో ఈ సినిమా చూశాను. తమిళ భాష రాకపోయినా సాధారణ ప్రేక్షకుడిలా సినిమాను చాలా ఎంజాయ్ చేశాను. ఏప్రిల్ 6న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం"అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జానీ మాస్టర్, బీరం సుధాకర్ రెడ్డి, బీరం లోకేష్ రెడ్డి, రచ్చ రవి, జబర్దస్త్ రాము తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ మూవీలో సాయి పల్లవి



'ఫిదా' సినిమాలో భానుమతి పాత్ర ద్వారా ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న తార సాయి పల్లవి. తాను ఒకే తరహా సినిమాలకు కట్టుబడనని తన కథల ఎంపిక ద్వారా ఆమె తెలియజేస్తోంది. ప్రస్తుతం ఆమె నటించిన 'కణం' విడుదలకు సిద్ధమైంది. ప్రస్తుతం తమిళ్ స్టార్ హీరో సూర్యతో ఓ సినిమా, ధనుష్‌తో కలిసి మరో సినిమా చేస్తున్న ఆమె తెలుగులో శర్వానంద్‌తో 'పడి లేచే మనసు' చిత్రం చేస్తోంది. వీటి తర్వాత రొమాంటిక్ సినిమాలు తీస్తాడన్న పేరున్న మిస్కిన్‌తో ఓ రొమాంటిక్ హార్రర్ థ్రిల్లర్‌లో ఆమె నటించనుందనే వార్త ఇప్పుడు కోలీవుడ్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా మిస్కిన్ సినిమాలన్నీ 'ఎ' సర్టిఫికెట్ మాత్రమే తెచ్చుకుంటాయి. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమాలను ఆయన ఎప్పుడూ చేయలేదు. ఆయనకు ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉంది. ఇప్పుడు మిస్కిన్ తీయబోయే సినిమాలో సాయి పల్లవి అంటే ఖచ్చితంగా అది స్పెషల్‌గా ఉంటుందనే చెప్పుకోవాలి. పైగా దీనికి మ్యూజిక్ లెజెండ్ ఇళయరాజా సంగీతాన్ని అందించనుండడం విశేషం. సీనియర్ నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ తనయుడు శంతను హీరోగా నటించే ఈ సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో నటించేందుకు ఇప్పటికే సాయిపల్లవి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ సినిమా గురించి మరిన్ని వివరాలు త్వరలో తెలియరానున్నాయి.

పెళ్లి ఫొటోలు వచ్చేశాయ్


ఆండ్రీ కోస్చీవ్‌తో శ్రియా

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన శ్రియా వివాహం ఈనెల 12న ముంబయ్‌లోని తన ఇంట్లోనే జరిగిన విషయం తెలిసిందే. తన బాయ్‌ఫ్రెండ్ అయిన రష్యా క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆండ్రీ కోస్చీవ్‌ను ఆమె వివాహమాడింది. ఈ వేడుకలో సినిమా ఇండస్ట్రీ నుంచి మనోజ్ బాజ్‌పాయ్, షబానా అజ్మీతో పాటు ఆమె బంధువులు, స్నేహితులు కొంతమంది మాత్రమే పాల్గొన్నారు. అయితే సోమవారం రాత్రి తన బంధువులు, స్నేహితులు, సన్నిహితులకు ఉదయ్‌పూర్‌లోని ఒక హోటల్‌లో శ్రియా రిసెప్షన్ పార్టీ ఇచ్చింది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలతో పాటు పెళ్లి ఫొటోలను కూడా శ్రియా స్వయంగా అభిమానుల కోసం సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన వివాహాన్ని రహస్యంగా ఉంచిన శ్రియా ఇప్పుడు రిసెప్షన్ ఫొటోలు, పెళ్లి ఫొటోలను మాత్రం తనే విడుదల చేసింది. అయితే పెళ్లయినప్పటికీ ఈ భామ సినిమాల్లో నటిస్తుందట. 2001లో 'ఇష్టం' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రియా తెలుగు, తమిళ్‌లో పలువురు స్టార్ హీరోలతో కొన్ని సూపర్ హిట్ సినిమాలను చేసి ప్రేక్షకులను అలరించింది. ఇక శ్రియా ప్రస్తుతం వీరభోగ వసంతరాయులు, తడ్కా చిత్రాలు చేస్తోంది. కొన్ని రోజుల తర్వాత ఆమె తిరిగి సినిమా షూటింగ్‌లలో పాల్గొంటుంది.

టైటిల్ సాంగ్ హైలైట్‌గా..


శ్రీకాంత్, హేమలత

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటులు శ్రీకాంత్, నితిన్, హేమలత హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'నిన్నే చూస్తు'. సుహాసిని, సుమన్, భానుచందర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని కె.గోవర్ధన్‌రావు దర్శకత్వంలో హేమలతారెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల రెండు షెడ్యూళ్లు పూర్తిచేసుకున్న ఈ చిత్రం శరవేగంగా మూడో షెడ్యూల్‌ను జరుపుకుంటోంది. ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ను మలేషియాలోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించారు. ఈ సందర్భంగా నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ "ఇప్పటివరకు రెండు షెడ్యూళ్లు పూర్తిచేసుకున్నాము. ప్రస్తుతం మూడో షెడ్యూల్ కొనసాగుతోంది. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ అద్భుతమైన పాటలను అందించాడు. ఈ చిత్రానికి టైటిల్ సాంగ్ హైలైట్‌గా ఉంటుంది. ఈ అందమైన పాటను మలేషియాలోని అరుదైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. నృత్య దర్శకురాలు రేఖ కొరియోగ్రఫీ ఎంతో బాగుంటుంది"అని అన్నారు. సన, కాశీ విశ్వనాథ్, షాయాజీషిండే, రజిత, విద్యాలత, నిహాల్, వేణు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీః ప్రసాద్ ఈదర, మాన్ శంకర్, ఎడిటింగ్ః నాగిరెడ్డి.వి, మాటలుః కరణ్ గోపి.



చెక్‌బుక్‌లకు మార్చి 31వరకు గడువు

న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకు ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా) చెక్‌బుక్‌ల గడువును మరోసారి పెంచింది. కొత్త చెక్‌బుక్‌లను మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. గతేడాది ఎస్‌బిఐ తన ఐదు అనుబంధ బ్యాంకులతో పాటు, భారతీయ మహిళా బ్యాంకును తనలో విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే. విలీనమైన బ్యాంకుల కస్టమర్లను కొత్త చెక్‌బుక్‌లు తీసుకోవాలని, పాత చెక్‌బుక్‌లు చెల్లవని ప్రకటించింది. దీని కోసం తొలుత సెప్టెంబర్ 30 వరకు గడువు విధించగా, ఆ తర్వాత 2017 డిసెంబర్ 31 వరకు సమయం పొడిగించింది. ప్రస్తుతం విలీన బ్యాంకుల కస్టమర్లు కొత్త చెక్‌బుక్‌లను దరఖాస్తు చేసుకోవడానికి 2018 మార్చి 31 వరకు సమయమిస్తున్నట్టు బ్యాంక్ ప్రకటించింది. అప్పటి వరకు పాత చెక్‌బుక్‌లు చెల్లుతాయని, ఏప్రిల్ 1 నుంచి మాత్రం పాత చెక్ బుక్‌లు చెల్లవని ట్విట్టర్‌లో ఎస్‌బిఐ వెల్లడించింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వినియోగించుకొని కొత్త చెక్‌బుక్‌లను కస్టమర్లు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బిఐ తెలిపింది. గతేడాది ఎస్‌బిఐలో భారతీయ మహిళా బ్యాంక్‌తో సహా స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్‌జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ రాయ్‌పూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కోర్‌ను విలీనమైన విషయం తెలిసిందే.

ఐదు రోజుల నష్టాలకు బ్రేక్

❑ ఫెడ్ సమీక్షపైనే ఇన్వెస్టర్ల దృష్టి ❑ 33 వేల మార్క్ దిగువనే ముగిసిన సెన్సెక్స్



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్‌మార్కెట్ల ఐదు రోజుల వరుస నష్టాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. సూచీ స్వల్పంగా లాభాలను నమోదు చేశాయి. అయితే సెన్సెక్స్ 33 వేల మార్క్ దిగువనే ముగిసింది. రెండు రోజుల అమెరికా ఫెడరల్ రిజర్వు సమీక్షకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, టాటా గ్రూప్ స్టాక్స్ లాభపడగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వంటి షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఉదయం నుంచే నష్టాలతో మొదలైనప్పటికీ చివరికి దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 74 పాయింట్లు పెరిగి 32,997 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 30 పాయింట్లు లాభపడి 10,124 పాయింట్ల వద్ద ముగిసింది. అమెరికా, ఆసియా మార్కెట్ల పతనం, ఫెడ్ పాలసీ సమీక్ష, దేశీయంగా రాజకీయ అనిశ్చితి వంటి ప్రతికూల అంశాలు మార్కెట్లను నీరసంగా నడిపించాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్‌ఎస్‌ఇలో ఐటి సూచీ 1.5 శాతం లాభపడగా.. ఫార్మా, ఆటో, ఎఫ్‌ఎంసిజి 0.8నుంచి 0.4 శాతం మధ్య పుంజుకుంది. ప్రైవేటు బ్యాంక్స్, రియల్టీ, మెటల్ 0.4 శాతం స్థాయిలో బలహీనపడ్డాయి. బిఎస్‌ఇ మిడ్ క్యాప్ సూచీ 0.2 శాతం బలపడగా.. స్మాల్ క్యాప్ అదే స్థాయిలో డీలాపడింది. ట్రేడైన మొత్తం షేర్లలో 1,583 లాభపడితే.. 1109 షేర్లు నష్టపోయాయి. నగదు విభాగంలో సోమవారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ.292 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. దేశీ ఫండ్స్ (డిఐఐలు) రూ. 191.5 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. గత మూడు రోజుల్లో ఎఫ్‌పిఐలు రూ. 1,110 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ప్రధానంగా ఇన్‌ఫ్రాటెల్ 5.5 శాతం ర్యాలీతో రూ. 344 వద్ద ముగిసింది. టెక్ మహింద్రా 4 శాతం లాభపడి రూ.635కు చేరగా, ఇతర ఐటీ షేర్లు ఇన్ఫోసిస్, విప్రోలు 1 శాతంపైగా లాభపడ్డాయి. ఇక టాటా స్టీల్, సన్‌ఫార్మాలు 2–3 శాతం మధ్య పెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్ రంగానికి చెందిన ఐఒసి, ఒఎన్‌జిసి, బిపిసిఎల్‌లు 1 నుంచి 2 శాతం మధ్య క్షీణించాయి.

ఫెడ్ సమీక్షపైనే దృష్టి

ఇన్వెస్టర్లు తాజా ఫెడ్ సమావేశం పట్ల జాగ్రత్త వహిస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ కమిటీ రెండు రోజుల సమావేశం మంగళవారం ప్రారంభమవుతుంది. బుధవారం భారత కాలమాన ప్రకారం రాత్రి 11.30 గంటలకు ఫెడ్ నిర్ణయం వెలువడుతుంది. ఈ దఫా రేట్లను పెంచవచ్చనే అంచనాలు మార్కెట్లో వున్నాయి. ఈ ఏడాది నాలుగు దఫాలు వడ్డీ రేట్లు పెంచవచ్చని ఫెడ్ గతంలోనే సంకేతాలు ఇచ్చింది.

బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి...

స్టాక్‌మార్కెట్లో కెనరా బ్యాంక్ షేరు 3.5 శాతంపైగా పతనమైంది. ఈ షేరు విలువ రూ. 253 వద్ద ముగిసింది. రుణ మోసం కేసులో కెనరా బ్యాంక్ మాజీ ఎండి, ఇడిలపై సిబిఐ..ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందనే వార్తలు మంగళవారం బ్యాంకింగ్ షేర్లను కృంగదీశాయి. బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవగా, ఐసిఐసిఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు 0.5 నుంచి 1 శాతం మధ్య క్షీణించాయి. దీంతో బ్యాంక్ నిఫ్టీ 77 పాయింట్ల నష్టంతో 24,168 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పిఎన్‌బి, యాక్సిస్ బ్యాంక్‌లు స్వల్పలాభాలతో ముగిశాయి.

22న ఐసిఐసిఐ సెక్యూరిటీస్ ఐపిఒ



మన తెలంగాణ/హైదరాబాద్ / పంజాగుట్ట:

ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ సంస్థ రూ.4,017 కోట్లు సమీకరణ లక్ష్యంగా ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్)ను ప్రారంభించింది. ఈనెల 22న ఐపిఒకు రానుంది. మంగళవారం మీడియాతో ఆఫర్ వివరాలను సంస్థ ప్రతినిధులు కేతన్ కర్కానిస్, మహేశ్వర్‌రావులు వెల్లడించారు. పబ్లిక్ ఆఫరింగ్‌గా షేర్ ప్రీమియం(ఆఫర్)తో సహా 5 రూపాయల ముఖ విలువ కలిగిన 7,72,49,508 ఈక్విటీ షేర్లను మార్చి 22న విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు. వీటిలో 38,62,475 ఈక్విటీ షేర్లను ఐసిఐసిఐ బ్యాంక్ షేర్‌హోల్డర్లు కొనుగోలు చేసేందుకుగాను కేటాయిస్తున్నట్లు వారు తెలిపారు .ప్రతి ఈక్విటిషేర్ కు రూ .519 రూపాయల నుంచి 520 రూపాయల ప్రైస్‌బ్యాండ్‌గా స్థిరీకరించినట్లు కూడా వారు తెలిపారు.కనీసం 28 ఈక్విటీ షేర్లు బిడు దాఖలు చేసిన అనంతరం ఈక్విటీ షేర్ల మల్లిపుల్స్‌గా ఎన్నైనా కొనుగోలు చేయవచ్చని వారు తెలిపారు. ఈ ఆఫర్ కేవలం మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని కూడా వారు తెలిపారు. తమకు యువకులైన కస్టమర్లే అధికంగా ఉన్నారని వారిని ఆకర్షించేందుకుగాను టెక్నాలజీని అధికంగా వినియోగిస్తున్నట్లు ఈ సందర్భంగా కర్కానిస్ తెలిపారు.ఈ సమావేశంలో ప్రసానన్ కేశవన్ ,ధర్మేందర్ లోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32996.76	73.64	(0.22%)
నిఫ్టీ	10124.35	30.10	(0.30%)



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28980	30994.65	0.42%
ముంబై	29960	32042.78	0.57%
ఢిల్లీ	29500	31550.80	0.17%
కోల్‌కతా	29690	31754.01	0.47%
కేరళ	28150	30106.95	0.36%
బెంగళూరు	28300	30267.38	0.35%
హైదరాబాద్	28980	30994.65	0.42%
గల్ఫ్	1393.85	1490.75	0.02%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41100.00	41300.00	–0.48
ముంబై	41100.00	41300.00	–0.48
ఢిల్లీ	41100.00	41300.00	–0.48
కోల్‌కతా	41100.00	41300.00	–0.48
హైదరాబాద్	41100.00	41300.00	–0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

వాహన ధరలను పెంచిన టాటా మోటార్స్



న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచనున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల ఏప్రిల్ 1 నుంచి ఈ వాహనాలపై రూ.60 వేల వరకు పెంపు అమల్లో రానుంది. ఉత్పత్తి ఖర్చులు పెరగడం, వివిధ ఆర్థిక కారణాల వల్ల ధరల్లో మార్పులు చేయాలని నిర్ణయించామని కంపెనీ ప్రకటించింది. మారుతున్న మార్కెట్ పరిస్థితులు ధరల పెంపునకు ఒత్తిడి చేశాయని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ పరీఖ్ తెలిపారు. రూ.2.28 లక్షల ప్రారంభ ధరతో ప్యాసింజర్ కారు జెన్ ఎక్స్ నానో నుంచి రూ.17.42 లక్షల (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ) ప్రీమియం ఎస్‌యూవీ హెక్సా వాహనాలను కంపెనీ విక్రయిస్తోంది. గత వారం జర్మనీ కారు తయారీ దిగ్గజం ఆడి కార్ల ధరలను రూ.లక్ష నుంచి రూ.9 లక్షల వరకు పెంచిన విషయం తెలిసిందే.

భద్రతా కారణాల దృష్ట్యా భారత్ రాలేను

సిబిఐకి మోహుల్ చోక్సీ లేఖ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో రూ.13వేల కోట్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న గీతాంజలి గ్రూప్ యజమాని మెహుల్ ఛోక్సీ విచారణ నిమిత్తం భారత్‌కు రాలేనని అన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సిబిఐ విచారణకు తాను భారత్‌కు తిరిగి రాలేనని అన్నారు. గతంలో సిబిఐ విచారణను ఆయన ఇలాగే నిరాకరించారు. తాజాగా సిబిఐ ఆయన్ను విచారణకు హాజరుకావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. దీనిపై స్పందిస్తూ ఆయన సిబిఐకి మరోసారి లేఖ రాశారు. భద్రతా కారణాల వల్ల తాను రాలేనని, తన పాస్‌పోర్ట్ రద్దు చేశారని అన్నారు. కేసు కారణంగా భారత్‌లో తన సంస్థ వ్యాపారాలు మూతపడ్డాయని, దీని వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నానని అన్నారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా భారత్‌కు ప్రయాణం చేయలేనని, ఆరోపణలు తనను మరింత భయానికి గురిచేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యలు అసంబద్ధంగా ఉన్నాయని ఛోక్సీ ఆరోపించారు.

24% పెరిగిన విమాన ట్రాఫిక్



న్యూఢిల్లీ: దేశీయ విమానాల ట్రాఫిక్ ఫిబ్రవరి నెలలో పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఫిబ్రవరిలో 24 శాతం విమాన ప్రయాణికులు పెరిగారని సోమవారం ఏవియేషన్ రెగ్యులేటరీ వెల్లడించింది. గత నెలలో దేశీయ విమాన సంస్థలు దాదాపు 1.07 కోట్ల ప్రయాణికులను గమ్యాలకు చేరవేశాయి. 2017 ఫిబ్రవరిలో 86 లక్షల మంది మాత్రమే ప్రయాణించారని గణాంకాలు వెల్లడించాయి. అయితే ఇండిగో, గో ఎయిర్ లాంటి విమాన యాన సంస్థలకు చెందిన విమానాలపై నిషేధం ఉన్నప్పటికీ దేశీయ పాసింజర్ ఎయిర్ ట్రాఫిక్ పెరుగుదలను నమోదు చేయడం విశేషం. డిజిసిఎ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) ప్రకారం, ఫిబ్రవరిలో విమాన ప్రయాణికుల సంఖ్య 24 శాతం పెరిగింది. మొత్తం దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ జనవరి నెలలో 1.14 కోట్లతో పోల్చినా ఫిబ్రవరిలో మెరుగైంది. గతేడాది జనవరి నుంచి ఫిబ్రవరి వరకు ప్రయాణీకుల రద్దీ 21.80 శాతం పెరిగింది. 2017 నాటికి 86.55 లక్షల నుంచి పెరిగినట్లు సోమవారం వెల్లడించిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. దీంతో విమానయాన కంపెనీల కౌంటర్లు వెలుగులోకి వచ్చాయి. జెట్ ఎయిర్‌వేస్ 2 శాతం, స్పైస్‌జెట్ 1.2 శాతం, ఇంటర్‌గ్లోబ్(ఇండిగో) 0.75 శాతం లాభపడ్డాయి.


స్వల్పంగా పెరిగిన పసిడి



న్యూఢిల్లీ: బంగారం డిమాండ్ ఊపందుకోవడంతో ధర స్వల్పంగా పెరిగింది. మంగళవారం పది గ్రాముల పసిడి ధర రూ.210 పెరిగి రూ.31,390 కి చేరింది. దేశీయంగా నగల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడం, అంతర్జాతీయ పరిణామాలతో పసిడి ధర పుంజుకుందని బులియన్ మార్కెట్ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా మాత్రం బంగారం ధర 0.22శాతం తగ్గి 1,313.70 డాలర్లుగా ఉంది.ఇక వెండి ధర కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండి ధర రూ.200లు పెరిగి రూ.39,000 మార్క్‌ను చేరుకుంది. ప్రస్తుతం కిలో వెండి రూ.39,150గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు.

టాప్ 10లో మహీంద్రా బొలెరోకు స్థానం

- పదింటిలో ఆరు స్థానాలను దక్కించుకున్న మారుతీ సుజుకీ
- 19,524 యూనిట్ల సేల్స్‌తో మొదటి స్థానంలో ఆల్టో
- ఫిబ్రవరి మాసం గణాంకాలను ప్రకటించిన సియామ్



న్యూఢిల్లీ: ఫిబ్రవరి మాసంలో టాప్ 10 ఉత్తమ విక్రయ ప్యాసింజర్ వాహనాల్లో(పివి) మహీంద్రా అండ్ మహీంద్రా యుటిలిటీ వెహికిల్ బొలెరో స్థానం దక్కించుకుంది. ఫిబ్రవరిలో 10 స్లాట్స్‌లో మారుతీ సుజుకీ ఇండియా ఆరు స్థానాలను పొందింది. రెండేళ్లలో తొలిసారిగా బొలెరో టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ మోడల్ గత నెలలో దాదాపు 8,001 యూనిట్ల సేల్స్‌తో పదో స్థానాన్ని సరిపెట్టుకుంది. గత ఏడాది ఫిబ్రవరిలో బొలెరో వాహనం 6,442 యూనిట్లు సేల్ అయింది. ఈమేరకు సియామ్(సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మానుఫ్యాక్చరర్స్) ఫిబ్రవరి నెల గణాంకాలను విడుదల చేసింది. 2016 సంవత్సరంలో ఇదే మాసంలో బొలెరో తొమ్మిదో బెస్ సెల్లింగ్ పివి మోడల్‌గా నిలిచింది. సియామ్ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నంబర్ వన్ స్థానంలో మారుతీ సుజుకీ ఇండియాకు చెందిన ఆల్టో మోడల్ నిలిచింది. గతేడాది ఇదే మాసంలో ఆల్టో విక్రయాలు 19,524 యూనిట్లుగా ఉన్నాయి. ఇదే కంపెనీకి చెందిన కాంపాక్ట్ సెడాన్ డిజైర్ రెండో స్థానంలో 17,784 యూనిట్ల సేల్స్ నమోదు చేసింది. గత ఏడాది ఇదే సమయంలో డిజైర్ విక్రయాలు 16,613 యూనిట్లుగా ఉన్నాయి. 17,291 యూనిట్లతో కొత్త స్విఫ్ట్ మూడో స్థానంలో ఉంది. ఫిబ్రవరి నెలలో ఈ మోడల్ ఐదో స్థానంలో 12,862 యూనిట్ల సేల్స్‌ను నమోదు చేసింది. అలాగే ఫిబ్రవరి మాసంలో మారుతీ సుజుకీకి చెందిన హాచ్‌బ్యాక్ బాలెనో 15,807 యూనిట్లతో నాలుగు స్థానంలో ఉండగా.. గతేడాది ఇదే సమయంలో 7,658 యూనిట్ల విక్రయాలను నమోదు చేసింది. ఇక 14,029 యూనిట్ల సేల్స్‌తో వాగనర్ ఆర్ ఐదో స్థానంలో ఉంది. ఈ కారు గతేడాది ఇదే సమయంలో 13,555 యూనిట్లతో మూడో స్థానంలో నిలిచింది. హుందయ్‌కు చెందిన ఎలైట్ ఐ20 మోడల్ 13,378 యూనిట్లతో ఆరో స్థానంలో నిలిచింది. మరో వైపు మారుతీ సుజుకీ కాంపాక్ట్ ఎస్‌యువి విటారా బ్రెజ్జా ఏడో స్థానం పొందగా.. ఇది 11,620 యూనిట్ల సేల్స్‌ను నమోదు చేసింది. హుందయ్‌కు చెందిన మరో మోడల్ గ్రాండ్ ఐ10 ఎనిమిదో స్థానంలో(10,198 యూనిట్ల సేల్స్) ఉండగా.. ఎస్‌యువి క్రెటా 9,278 యూనిట్లతో జాబితాలో తొమ్మిదో స్థానం దక్కించుకుంది. మారుతీ సెలెరియో, రెనాల్ట్ క్విడ్ టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకోలేకపోయాయి. అయితే 2017 ఫిబ్రవరిలో ఇవి టాప్ 10లో ఉన్నాయి.

టాప్ 10 జాబితా

	మోడల్స్	ఫిబ్రవరి (2018)
1	మారుతీ ఆల్టో	19,760
2	మారుతీ డిజైర్	17,784
3	మారుతీ స్విఫ్ట్	17,291
4	మారుతీ బాలెనో	15,807
5	మారుతీ వ్యాగనర్	14,029
6	హుందాయ్ ఎలైట్ ఐ20	13,378
7	మారుతీ విటారా బ్రెజ్జా	11,620
8	హుందాయ్ గ్రాండ్ ఐ10	10,198
9	హుందాయ్ క్రెటా	9,278
10	మహీంద్రా బొలెరో	8,001

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
రిలయన్స్ ఇన్ఫ్రా	457.00	421.30	453.35	424.30	29.05	6.85
మారికో	320.00	303.35	318.45	301.90	16.55	5.48
సెయిల్	72.25	67.85	72.05	68.85	3.20	4.65
భారతీ ఇన్‌ఫ్రాటెల్	343.50	323.80	341.65	327.30	14.35	4.38
టెక్ మహీంద్రా	634.00	603.00	632.40	609.25	23.15	3.80
టాటా స్టీల్	601.20	568.55	593.30	575.05	18.25	3.17
ఐచర్ మోటార్స్	28,341.30	27,337.95	28,286.40	27,421.25	865.15	3.16
శ్రీ సిమెంట్స్	16,506.40	16,030.00	16,416.50	16,008.05	408.45	2.55
నెస్ట్‌లే	7,879.00	7,694.50	7,841.05	7,664.40	176.65	2.30
బజాజ్ ఫిన్ సర్వ్	5,081.35	4,965.00	5,066.70	4,955.50	111.20	2.24

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
కెనరా బ్యాంక్	258.75	250.00	254.15	264.30	10.15	3.84
ఐఒసి	178.00	172.90	173.70	177.80	4.10	2.31
శ్రీరామ్ ట్రాన్స్	1,400.50	1,367.10	1,377.60	1,405.20	27.60	1.96
ఒఎన్‌జిసి	178.00	173.65	174.10	176.60	2.50	1.42
అపోలో హాస్పిటల్స్	1,057.00	1,040.00	1,043.30	1,057.95	14.65	1.38
హెవెల్స్ ఇండియా	502.30	495.20	498.35	505.20	6.85	1.36
సిప్లా	559.50	523.00	552.50	559.35	6.85	1.22
ఐసిఐసిఐ బ్యాంక్	297.00	290.35	291.75	295.00	3.25	1.10
సుమ్మిన్స్	759.50	740.00	747.30	755.50	8.20	1.09
గెయిల్	450.00	436.50	437.75	442.20	4.45	1.01

నా వెనుక బిజెపి కాదు.. దేవుడున్నాడు : రజినీకాంత్



చెన్నై : తాను పెట్టబోయే పార్టీ వెనుక బిజెపి ఉందంటూ వస్తున్న విమర్శలను సూపర్‌స్టార్ రజనీకాంత్ ఖండించారు. హిమాలయాల పర్యటన ముగించుకుని మంగళవారం ఇక్కడికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'నా వెనక బిజెపి ఉందని కొందరు అంటున్నారు. కానీ నా వెనక ఉన్నది ఒక్క దేవుడు మాత్రమే. ఆ తర్వాత ప్రజలు. నా రాజకీయ ప్రయాణం విషయంలో మీరు ఎన్ని ప్రశ్నలు సంధించినా నా సమాధానం ఇదొక్కటే' అని వ్యాఖ్యానించారు. పెరియార్ విగ్రహ విధ్వంసాన్ని ఖండిస్తున్నానని, ఇలాంటి అనాగరిక ఘటన జరగకుండా ఉండాల్సిందన్నారు. రజనీకాంత్ చెన్నై రాబోతున్నారన్న నేపథ్యంలో ట్విటర్‌లో 'వెల్‌కం బ్యాక్ పీపుల్స్ సిఎం రజనీ' అన్న హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉండటం గమనార్హం. పర్యటన ముగిసిన సందర్భంగా రజనీ ఎప్పుడెప్పుడు పార్టీ వివరాలు ప్రకటిస్తారా? అని అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. చెన్నై నూతన సంవత్సరం సందర్భంగా ఏప్రిల్14న పార్టీ వివరాలు ప్రకటించే అవకాశం ఉందని వార్తలు వెలువడుతున్నాయి.

చర్చకు రాని అవిశ్వాసం

పార్లమెంట్‌లో కొనసాగుతున్న విపక్షాల ఆందోళన



మన తెలంగాణ/న్యూఢిల్లీ: అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగకుండానే మంగళవారం కూడా లోక్‌సభ వాయిదా పడింది. అదే రభస.. అదే తీరు.. మళ్లీ అదే నిర్ణయం! ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన పోరాటంలో భాగంగా కేంద్ర సర్కారుపై వైఎస్సార్, టిడిపి పార్టీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించకుండానే లోక్‌సభ మరోసారి బుధవారానికి వాయిదా పడింది. మంగళవారం కూడా లోక్‌సభలో నిరసనలు చోటుచేసుకోవడంతో.. సభ ఆర్డర్‌లో లేదన్న కారణంగా స్పీకర్ సుమిత్రా మహాజన్ 'అవిశ్వాసం'చర్చను చేపట్టలేకపోయారు. విపక్షాల ఆందోళనల మధ్యే విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్.. ఇరాక్‌లో భారత బందీల మరణానికి సంబంధించిన ప్రకటన చేశారు. అనంతరం స్పీకర్ సభను బుధవారానికి వాయిదావేశారు.లోక్‌సభలో సోమవారం నాటి పరిస్థితులే మళ్లీ పునరావృతమయ్యాయి. మంగళవారం ఉదయం ప్రారంభమైన కొన్ని క్షణాలకే సభ మధ్యాహ్నం 12గంటలకు వాయిదా పడింది. మంగళవారం ఉదయం సభ మొదలైన వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టేందుకు స్పీకర్ ప్రయత్నించగా అన్నాడిఎంకె, టిఆర్‌ఎస్ సభ్యులు ఆందోళనలు మొదలుపెట్టారు. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలంటూ అన్నాడిఎంకె, రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలంటూ టిఆర్‌ఎస్ ఎంపిలు వెల్‌లోకి దూసుకువచ్చి నినాదాలు చేశారు. కాగా సభలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో అవిశ్వాస తీర్మానం నోటీసుపై మంగళవారం అయినా చర్చ జరుగుతుందా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. వాయిదా తర్వాత మధ్యాహ్నం 12గంటలకు మొదలైన సభలో సభ్యుల నిరసనల మధ్య పలు పార్టీలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. ఆపై ఇరాక్‌లో నాలుగేళ్ల క్రితం కిడ్నాపైన 39 మంది భారతీయ కార్మికులను ఐఎస్ పొట్టనపెట్టుకోవడంపై కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటన చేయనున్నారని, సభ్యులు ఆందోళన విరమించాల్సిందిగా స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ గందరగోళ పరిస్థితిలో చెప్పాల్సి విషయం కాదని, సభ్యులంతా తమ నిరసనను విరమించి శాంతియుతంగా ఉండాల్సిందిగా సుష్మాస్వరాజ్ విన్నవించారు. ఈ అంశంపై చాలాసార్లు సభలో చర్చ జరిగిందని, అయితే సరైన సాక్ష్యాలు లేనిదే తాను ఎలాంటి ప్రకటన చేయనని చెప్పానన్నారు. ప్రస్తుతం అన్ని సాక్ష్యాలతో తాను సభకు వచ్చానని... ఇరాక్‌లో భారతీయులపై ఐఎస్ ఉగ్రవాదులు చేసిన దారుణంపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని.. సభ్యులు తమ నిరసనను విరమించాల్సిందిగా కోరారు. మరోవైపు వైఎస్సార్ పార్టీ, టిడిపి ఎంపిలు సుబ్బారెడ్డి, తోట నరసింహం ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు అందాయని, సభ సజావుగా లేనందున నోటీసులపై చర్చ జరపలేమంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేశారు. లోక్‌సభ ప్రారంభం కావడానికి ముందు మంగళవారం ఉదయం స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను ఆమె కార్యాలయంలో కలిసిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చూడాలని వైఎస్సార్ పార్టీ ఎంపిలు విజ్ఞప్తి చేశారు. అనంతరం వైఎస్సార్ పార్టీ ఎంపి వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హోదాపై చర్చ జరిగే వరకు వదిలిపెట్టమని స్పష్టం చేశారు. సభలో చర్చ జరిగి, రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు నోటీసులు ఇస్తూనే ఉంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు జరుగుతున్న ఆందోళనలను మోడీ సర్కారు పట్టించుకోవడం లేదని రాజ్యసభలో కాంగ్రెస్ పక్షనేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. రాజ్యసభలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... పది పార్టీలు ఒకే అంశంపై పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీ అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో తక్షణం చర్చ చేపట్టి ఎపికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆజాద్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ.. తమను ప్రశ్నించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని ఎదురుదాడి చేశారు. ప్రత్యేక హోదా అంశాన్ని విభజన చట్టంలో పెట్టకుండా ఇప్పుడు తమను అడుగుతారా అని ప్రశ్నించారు. కాగా, ప్రత్యేక హోదా అంశంపై విపక్షాలు ఆందోళనకు దిగడంతో రాజ్యసభ కూడా బుధవారానికి వాయిదా పడింది. ఎపికి ప్రత్యేక హోదా కోరుతూ పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం ఎదుట టిడిపి ఎంపిల నిరసన కొనసాగుతోంది.

రిజర్వేషన్లపై పట్టువీడని టిఆర్‌ఎస్



మన తెలంగాణ/న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో మంగళవారం నాడు టిఆర్‌ఎస్ ఎంపిలు ఆందోళన నిర్వహించారు. రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఇవ్వాలంటూ డిమాం డ్ చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకే దేశం, ఒకే చట్టం ఉండాలని డిమాండ్ చేశా రు. బడ్జెట్ సమావేశాలు మొదలైన క్షణం నుంచి టీఆర్‌ఎస్ ఎంపిలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నా రు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఏ అంశాన్నైనా సభలో తేల్చుకుంటామని వారు తెలిపారు. అనంతరం ఎంపి వినోద్ మాట్లాడుతూ...పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం నుంచి నేటి వరకు తెలంగాణ లో వెనకబడిన వారికోసం రిజర్వేషన్ల అంశంపై పోరాడుతు న్నాం ఉన్నామని, టిడిపి వైసిపిల అవిశ్వాస తీర్మానాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నం కాదని స్పష్టం చేశారు. అవిశ్వాసం అనేది నిన్నకాక మొన్న వచ్చిందని, ముందు మా సమస్య పరిష్కరించాక ఏదైనా చర్చ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అవిశ్వాసంపై మద్ద తు లెక్కించేందుకు మా ఆందోళన ఎంత మాత్రం అడ్డుకాదని అన్నారు.ఈ విషయం పై కొంతమంది కావాలని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.స్పీకర్ చైర్ సభ్య ల కంటే ఎత్తులో ఉంటుంది, స్పీకర్ తలుచుకుంటే అవిశ్వాసానికి సభ్యుల లెక్కింపు పెద్ద కష్టం కాదని అన్నారు. మా ఆందోళన నడుమ ఆర్థిక బిల్లు ను ఆమోదించుకున్నారు కదా అప్పుడు ఏమైందని ప్రశ్నించారు. అవిశ్వాసం చర్చకు వస్తే మేము మాకు రావాల్సిన అన్ని అంశాలను లేవనెత్తుతామని ఎంపి వినోద్ తెలిపారు. తెలుగు ప్రజలకు ఉపయోగపడేలా సూచనలు కూడా చేస్తామని అన్నారు. టిడిపి, వైఎస్సార్ పార్టీ లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై టిఆర్‌ఎస్ పార్టీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... అవిశ్వాస తీర్మానం పిల్లలాట కాదన్నారు. పక్కింట్లో పెళ్లి అయితే మా ఇంట్లో రంగులు వేసుకోవాల్సిన అవసరంలేదు... అని పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత కెసిఆర్ నిర్ణయం మేరకు రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో పోరాడతామన్నారు. ప్రజల ఎజెండాతోనే టి ఆర్‌ఎస్ ముందుకెళ్తుందన్నారు. అవిశ్వాస తీర్మానం రాజకీయ స్వార్థంలో భాగమేనని దుయ్యబట్టారు.

శశికళ భర్త నటరాజన్ మృతి



చెన్నై/బెంగళూర్ : జైలు జీవితం గడుపుతున్న ఎఐఎడిఎంకె నేత వికె శశికళ భర్త ఎం. నగరాజన్ చెన్నైలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. 74 ఏళ్ల నటరాజన్ ఛాతి ఇన్‌ఫెక్షన్‌తో శనివారం ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. మరుతప్ప నటరాజన్ మంగళవారం ఉదయం 1.35 గంటలకు మృతి చెందినట్లు తాము బాధాతప్త హృదయంతో ప్రకటిస్తున్నట్లు గ్లినీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ షణ్ముగ ప్రియాన్ తెలిపారు. ఆయన ప్రాణాలను కాపాడేందుకు తాము శాయాశక్తులా ప్రయత్నించామని, అయినప్పటికీ ఫలితం దక్కలేదని ప్రియన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, నటరాజన్ మృతదేహాన్ని చెన్నైలోని బిసెంట్ నగర్ నివాసానికి తరలించారు. రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు ఆయన మృతదేహం వద్ద నివాళి అర్పించారు. డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకె స్టాలిన్, ద్రవిదార్ కజ్గాం అధ్యక్షుడు కె. వీరమణి, గేయ రచయిత వైరముత్తులు నటరాజన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు. నటరాజన్ తమిళభాష పట్ల చూపించిన ప్రేమ, ద్రవిడియన్ల ఉద్యమానికి అంకితం కావడాన్ని స్టాలిన్ ప్రశంసించారు. ఆయన మృతి రాష్ట్రానికి తీరని నష్టం, డిఎంకె చీఫ్ ఎం. కరుణానిధి తరుపున ఆయన నటరాజన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నానన్నారు. ఎండిఎంకె వ్యవస్థాకుడు వైకో కూడా నటరాజన్ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా, అంత్యక్రియల నిమిత్తం నటరాజన్ మృతదేహాన్ని తంజావూర్ జిల్లాలోని ఆయన స్వగ్రామానికి తరలించనున్నారు.

శశికళకు 15 రోజుల పెరోల్ మంజూరు

జైలు జీవితం గడుపుతున్న వికె శశికళ భర్త నటరాజన్ మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు గానూ ఆమెకు 15 రోజుల పెరోల్‌ను జైలు అధికారులు మంజూరు చేశారు. అయితే శశికళకు షరతులతో కూడిన పెరోల్‌ను మంజూరు చేసినట్లు పరప్పణ అగ్రహార కేంద్ర కారాగార సూపరింటెండెంట్ సోమశేఖర్ మీడియాకు వెల్లడించారు. ఈ 15 రోజుల్లో శశికళ బహిరంగ సమావేశాల్లో పాల్గొనకూడదని, రాజకీయ కార్యక్రమానికి హాజరు కాకూడదని ఆయన చెప్పారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద తక్షణ అరెస్టులు వద్దు

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ : ఎస్‌సి, ఎస్‌టి(అత్యాచార నిరోధక)చట్టం కింద ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులు నమోదు అయినప్పటికీ వారిని వెంటనే అరెస్ట్ చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాంటి ఫిర్యాదులపై డిఎస్‌పి స్థాయికి తక్కువ కాని అధికారి చేత ప్రాథమిక దర్యాప్తు జరిపించడం తప్పనిసరి అని సూచించింది. ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం తరచూ దుర్వినిగం కా వడాన్ని గమనించిన సుప్రీంకోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక విచారణ అనంతరమే అధికారులపై చర్యలకు దిగాలని స్పష్టం చేసింది.ఈ చట్టం కింద కేసు నమోదైన ప్రభుత్వ ఉద్యోగులకు ముందస్తు బెయిల్ ఇవ్వకుండా అడ్డుకునేలా నిబంధనలు లేవని, వారికి బెయిల్ ఇవ్వొచ్చని జస్టిస్ ఆదర్శ్ గోయల్, జస్టిస్ యు.యు లలిత్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అమాయకులను వేధించడం, హింసించడం రాజ్యాంగం ఇచ్చిన హామీకి విరుద్ధమని తెలిపింది. అమాయకుల కులం, మతం ఏదైనప్పటికీ ఈ రాజ్యాంగ హామీని అమలు చేయవలసిన బాధ్యత సుప్రీంకోర్టుకు ఉందని పేర్కొంది. చట్టం వల్ల కుల విద్వేషం ఏర్పడకూడదని తెలిపింది. ఎస్, ఎస్‌టి చట్టం ప్రకారం ఫిర్యాదు దాఖలైనపుడు ఆటోమేటిక్‌గా ఎఫ్‌ఐఆర్ నమోదు, అరెస్టు జరగడాన్ని తోసిపుచ్చింది.

ఉద్యోగార్థుల నిరసన ఉద్రిక్తం

11 మంది కానిస్టేబుళ్లకు గాయాలు

ముంబయిలో ఘటన



ముంబయి : భారతీయ రైల్వేలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిర్వహించిన ఉద్యమం ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులు రాళ్లు రువ్వడంతో ప్రభుత్వ రైల్వే పోలీసు (జిఆర్‌పి), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్)లకు చెందిన 11 మంది కానిస్టేబుళ్లు గాయపడ్డారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థులు భారతీయ రైల్వేలో అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసుకున్నారు. అయితే వీరంతా తమకు రైల్వేలో శాశ్వత ఉద్యోగాలు కావాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళనకు దిగారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో దాదర్‌లో పని చేస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు గాయపడిన వారిలో ఉన్నారని చెప్పారు. కాగా, మరో ఆరుగురు ఆర్‌పిఎఫ్ కానిస్టేబుళ్లకు కూడా గాయపడ్డారని అన్నారు. రాళ్లు రువ్విన ఘటనపై దాదర్‌లోని జిఆర్‌పిలో 800 నుంచి వెయ్యి మందిపై ఐపిసి కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసు డిప్యూటీ కమిషనర్ సమధాన్ పవార్ తెలిపారు. కేసు విచారణ జరుగుతోందని వెల్లడించా రు.

జెఎన్‌యు ప్రొఫెసర్ అరెస్ట్



న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలపై జెఎన్‌యూ ప్రొఫెసర్ అరెస్టు చేయాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో పోలీసులు మంగళవారం ప్రొఫెసర్ అతుల్ జోహ్రీని అరె స్టు చేశారు. అనంతరం ఆయనను ఢిల్లీ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. అతుల్ జోహ్రిని తక్షణం అరెస్టు చేయాలంటూ విద్యార్థులు, ప్రొఫెసర్లు, మహిళా హక్కుల సంస్థలు మంగళవారం ప్రదర్శనలు నిర్వహించాయి. అనంతరం విద్యార్థులు వసంత్ కుంజ్ పోలీసు స్టేషన్ బయట భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రొఫెసర్ అతుల్ జోహ్రిపై నలుగురు విద్యార్థినులు ఫిర్యాదు చేసినప్పటికీ ఒక ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) వైస్ ప్రెసిడెంట్ జోయా ఖాన్ తెలిపారు. కాగా, సిఆర్‌పిసి 164 సెక్షన్ కింద నలుగురు బాధిత విద్యార్థినుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నామని, ఇంతవరకూ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేశామని డిసిపి తెలిపారు. అవసరమైతే మరిన్ని సెక్షన్లు కూడా చేరుస్తామన్నారు. ఈ కేసులో విచారణ జరుగుతోందని చెప్పారు.

పెరియార్ మరో విగ్రహం ధ్వంసం



పుదుకొట్టయ్ : తమిళనాడులో తాజాగా మంగళవారం మరో విగ్రహం కూల్చివేతకు గురైంది. సామాజిక సంస్కర్త, ద్రవిడ ఉద్యమ నేత, పెరియార్‌గా ప్రసిద్ధిగాంచిన ఇవి రామస్వామి విగ్రహాన్ని పుదుకొట్టయ్‌లోని ఓ గ్రామంలో కూల్చివేశారు. ఇటీవల వరుసగా విగ్రహాల కూల్చివేత ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. కాగా, గుర్తుతెలియని కొందరు వ్యక్తులు పెరియార్ విగ్రహ తలను చెక్కేసి సమీప ప్రాంతంలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. ఉదయం 8 గంటలలోగా విగ్రహానికి మరమ్మతులు నిర్వహించి యథావిధంగా పునరుద్ధరించినట్లు పోలీసులు తెలిపారు. దుండగులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసులను పెద్ద ఎత్తున మోహరింపజేశారు. ఈనెల 6న వెల్లూర్ జిల్లాలో పెరియార్ విగ్రహాన్ని కూల్చి ఘటనలో ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, త్రిపురలో లెనిన్ విగ్రహాల ధ్వంసాన్ని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రోత్సహించాయని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఆరోపించారు. తమ సిద్ధాంతాలతో విభేదించే వారి విగ్రహాలను ధ్వంసం చేయాలని వారు తమ శ్రేణులకు సంకేతాలు పంపారన్నారు. దళితుల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త పెరియార్ విగ్రహాన్నీ ఇవాళ తమిళనాడులో ధ్వంసం చేశారని రాహుల్ ట్వీట్ చేశారు.

ఇద్దరిని హతమార్చిన నక్సలైట్లు

రాయిపూర్ : చత్తీస్‌ఘడ్‌లోని కొండగావ్ జిల్లాలో ఇద్దరు గ్రామస్తులను నక్సలైట్లు హత్య చేశారు. ఈ ఘటన బయనార్ పోలీసుస్టేషన్ పరిధిలోని అద్నార్ జిల్లాలోని సోమవారం రాత్రి జరిగిందని అదనపు పోలీసు సూపరింటెండెంట్ మహేశ్వర్ నాగ్ తెలిపారు. పారా మిలటరీ అందించిన వివరాల మేరకు..సాయుధులైన కొందరు నక్సలైట్లు గ్రామంలోకి ప్రవేశించి, ఇద్దరు గ్రామస్తులను హత్య చేశారు. సమాచారం తెలియగానే మంగళవారం ఉదయం పోలీసు బృందం ఘటనాస్థలికి చేరుకుందని, వివరాలు సేకరిస్తున్నదని ఆయన వెల్లడించారు.

నలుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లోని కుప్వార జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు గుర్తు తెలియని మిలిటెంట్లు చనిపోయారు. 'కుప్వార జిల్లాలో నిర్వహించిన ఆరంపొర ఆపరేషన్‌లో నలుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. పోలీసు గాలింపులు కొనసాగుతున్నాయి' అని రక్షణ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ఆరంపొర ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా తారసపడిన ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురు కాల్పులకు దిగగా నలుగురు నలుగురు గుర్తు తెలియని మిలిటెంట్లు చనిపోయారు.

ఎన్‌డిఎ కష్టాల్లో లేదు : పాశ్వాన్



న్యూఢిల్లీ : బిజెపితో భాగస్వామ్యాన్ని వీడే ఆలోచన లేదని, వారిలో కలిసివుండడంలో తమకు ఎలాంటి ఒత్తిళ్లు లేవని కేంద్ర మంత్రి రాం విలాస్ పాశ్వాన్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల అనంతరం మళ్లీ నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన బీహార్‌పై తాజాగా చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకున్నారు. అక్కడ కొందరు బిజెపి నాయకులు చేసిన మతపరమైన ప్రకటనలు నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను పార్టీ సమాన దృష్టితో చూడాలని సూచించారు. 'ఎన్‌డిఎ ఇప్పుడు ఏ విధమైన కష్టాల్లో లేదు. 2019 ఎన్నికల్లో ప్రధాన మంత్రి పదవి ఖాళీ లేదని నేను ఇంతకు ముందే చెప్పాను. నరేంద్ర మోడీ మళ్లీ ప్రధాన మంత్రి అవుతారు. ఎన్‌డిఎ చెక్కు చెదరకుండా ఉంటుంది' అని లోక్‌జనశక్తి పార్టీ (ఎల్‌జెపి) అధ్యక్షుడు కూడా అయిన రాం విలాస్ పాశ్వాన్ మంగళవారం ఇక్కడ తనను కలిసిన విలేకరులతో అన్నారు.

ఒడిశాలో కూలిన హక్ ఎయిర్‌క్రాఫ్ట్

బరిపడా : భారత వైమానిక దళానికి చెందిన హక్ విమానం మంగళవారం కూలిపోయింది. రోజువారి శిక్షణలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని కలాయ్‌కుందా ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరిన విమానం ఒడిశాలోని మయూర్‌భాంజ్ జిల్లాలో కుప్పకూలింది. ఈ ఘటన నుంచి పైలట్ సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు తెలిపారు. సబర్నరేఖా నది ఒడ్డున విమానం కూలిన వెంటనే మంటలు అంటుకున్నట్లు ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారని, అనంతరం ఘటనాస్థలిలో విమానం శిథిలాలు చెల్లాచెదురుగా పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే విమానం కుప్పకూలడానికి ముందే పైలట్ సురక్షితంగా బయట పడ్డారన్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బృందం ప్రమాదస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కలైయ్‌కుందా ఎయిర్‌బేస్ నుంచి కూడా ప్రత్యేక హెలికాప్టర్‌లో సహాయక బృందం అక్కడికి చేరుకొని పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు జర్పోఖారియా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సరట్ కుమార్ మాహాలిక్ వివరించారు. అదే హెలికాప్టర్‌లో శిక్షణలో ఉన్న పైలట్‌ను వెనక్కి పంపామన్నారు.

వచ్చే వారంలో ఢిల్లీకి మమత

కోల్‌కతా : వచ్చే వారంలో ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ నేతృత్వంలో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరు కానున్నట్లు తృణమూల్ కాంగ్రెస్‌లోని అత్యున్నత వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 26 నుంచి మమత నాలుగు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించేందుకు వచ్చే వారం ఆమె ఢిల్లీకి వెళ్తున్నారని, ఈ నేపథ్యంలోనే బిజెపికి వ్యతిరేకంగా వ్యవహరించే ప్రతిపక్ష కూటమికి మద్దతు తెలపనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం మమత శరద్‌పవార్ నేతృత్వంలో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి హాజరువుతారని, అదే విధంగా వివిధ పార్టీల నాయకులతో కూడా ఆమె భేటీ అయ్యే అవకాశముందని టిఎంసి వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో కూడా సమావేశమయ్యేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నాయి. సమావేశ సమయంపై తమ పార్టీ నేతలు కాంగ్రెస్ అధినాయకత్వంతో టచ్‌లో ఉన్నారని, అయితే ఇంకా అది తుదిరూపుకు రాలేదని టిఎంసి నాయకుడొకరు చెప్పారు. ఇదిలా ఉండగా, వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలతో పవార్ సమావేశం కానున్నారు.

ఏడాదిలో 30 రక్షిత నీటి కేంద్రాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు, భూగర్భ జలాల కలుషిత జిల్లాల్లో ఏడాదిలో 30 రక్షిత తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సేఫ్ వాటర్ నెట్ వర్క్, హనీవెల్ ఇండియా సంయుక్తంగా ప్రకటించాయి. రాష్ట్రంలో హనీవెల్ అనే సంస్థ నిధులతో ఏర్పాటైన రక్షిత నీటి కేంద్రాల (ఐ జల్) సంఖ్య వందకు చేరింది. ఈ కేంద్రాలతో 3 లక్షల 30 వేల మంది రక్షిత త్రాగునీటిని పొందే అవకాశం లభించిందని సేఫ్ వాటర్ నెట్ వర్క్ సిఈవో కుర్ట్ సోదర్ లుండ్ తెలిపారు.

అసెంబ్లీలో 3 బిల్లుల ప్రవేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం మూడు బిల్లులను శాసనసభలో బుధవారం ప్రవేశ పెట్టింది. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం సవరణ బిల్లును మంత్రి టి. హరీశ్‌రావు, తెలంగాణ మెడికల్ ప్రాక్టీషినర్స్ రిజిస్ట్రేషన్ బిల్ –2018ను వైద్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి, తెలంగాణ న్యాయవాదులు, క్లర్కుల సంక్షేమ నిధి బిల్లును మంత్రి హరీష్ రావు అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు.



వరల్డ్ ఓరల్ హెల్త్‌డేను పురస్కరించుకొని హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని శారదా విద్యానికేతన్ హైస్కూల్‌లో డెంటల్ క్యాంపు నిర్వహించిన దృశ్యం



లింగాయత్‌లకు మతం ట్యాగ్ : కర్నాటక ప్రభుత్వంపై రిటైర్డ్ జడ్జి హెగ్డే ధ్వజం

బెంగళూరు: లింగాయత్, వీరశైవులను మతపరమైన మైనార్టీలుగా గుర్తించేందుకు కేంద్రానికి సిఫార్సు చేయాలనే కర్నాటక ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సంతోష్ హెగ్డే తీవ్రంగా విమర్శించారు. ఒక సామాజిక వర్గాన్ని మతంగా గుర్తించడం ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ హెగ్డే రాసిన వ్యాసం సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాను రాజకీత్తను కానని, వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి కూడా తనకు లేదని పేర్కొన్న హెగ్డే, సాధారణ ప్రజలను విభజించడం ఎప్పుడు మానుకుంటారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. వెనుక బడిన తరగతులుగా దిగంబరులు, శ్వేతంబరులను వేర్వేరుగా గుర్తిస్తారా, బిసిలుగా రిజర్వేషన్లు కల్పించేందుకు షియాలు లేదా సున్నీలు వేర్వేరు మతాలుగా , అలాగే వెనుకబడిన తరగతుల హోదా కోసం ప్రొటెస్టెంట్లు, రోమన్ కేథలిక్కులను వేర్వేరుగా గుర్తిస్తారా అని ఆయన ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. సిద్ధరామయ్య తన పేరును తాను 'సిద్ధ', 'రామయ్య'గా ఎప్పుడు వేరు చేసుకుంటారో తెలుసుకోవాలని ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఒక సామాజిక వర్గం తనంత తాను విడిపోవాలని కోరుకుంటే పర్వాలేదని పేర్కొన్నారు. అయితే లౌకిక రాజ్యంలో మత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు.

డిగ్రీ కాలేజీలకు జియో ట్యాగింగ్

● ఒకే పేరుతో ఉన్న కళాశాలల పట్ల గందరగోళానికి గురికాకుండా చర్యలు ● దోస్త్‌పై అవగాహనకు విస్తృతంగా ప్రచారం

మనతెలంగాణ/ హైదరాబాద్ : ఒకే పేరుతో కళాశాలలు ఉండటంతో విద్యార్థుల్లో నెలకొంటున్న అయోమయానికి తెరదించడానికి డిగ్రీ కళాశాలలకు జియో ట్యాగింగ్ చేయాలని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ(దోస్త్) నిర్ణయించింది. గత రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు చేపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు 'దోస్త్' వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొన్ని డిగ్రీ కళాశాలలు స్వల్ప తేడాతో ఒకే పేరుతో కొనసాగుతుండడంతో కళాశాలలను ఎంపిక చేసుకోవడంలో విద్యార్థులకు గందరగోళం ఏర్పడుతోంది. ఒక కళాశాలకు బదులు మరో కళాశాలకు ఎంపిక చేసుకుని, సీట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు ఈ సారి 'దోస్త్' వెబ్‌సైట్‌లోనే డిగ్రీ కళాశాలలకు జియో ట్యాగింగ్ చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

మొబైల్ ద్వారా రిజిస్ట్రేషన్

'దోస్త్'లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేయడంలో భాగంగా ఈ సారి మొబైల్ ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా యాప్‌ను రూపొందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫీజు చెల్లింపులను కూడా యాప్ ద్వారానే నిర్వహించే అంశాన్ని ఉన్నత విద్యామండలి పరిశీలిస్తోంది.



ఇంటర్ విద్యార్థులకు ఎస్‌ఎంఎస్‌లు

ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ ప్రవేశాలపై సరైన అవగాహన లేక 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆప్షన్ల ఎంపికలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఇంటర్ బోర్డ్ నుంచి ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థుల సమాచారం సేకరించి, వారికి సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు పంపించేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే విద్యార్థులు వారి మార్కుల మెమో డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో మెమోతోపాటు దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన బ్రోచర్ కూడా డౌన్‌లోడ్ అయ్యేలా ఇంటర్ బోర్డ్‌తో అవగాహన కుదుర్చుకోవాలని నిర్ణయించారు.అలాగే దోస్త్ రిజిస్ట్రేషన్ విధానం, ఆప్షన్ల ఎంపిక ప్రక్రియను సంబంధించిన పూర్తి సమాచారంతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కరపత్రాలు రూపొందించి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాంతోపాటు పత్రికలు, టివిల్లో విస్తృత ప్రచారం కల్పించాలని భావిస్తున్నారు. జిల్లాల్లో పూర్తి స్థాయిలో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో పూర్తి బయోమెట్రిక్ సౌకర్యం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు.

ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు సర్కోజి అరెస్ట్



పారిస్: ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజిని మంగళవారం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. 2007 ఎన్నికల ప్రచారంలో ఆయనకు లిబియా నుంచి డబ్బందిందన్న సందేహంపై ప్రశ్నించేందుకు కస్టడీలోకి తీసుకున్నట్లు దర్యాప్తు జరుపుతున్న సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ప్రశ్నించేందుకు జారీ చేసిన సమన్లకు సర్కోజి ఇప్పటి వరకు ప్రతిస్పందించనేలేదు. లిబియా నాయకుడు నాడు ఫ్రెంచి నాయకుడికి ఇచ్చిన డబ్బును మూడు సూట్‌కేసుల్లో అప్పగించినట్లు నవంబర్‌లో ఓ వ్యాపారవేత్త అంగీకరించడంతో దర్యాప్తు మరింత తీవ్రమైంది. సర్కోజి నిర్బంధం గురించి మొదట మీడియాపార్ట్ ఇన్వెస్టిగేటివ్ న్యూస్ సైట్ పేర్కొంది. తర్వాత ఫ్రెంచి దినపత్రిక లే మాండే తెలిపింది.సర్కోజి మాజీ సన్నిహితుడు అలెగ్జాండ్రే జౌహ్రీని లండన్‌లో అరెస్టు చేసి బెయిల్‌పై విడుదల చేసిన కొన్ని వారాలకు ఈ అరెస్టు జరిగింది. సర్కోజీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న బ్రైస్ హోర్టిఫెక్స్‌ను కూడా దర్యాప్తులో భాగంగా మంగళవారం ప్రశ్నించారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో సర్కోజికి లిబియా పాలకుడు గడాఫీ, ఆయన కుమారుడు సైఫ్ అల్ ఇస్లాం నిధులు సమకూర్చారన్న ఆరోపణపై 2013లో జడ్జిలతో విచారణను ఆరంభించారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను సర్కోజి తిరస్కరించారు. గడాఫీ 41 ఏళ్ల పాలనను ముగించిన అమెరికా నేతృత్వంలోని జోక్యానికి తాను మద్దతు ఇచ్చినందుకే లిబియా పాలకులు తనపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని సర్కోజి పేర్కొన్నారు. 2006 నుంచి 2007 వరకు జరిగిన సర్కోజి ప్రచారానికి నగదు అందించేందుకు తాను ట్రిపోలి నుంచి పారిస్‌కు మూడు ట్రిప్పులు చేశానని ఫ్రాంకో–లెబనీస్ వ్యాపారస్తుడు జియాద్ తకీద్దీన్ చెప్పాడు. ప్రతిసారి తాను 200, 500 యూరో డినామినేషన్ నోట్లలో దాదాపు 1.5 మిలియన్‌ల నుంచి 2 మిలియన్ యూరోల వరకు సూట్‌కేసులు మోసుకొచ్చానని చెప్పాడు. గడాఫీ మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ అబ్దల్లా సెనుస్సీ ఆ డబ్బును తనకు ఇచ్చారని కూడా తకీద్దీన్ చెప్పాడు.

రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వేకు అనుమతి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాచకొండ ఎత్తిపోతల ప్రాజెక్టు సర్వే పనులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. సాగునీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిన ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు సర్వే బాధ్యతలను అప్పజెప్పున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి చేస్తున్న సర్వే పనుల కొనసాగింపుగానే రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వే పనుల్ని కూడా ఈ సంస్థ నిర్వహిస్తుందని ఆ ఉత్తర్వుల్లో సిఎస్ పేర్కొన్నారు. ఇందుకోసం రూ. 1.72 కోట్లను మంజూరు చేశారు. గతేడాది అక్టోబరు, డిసెంబరు నెలల్లో ఇంజినీర్ ఇన్ ఛీఫ్ రాసిన లేఖలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలకుగాను రూ. 1.72 కోట్లను మాత్రమే మంజూరు చేస్తున్నట్లు సిఎస్ పేర్కొన్నారు.

అమెరికాలో మళ్లీ కలకలం రేపిన కాల్పులు

వాషింగ్టన్ : అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం చెలరేగింది. మేరిల్యాండ్‌లోని ఓ హైస్కూల్‌లో దుండగుడు కాల్పులకు తెగబడ్డాడని, అనేకమంది ఈ కాల్పుల బారిన పడ్డారని సెయింట్ మేరీస్ షెరీఫ్ చెప్పినట్టు స్థానిక న్యూస్ మీడియా రిపోర్టు చేసింది. స్కూల్ అధికారులు ఈ కాల్పులను ధృవీకరించారు. ప్రస్తుతం ఈ క్యాంపస్‌ను లాక్‌డౌన్ చేశారు. అయితే కాల్పుల బారిన పడ్డ వారి పరిస్థితి ఎలా ఉందో ఇంకా తెలియరాలేదని ఏబీసీ న్యూస్ రిపోర్టు చేసింది. దక్షిణ వాషింగ్టన్‌కు 70 మైళ్ల దూరంలో ఉన్న సెయింట్ మేరీస్ కంట్రీ గ్రేట్ మిల్స్ హైస్కూల్‌లో ఉదయం 8 గంటలకు దుండగుడు ఈ కాల్పులకు తెగబడ్డాడు. షెరిఫీ ఆఫీసు ఈ ఘటనను ధృవీకరించింది. ఇటీవల అమెరికా స్కూళ్లు కాల్పులతో మోతమోగుతున్నాయి. ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లో మార్జోరీ స్టోన్మాన్ డగ్లస్ హై స్కూల్లో ఫిబ్రవరి 14న జరిగిన కాల్పుల్లో 17 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే. గ్రేడ్ మిల్స్ హై స్కూల్‌లో 1500 మందికి పైగా విద్యార్థులున్నారు. విద్యార్థులను స్కూల్ నుంచి తరలిస్తున్నట్టు కంట్రీ అధికార ప్రతినిధి టోని జోన్స్ తెలిపారు.

చిట్టచివరి తెల్ల ఖడ్గమృగం కన్నుమూత



జుబూ(నేపాల్) : ప్రపంచంలో చిట్టచివరగా మిగిలిన మగ తెల్ల ఖడ్గ మృగం 'సూడాన్' కన్నుమూసింది. 45 ఏళ్ల వయసున్న ఈ అరుదైన జీవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం ఉదయం సూడాన్ మృతి చెందినట్లు ఓఎల్ పెజెటా పార్క్ నిర్వాహకులు ప్రకటించారు. వేటగాళ్ల బారి నుంచి కంటికి రెప్పలా కాపాడుకోవడానికి మూడేళ్ల నుంచి సూడాన్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. దీని పరిరక్షణ కోసం కెన్యా ప్రభుత్వం ఇప్పటి వరకూ కోట్లలో ఖర్చు చేసి మరీ భద్రతను ఏర్పాటు చేయించింది. వివిఐపి వైట్ రైనో గా ఇది బాగా పాపులర్ అయిన విషయం విధితమే. ముఖ్యంగా గతేడాది డేటింగ్ యాప్‌లో విరాళాల సేకరణ చేపట్టిన సూడాన్ పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగిపోయింది.

చైనాలో బలపడిన జిన్‌పింగ్ ఆధిపత్యం


బీజింగ్: చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అధికార కమ్యూనిస్టు పార్టీలో సంపూర్ణ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ సంస్థలు, శక్తివంతమైన 20 లక్షల సైన్యం తన నాయకత్వం కింద పనిచేయాలని కోరారు. జి జిన్‌పింగ్ రెండో పర్యాయం అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. ఆయన జీవిత కాలంపాటు పార్టీ, సైనిక అధినేతగా, అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రెండు పర్యాయాలకు మించి ఎన్నిక కాకూడదన్న నియమాన్ని మారుస్తూ రాజ్యాంగ సవరణను నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పిసి) ఆమోదించింది. ఎన్‌పిసిలో మంగళవారం జి జిన్‌పింగ్ ప్రసంగిస్తూ 'చైనా చైతన్యానికి, రాజకీయ నాయకత్వానికి పార్టీయే ప్రధాన శక్తి' అన్నారు. గత ఐదేళ్ల కాలంలో జి చేపట్టిన అవినీతి నిరోధక ఉద్యమంలో100 మంది మంత్రులు సహా 15 లక్షలకు పైగా అధికారులు శిక్షకు గురయ్యారు. ప్రభుత్వం కింద కాకుండా, అధికార పార్టీ కింద సైన్యం పనిచేసే అరుదైన దేశం చైనా. 'నేను ప్రజలకు సేవకుడిలా సేవలందిస్తాను. ప్రజల పర్యవేక్షణను ఆమోదిస్తాను. చైనా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను' అని జి జిన్‌పింగ్ అన్నారు.

కేరళలో ప్రొఫెసర్ జుగుప్సాకర వ్యాఖ్యపై 'పుచ్చకాయ' నిరసన



కొజికోడ్: ముస్లిం అమ్మాయిలు హిజాబ్(పూర్తిగా కప్పుకునే వస్త్రధారణ) సక్రమంగా ధరించకపోవడంపై కేరళలోని కొజికోడ్‌లో ఉన్న ఫారూక్ టీచర్స్ ట్రయినింగ్ కాలేజి ప్రొఫెసర్ టి. జౌహర్ మునవ్విర్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు వెలువెత్తాయి. హిజాబ్ ధరించని అమ్మాయిలు తమ వక్షస్థలాలను 'కోసిన పుచ్చకాయల' ప్రదర్శిస్తున్నారని ఆయనన్నారు. దీనికి కేరళలో చాలా మంది యువతులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు. కొందరు మహిళలైతే నగ్న చిత్రాలు కూడా పోస్ట్ చేస్తున్నారు. అనేక విద్యార్థి సంఘాలు ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఫారుక్ ట్రయినింగ్ కాలేజి ముందు నిరసనలు ప్రదర్శిస్తున్నాయి. 2009లో శ్రీరామ్ సేన గ్రూపు మంగళూరులోని పబ్‌లో మహిళలపై దాడి చేసినప్పుడు ఎలాగైతే 'పింక్ చెడ్డీ' ప్రచారం చేశారో అలాగే ఇప్పుడు 'కోసిన పుచ్చకాయలు' ఆయనకు పంపి నిరసనలు తెలుపుతామంటున్నారు. విద్యార్థి సంఘం కార్యకర్త పి. అజిత ఈ విషయం చెప్పారు. ఆమెకు మహిళా విద్యార్థినులు మద్దతు ఇస్తున్నారు. ఇతర కాలేజి విద్యార్థినులు సైతం కోసిన పుచ్చకాయలు పట్టుకుని నిరసనలు తెలుపుతున్నారు. కొందరు మహిళలైతే అచ్ఛాదనలేని తమ వక్షాల ఫోటోలను సామాజిక మాద్యమంలో పోస్ట్ చేస్తున్నారు. అయితే వాటిని ఫేస్‌బుక్ తర్వాత తొలగించేసింది. కొజికోడ్‌లో ఒక ధార్మిక విద్యా సంస్థలో మునవ్విర్ ప్రసంగిస్తూ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'నేను ఓ కాలేజిలో ఉపాధ్యాయుడిగా ఉన్నాను. అందులో 80 శాతం విద్యార్థినులు ముస్లిం అమ్మాయిలే. వారు హిజాబ్ ధరించినప్పటికీ వారు తమ వక్షస్థల భాగాలను ప్రదర్శిస్తున్నారు. ఇది హిజాబ్ లక్ష్యాన్ని ఉల్లంఘిస్తోంది. వారెలా ప్రదర్శిస్తున్నారంటే కోసిన పుచ్చకాయలా' అని వ్యాఖ్యానించారు. ఈ పోకడను తల్లిదండ్రులు, ఆధ్యాత్మిక గురువులు గమనించాలన్నారు. ఆయన ప్రసంగాన్ని సామాజిక మా ధ్యమంలో అప్‌లోడ్ చేశాక నిరసనలు వెల్లువెత్తాయి.

గవర్నర్‌తో సిఎం కెసిఆర్ భేటీ



మన తెలంగాణ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్ మంగళవారం సాయంత్రం గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున శాసనసభలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరుపైనా, ఆ తర్వాత సభ తీసుకున్న నిర్ణయంపైనా, తాజాగా హైకోర్టు వెలువరించిన అభిప్రాయంపైనా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. కోల్‌కతా ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో జరిగిన సమావేశం వివరాలను కూడా కెసిఆర్ వివరించినట్లు తెలిసింది.

'పార్కింగ్ ఫీజు' విధివిధానాలు ఖరారు

ఏప్రిల్ 1 నుంచి అమలుకు ఉత్తర్వులు జారీ

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న వాహన 'పార్కింగ్ ఫీజుల'కు ప్రభుత్వం చెక్ పెట్టింది. వివిధ వ్యాపార సముదాయాలలో షాపింగ్ కోసం వెళ్లే వాహనదారుల నుంచి పెద్ద మొత్తంలో పార్కింగ్ ఫీజులను వసూలు చేయకుండా పార్కింగ్ పాలసీ విధానాన్ని ఖరారు చేసింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలలో ఉన్న వ్యాపార సముదాయాల్లో మొదటి అరగంట వరకు పార్కింగ్ ఫీజులను వసూలు చేయకూడదని, అరగంట నుంచి గంట సమయం వరకు పార్కింగ్ చేసిన వాహనాదారులు తమ వద్ద ఉన్న షాపింగ్స్ బిల్స్‌ను చూపిస్తే ఎలాంటి ఫీజును వసూలు చేయకూడదని, ఈ కొత్త మార్గదర్శకాలతో నూతన 'పార్కింగ్ పాలసీ విధానం' ఏప్రిల్ 1 నుంచి అమలులోనికి రానుందని మున్సిపల్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనింది. షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్ సముదాయాలలో గంటల తరబడి వాహనాలను పార్కింగ్ చేసిన వాహనదారులు వాటికి సంబంధించిన బిల్స్‌ను, లేదా సినిమా టికెట్ చూపిస్తే మినహాయింపునివ్వాలని స్పష్టం చేసింది. కొనుగోలు బిల్లులు లేదా సినిమా టికెట్ చూపించని వాహనదారుల నుంచి నిర్దేశిత పార్కింగ్ ఫీజులను వసూలు చేసేందుకు అనుమతినిచ్చింది. ఈ నూతన విధి విధానాలను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విభజన హామీలపై కేంద్రాన్ని నిలదీయండి

మన తెలంగాణ/ న్యూఢిల్లీ : లోక్‌సభలో టిఆర్‌ఎస్, బిజెపితో లాలూచితో కూడిన డబుల్ గేమ్ రాజకీయాలు చేస్తుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. మ్యూచువల్ అండర్ స్టాండింగ్‌తో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని, టిఆర్‌ఎస్‌కు నిజాయితీ ఉంటే, రిజర్వేషన్ల మీద చిత్తశుద్ధి ఉంటే బిజెపితో చేస్తున్నది నిజమైన పోరాటమే అయితే అవిశ్వాసానికి మద్దతు ఇచ్చి, విభజన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల గురించి అవిశ్వాసం సమయంలో మాట్లాడడంతోపాటు విభజన చట్టంలోని హామీలపై కూడా నిలదీయొచ్చు కదా అని టిఆర్‌ఎస్ ఎంపిలను ప్రశ్నించారు. మనకు హైకోర్టు విభజన, బయ్యారం స్టీల్ ప్లాంట్, జాతీయ హోదాతో సాగునీటి ప్రాజెక్టు, ట్రైబల్ యూనివర్సిటీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ తదితర అనేక హామీలు పెండింగ్ ఉన్న విషయం కెసిఆర్‌కు, ఎంపిలకు తెలియదా? అని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ ఎంపిలు చేస్తున్న గొడవలను అడ్డంపెట్టుకొని బిజెపి ప్రభుత్వం లోక్‌సభను వాయిదా వేస్తూ పారిపోతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం టిఆర్‌ఎస్ ఎంపిలను సభ నుంచి బహిష్కరించి అవిశ్వాసానికి సిద్ధపడాలని ఆయన డిమాండ్ చేశారు.


మైనార్టీ గురుకులాల్లో బిసిలకు రిజర్వేషన్లు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలు, బౌద్ధులు, సిక్కులు, క్రిస్టియన్లు, పార్శీలు, జైనులకు సైతం రిజర్వేషన్లున్నాయని బీసీ కమిషన్ ఛైర్మన్ బిఎస్.రాములు తెలిపారు. బీసీలోని మోమతారు, దూదేకుల, బిసి (ఈ)లోని సామాజిక వర్గాలకు రిజర్వేషన్లున్నాయన్నారు. ఈ మేరకు బిసి కమిషన్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. మైనారిటీ గురుకుల పాఠశాలలైనందున వారిఇ 75% రిజర్వేషన్ సౌకర్యం కల్పించి బిసిలకు 12, ఎస్సీలకు 6, ఎస్టీలకు 4, ఓసిలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల్లోని 75% రిజర్వేషన్లలో ముస్లింలకు 64, క్రిస్టియన్లకు 7, జైనులు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కో శాతం చొప్పున ఉంటాయని వివరించారు. ప్రతి తరగతిలో ముస్లిమేతరులైన బిసిలకు 5, ఎస్సీ, ఎస్టీలకు రెండు చొప్పున, ఓసీలకు ఒక సీటు చొప్పున మొత్తం 14 సీట్లు రిజర్వేషన్ ప్రకారం లభిస్తాయన్నారు. 5వ తరగతిలో అన్ని సీట్లతో పాటు 6 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేస్తారనితెలిపారు. రాష్ట్రంలో 204 మైనార్టీ గురుకులాలున్నాయని, అన్ని పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొత్త టీచర్లకు రెండు రోజుల శిక్షణ

టిఎస్‌పిఎస్‌సి ద్వారా 241 మంది ఉపాధ్యాయులను కొత్తగా నియమించారు. వీరికి పోస్టింగ్ ఆర్డర్లను కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో మైనార్టీ గురుకులాల లక్ష్యాలు, ప్రమాణాలతో కూడిన విద్య, ఇతర, అంశాలకు సంబంధించి కొత్త టీచర్లకు శిక్షణనివ్వనున్నట్లు మైనార్టీ రెడిడెన్షియల్ పాఠశాలల సొసైటి కార్యదర్శి బి.సెఫివుల్లా తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీలలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఘనంగా 'పద్మ' పురస్కారాల ప్రదానం



న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం ప్రతిష్ఠాత్మక 2018 సంవత్సరపు పద్మ పురస్కారాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రదానం చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు ఇళయరాజా, కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రానికి చెందిన హిందూత్వ జ్ఞాని పరమేశ్వరన్, హిందూస్థానీ శాస్త్రీయ గాయకుడు గులామ్ ముస్తఫా ఖాన్‌లకు రాష్ట్రపతి 'పద్మ విభూషణ్' అవార్డులు ప్రదానం చేశారు. కేరళకు చెందిన మార్ థామస్ సిరియన్ చర్చి బిషప్ ఫిలిపోస్ మార్ క్రిసోస్టామ్, చరిత్రకారుడు, పురావస్తు శాస్త్రజ్ఞుడు రామచంద్రన్ నాగస్వామి, న్యాయకోవిదుడు వేద్ ప్రకాశ్ నంద, హిందుస్థానీ శాస్త్రీయ సంగీతకారుడు, సితార్ వాద్యకారుడు పండిత్ అరవింద్ పారిఖ్‌లకు 'పద్మ భూషణ్' అవార్డులు బహూకరించారు. ఐఐటి కాన్పూర్ పూర్వవిద్యార్థి అరవింద్ గుప్తా, 500 రకాల మూలికా ఔషధాలు తయారుచేసే కేరళకు చెందిన గిరిజన మహిళ లక్ష్మీ కుట్టి, మధ్యప్రదేశ్‌కు చెందిన గోండ్ చిత్రకారుడు భజ్జు శ్యామ్, టెన్నిస్ క్రీడాకారుడు సోమ్‌దేవ్ కిశోర్ దేవ్ వర్మన్, 20 ఏళ్లు కష్టించి పేదలకు వైద్యశాల కట్టించిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిరుపేద గ్రామీణ మహిళ సుభాషిని మిస్త్రీ, అసోం రచయిత అరూప్ కుమార్ దత్, వ్యర్థ పదార్థాలతో ప్లాస్టిక్ రోడ్డు తయారు చేసిన తమిళనాడు పౌరుడు రాజగోపాలన్ వాసుదేవన్, కశ్మీర్ థియేటర్ కళాకారుడు ప్రాణ్ కిశోర్ కౌల్, కర్నాటకలోని వెనుకబడిన ప్రాంతాల్లో ప్రసూతి సేవలు అందించే వ్యవసాయ శ్రామికురాలు సులగట్టి నరసమ్మ తదితరులు 37 మంది ప్రముఖులకు 'పద్మశ్రీ' అవార్డులు ఇచ్చారు. మిగిలిపోయిన ఇంకా కొందరికి పద్మ అవార్డులను ఏప్రిల్ 2న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 84 పద్మ అవార్డులు, 9 పద్మభూషణ్ అవార్డులు, 72 పద్మశ్రీ అవార్డులను ప్రకటించారన్నది తెలిసిందే.

రాశి ఫలాలు



ఆలోచనలు అమలు చేస్తారు. ఆత్మీయుల నుంచి పిలుపు రావచ్చు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థు లకు కొత్త అవకాశాలు. వ్యాపారులు లాభాలు పొందు తారు. ఉద్యోగస్తులకు చిక్కులు తొలగుతాయి. కళా కారులకు సన్మానాలు.



స్నేహితులతో విభేదాలు. ఆదాయం కంటే ఖర్చులు అధికం. కొన్ని కార్యక్రమాలు వాయిదా వేయాల్సిన పరిస్థితి. శారీరక రుగ్మతలు. వ్యాపారస్తులకు చికాకులు.ఉద్యోగులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటారు.



యత్నకార్యసిద్ధి. నూతన వ్యక్తులు పరిచయం. ఆప్తులు, ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు. భూ, వాహనయోగాలు. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులు పైస్థాయి ప్రశంసలు పొందుతారు. రాజకీయవేత్తలు మరింత ఉత్సాహంగా గడుపుతారు.



కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆదాయం కొంత పెరిగే ఛాన్స్. విలువైన వస్తువులు కొంటారు. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూలత. కళాకారులు అవకాశాలు దక్కించుకుంటారు.



కార్యక్రమాలలో అవాంతరాలు. అప్పులు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. శారీరక రుగ్మతలు. చోరభయం. వ్యాపారులకు ఒత్తిళ్లు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.



సోదరులు,సోదరీలతో అకారణంగా తగాదాలు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారులు నిదానం పాటించాలి. ఉద్యోగస్తులకు మార్పులు తప్పదు. పారిశ్రామికవేత్తలకు పర్యటనలు వాయిదా.



ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రముఖ వ్యక్తులు పరిచయం. దేవాలయాలు సందర్శిస్తారు. అదనపు ఆదాయం సమకూరుతుంది. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. కళాకారులకు పురస్కారాలు.



కార్యసిద్ధి. నూతన విద్యావకాశాలు. అనూహ్యమైన రీతిలో ధనలబ్ధి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారులు అధిక లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు ఒత్తిళ్లు తొలగుతాయి.



కార్యక్రమాలలో ఆటంకాలు. ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు. సమస్యలు వేధిస్తాయి. వ్యాపారులకు లాభాలు కనిపించవు. ఉద్యోగులు పనిఒత్తిడులతో సతమతమవుతారు. పారిశ్రామికవేత్తల కృషి ఫలించదు.



కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. శారీరక రుగ్మతలు. బంధువులతో అకారణంగా తగాదాలు. దూరప్రయాణాలు. వ్యాపారులకు ఒడిదుడుకులు. ఉద్యోగులకు మానసిక అశాంతి. రాజకీయవేత్తలకు పదవులలో ఊగిసలాట.



కుటుంబసభ్యుల ప్రోత్సాహం. ఆదాయం పెరుగుతుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు. వస్తులాభాలు. పాతస్నేహితుల కలయిక. వ్యాపారులు ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు ప్రమోషన్ సూచనలు. కళాకారులకు సత్కారాలు.



చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా సాగుతాయి. ఆప్తులతో విభేదాలు. దూరప్రయాణాలు. దేవాలయ దర్శనాలు. శారీరక రుగ్మతలు బాధిస్తాయి. వ్యాపారులకు చిక్కులు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. పారిశ్రామికవేత్తలకు కొన్ని ఇబ్బందులు.

రబడాకు లైన్ క్లియర్, మూడో టెస్టుకు సఫారీ స్పీడ్‌స్టర్



కేప్‌టౌన్: క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడి రెండు టెస్టుల నిషేధానికి గురైన దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసొ రబడాకు ఊరట కలిగింది. ఐసిసి కొత్తగా ప్రవేశ పెట్టిన నిబంధన ప్రకారం రబడాపై రెండు టెస్టుల నిషేధాన్ని విధించిన విషయం తెలిసిందే. అయితే ఈ అంశం వివాదాస్పదం కావడంతో ఐసిసి మళ్లీ విచారణ చేపట్టింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరుపగా రబడా ఎటువంటి దుశ్చర్యకు పాల్పడలేదని, అంతేగాక ఐసిసి నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించలేదని తేలింది. దీంతో రబడాకు విధించిన 4 డీమెరిట్ పాయింట్లను ఐసిసి తొలగించింది. దీంతో ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమయ్యే మూడో టెస్టుకు రబడా సిద్ధమయ్యాడు. అతనిపై విధించిన నిషేధాన్ని ఐసిసి ఎత్తి వేసింది. రెండో టెస్టులో అసాధారణ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికాకు అద్భుత విజయాన్ని అందించిన రబడా మూడో మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమయ్యాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్‌తో దురుసుగా ప్రవర్తించాడని ఫీల్డ్ అంపైర్లు ఆరోపించడంతో రఫరీ ఐసిసికి ఫిర్యాదు. దీన్ని తీవ్రంగా పరిగణించి ఐసిసి క్రమశిక్షణ కమిటీ రబడాకు నాలుగు డీమెరిట్ పాయింట్లను కేటాయించింది. అంతేగాక అతని మ్యాచ్ ఫీజులో వంద శాతం కోతను విధించింది. దీనిపై రబడాతో పాటు దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



కప్పు గెలిచినా..

మన తెలంగాణ/ క్రీడావిభాగం: శ్రీలంకలో జరిగిన నిదహాస్ ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో కప్పును గెలవడం ద్వారా భారత జట్టు సత్తా చాటింది. కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లి, మహేంద్ర సింగ్ ధోని, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, హార్దిక్ పాండ్య తదితరులు లేకుండానే బరిలోకి దిగిన టీమిండియా కప్పును గెలిచి తానెంటో నిరూపించింది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు చేతిలో ఓటమి పాలైన టీమిండియా మళ్లీ వెనుదిరిగి చూడలేదు. ఒక్కో మ్యాచ్ గెలుస్తూ ముందుకు సాగింది. ఇదే క్రమంలో బంగ్లాదేశ్‌పై హ్యాట్రిక్ విజయంతో ట్రోఫీని దక్కించుకుంది. సమష్టి పోరాటంతో భారత్ చాంపియన్‌గా నిలిచిందని చెప్పాలి. ఈ టోర్నమెంట్‌లో భారత్ గెలిచినా కొన్ని లోపాలు బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో చాలా మంది ఆటగాళ్లు విఫలమయ్యారనే చెప్పాలి. సీనియర్లకు విశ్రాంతి కల్పించి యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలనే భారత సెలెక్టర్ల ప్రయత్నం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో యువ క్రికెటర్లు విఫలమయ్యారు. ఏదో ఒకటి రెండు సందర్భాల్లో తప్ప యువ ఆటగాళ్లు జట్టుకు అండగా నిలిచింది తక్కువేనని చెప్పక తప్పదు. భవిష్యత్తులో ధోనికి వారసుడిగా పరిగణగిస్తున్న యువ ఆటగాడు రిషబ్ పంత్ ఆడిన అన్ని మ్యాచుల్లోనూ నిరాశ పరిచాడు. ఐపిఎల్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే పంత్ నిదహాస్ కప్పులో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. తానెంటో నిరూపించుకునేందుకు లభించిన మంచి అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మంచి భవిష్యత్తు ఉన్న క్రికెటర్‌గా అందరి మన్ననలు పొందిన పంత్ అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా కాలరాసుకున్నాడు. ఇటువంటి పరిస్థితే దక్షిణాఫ్రికా సిరీస్‌లో మరో యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కు ఎదురైంది. అతను కూడా మంచి అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. జట్టు యాజమాన్యం తనపై పెట్టుకున్న ఆశలను నీరుగార్చిన విషయం తెలిసిందే. ఫలితంగా నిదహాస్ కప్ టోర్నీకి జట్టులో చోటు సంపాదించలేక పోయాడు. ఇక, సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా కూడా నిరాశే మిగిల్చాడు. జట్టులో ఎన్నో ఆశలు పెట్టుకున్న రైనా ఒకటి రెండు మ్యాచ్‌లలో తప్ప ఘోరంగా విఫలమయ్యాడు. ఈ టోర్నమెంట్‌లో రాణించడం ద్వారా జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనే రైనా లక్ష్యం నెరవేరలేదనే చెప్పాలి. తనపై సెలెక్టర్లు పెట్టుకున్న ఆశలను పేలవ బ్యాటింగ్‌తో నీరు గార్చాడు. భవిష్యత్తులో జట్టులో స్థానం కాపాడు కోవడం క్లిష్టంగా మార్చుకున్నాడు.



తేలి పోయిన బౌలర్లు..

ఈ టోర్నీలో భారత్‌ను ఎక్కువగా నిరాశ పరిచింది బౌలర్లేనని చెప్పక తప్పదు. భారీ ఆశలతో బరిలోకి దిగిన యువ బౌలర్లు చెత్త బౌలింగ్‌తో నిరాశే మిగిల్చారు. ముఖ్యంగా జైదేవ్ ఉనద్కట్ ఆశించిన స్థాయిలో రాణించక పోవడం జట్టును ఆందోళన కలిగించే పరిణామం. భవిష్యత్తులో మంచి బౌలర్‌గా ఎదుగుతాడని భావించిన ఉనద్కట్ ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విఫలమయ్యాడు. దీంతో అతనిపై సెలెక్టర్లు పెట్టుకున్న ఆశలు నీరుగారాయి. ఇక, శార్దూల్ ఠాకూర్ కూడా ఒకే ఒక మ్యాచ్‌లో మెరుగ్గా రాణించాడు. నిలకడగా బౌలింగ్ చేయడంలో విఫలమయ్యాడు. భారీగా పరుగులు ఇచ్చుకోవడమే కాకుండా కీలక సమయంలో వికెట్లను తీయడంలో సఫలం కాలేక పోయాడు. అయితే మిగతా బౌలర్లతో పోల్చితే కాస్త పర్వాలేదనిపించాడు. ఇక, హైదరాబాది ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఘోరంగా విఫలమయ్యాడు. అందివచ్చిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. వికెట్లు తీయడంలో విఫలమైన సిరాజ్ భారీగా పరుగులు సమర్పించుకొని నిరాశ పరిచాడు. భవిష్యత్తులో మరో ఛాన్స్ దొరకడం కష్టంగా మార్చుకున్నాడు. ఇక, ఫైనల్ మ్యాచ్‌లో ఇటు బంతితో అటు బ్యాట్‌తో ఘోర వైఫల్యం చెందిన యువ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ మరోసారి టీమిండియాలో చోటు సంపాదించడం కష్టమేనని చెప్పాలి. నిదహాస్ కప్ ఫైనల్లో అతని ప్రదర్శన ఒక పీడకలగా మిగిలి పోవడం ఖాయం. కీలక సమయంలో ఒత్తిడికి తట్టుకోవడంలో విఫలమయ్యాడు. కనీసం సింగిల్ కూడా తీయలేని అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతోంది. బౌలింగ్‌లో కూడా లయ తప్పాడు. సహచర బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేసిన పిచ్‌పై భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. ఈ మ్యాచ్ ద్వారా అతని అంతర్జాతీయ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది.



ముగ్గురే ముగ్గురు..

ఈ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించిందంటే దానికి ముగ్గురిదే కీలక పాత్ర అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఇందులో కీలక పాత్ర యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌దే. టోర్నమెంట్‌లో నిలకడైన బౌలింగ్‌తో మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా కూడా నిలిచాడు. కీలక సమయంలో వికెట్లు తీయడమే కాకుండా పొదుపుగా బౌలింగ్ చేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆడిన అన్ని మ్యాచుల్లో కూడా నిలకడగా రాణించింది సుందర్ ఒక్కడేనని చెప్పాలి. జట్టుకు కప్పును సాధించి పెట్టిన ఆటగాళ్లలో సుందర్‌కు అగ్రస్థానం ఇవ్వక తప్పదు. ఇక, యజువేంద్ర చాహల్ కూడా నిలకడైన బౌలింగ్‌తో జట్టుకు అండగా నిలిచాడు. పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా అవసరమైనప్పుడు వికెట్లు తీస్తూ జట్టును ఆదుకున్నాడు. చాహల్ నిలకడైన బౌలింగ్ భారత్ విజయాల్లో కీలక భూమిక ను పోషించింది. ఇక, వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ ఫైనల్లో ఆడిన ఇన్నింగ్స్ భారత క్రికెట్ చరిత్రలో చిరకాలం గుర్తుండి పోతుంది. భారత్ దాదాపు ఆశలు వదులుకున్న స్థితిలో కార్తీక్ ఆడిన కళ్లు చెదిరే ఇన్నింగ్స్ భారత్‌కు నిదహాస్ కప్పు సాధించి పెట్టింది. తీవ్ర ఒత్తిడిని సైతం తట్టుకొని కార్తీక్ కొట్టిన సిక్స్‌లు, ఫోర్లు అభిమానులు ఎప్పటికి మరువరు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను లాగేసి బంగ్లా ఆశలపై నీళ్లు చల్లిన ఘనత దక్కుతోంది. కీలక ఇన్నింగ్స్‌తో కార్తీక్ తెనెంత విలువైన ఆటగాడో నిరూపించాడు. ఈ టోర్నమెంట్ తర్వాత భారత జట్టులో కార్తీక్ చోటు ఖాయమైందనే చెప్పాలి.

ఆత్మవిశ్వాసం పెరిగింది: సుందర్

న్యూఢిల్లీ: నిదహాస్ కప్ టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించడంతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందని భారత యువ సంచలనం వాషింగ్టన్ సుందర్ అన్నాడు. ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సుందర్ ఈ విషయాన్ని చెప్పాడు. ముక్కోణపు టోర్నీలో ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలువడాన్ని తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పాడు. హేమాహేమీ ఆటగాళ్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో తనకు ఈ అవార్డు లభిస్తుందని కలలో ఊహించలేదన్నాడు. నిలకడైన బౌలింగ్‌తో ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా నిలువడం కొత్త అనుభూతిని ఇచ్చిందన్నాడు. తనకు అన్ని విధాలుగా సహకరించిన కెప్టెన్ రోహిత్ శర్మకు సదా రుణపడి ఉంటానన్నాడు. తనపై ఎంతో నమ్మకంతో ప్రారంభంలోనే బౌలింగ్ బాధ్యతలు అప్పగించడం తనకు లభించిన అరుదైన గౌరవమన్నాడు. కెప్టెన్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టి బౌలింగ్‌లో నిలకడగా రాణించడం ఎంతో ఊరట ఇచ్చిందన్నాడు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్ తనకు ప్రత్యేకమేనన్నాడు. పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా కీలక సమయాల్లో వికెట్లు తీయడం ఎంతో ఆనందం కలిగించిందన్నాడు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా రాణించడమే తన లక్ష్యమన్నాడు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానని వివరించాడు. కోహ్లి, రోహిత్, ధోని, కార్తీక్, రైనా వంటి సీనియర్లు సలహాలు, సూచనలు తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నాడు. అదే విధంగా సీనియర్ బౌలర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాల సహకారం కూడా తీసుకుని బౌలింగ్‌ను మరింత మెరుగు పరుచుకుంటానన్నాడు. కాగా, ప్రతి మ్యాచ్‌లో నిలకడగా బౌలింగ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని, ఆ దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగానని తెలిపాడు. ఫైనల్లో తన ప్రదర్శన సంతృప్తి ఇచ్చిందన్నాడు. ఒత్తిడిలోనూ పొదుపుగా బౌలింగ్ చేయడం కొత్తగా అనిపించిందన్నాడు. కాగా, రానున్న రోజుల్లో టీమిండియాలో చోటు సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు సుందర్ తెలిపాడు.

అఫ్గాన్‌కు మరో విజయం



హరారే: ప్రపంచకప్ అర్హత టోర్నమెంట్ సూపర్ సిక్స్ పోటీల్లో అఫ్గానిస్థాన్ మరో విజయం నమో దు చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్గాన్ ఐదు వికెట్ల తేడాతో యూఎఇను ఓడించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అఫ్గాన్ సూపర్‌సిక్స్‌లో వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన యూఎఇ 43 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యా టింగ్‌కు దిగిన అఫ్గాన్ 34.3 ఓవర్లలోనే కేవలం ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ గుల్బద్దీన్ నైబ్ అద్భుత బ్యాటింగ్‌తో అఫ్గాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు స్టార్ ఆటగాడు నజీబుల్లా జర్దాన్ తనవంతు సహకారం అందించాడు. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అఫ్గాన్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ మహ్మద్ షాజాద్ (3) ప్రారంభంలోనే వెనుదిరిగాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రహ్మత్ ఖాన్ '16) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయారు. మరోవైపు సమీవుల్లా (2), కెప్టెన్ అస్ఘర్ (4) కూడా నిరాశ పరిచారు. దీంతో ఒక దశలో అఫ్గాన్ 54 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకు పోయింది. ఈ దశలో జట్టును గెలిపించే బాధ్యతను గుల్బద్దీన్, జర్దాన్‌లు తమపై వేసుకున్నారు. ఇద్దరు యూఎఇ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. జింబాబ్వే బౌలర్లను హడలెత్తించి జట్టుకు విజయం సాధించి పెట్టారు. కీలక ఇన్ని ంగ్స్ ఆడిన గుల్బద్దీన్ 4ఫోర్లు, రెండు సిక్సర్లతో 74 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. మరోవైపు ధాటిగా ఆడిన జర్దాన్ ఐదు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో అజేయంగా 63 పరుగులు చేశాడు. దీంతో అఫ్గాన్ ఘన విజయం అందుకుంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన యూఎఇ 177 పరుగులకే కుప్పకూలింది. షైమన్ అన్వర్ (64), మహ్మద్ నవీద్ (42) తప్ప మిగతావారు విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో దౌలత్ మూడు వికెట్లు తీశాడు. స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ ఐదు వికెట్లు తీసి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో తనవంతు పాత్ర పోషించాడు.

గోల్డ్ కోస్ట్‌లో సత్తా చాటుతా

- రెజ్లర్ సుశీల్ కుమార్

న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు భారత స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ అన్నాడు. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో కానన్వెల్త్ క్రీడలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుశీల్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పాడు. రానున్న కామన్వెల్త్ క్రీడలు తనను సవాలు వంటివన్నాడు. ఈ క్రీడల్లో సత్తా చాటడం ద్వారా తానెంటో నిరూపిస్తానన్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో తనకు మంచి రికార్డే ఉందన్నాడు. దాన్ని మరింత మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు. దీని కోసం ప్రత్యేక వ్యూహాలను రచిస్తున్నట్టు వివరించాడు. కామన్వెల్త్ క్రీడల్లో రాణించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకోవడమే తన లక్ష్యమన్నాడు. తీవ్ర పోటీ ఉండే ఇలాంటి క్రీడల్లో రాణిస్తే ఆత్మవిశ్వాసం దానంతట అదే పెరిగి పోతుందన్నాడు. గతంలో ఈ క్రీడల్లో రాణించిన తర్వాతే ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన విషయాన్ని సుశీల్ గుర్తు చేశాడు. రానున్న టోక్యో ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన ప్రధాన లక్ష్యమన్నాడు. దీని కోసం కఠోర సాధన చేస్తానని చెప్పాడు. ఇప్పటికే దీని కోసం కసరత్తు ప్రారంభించినట్టు వివరించాడు. ప్రపంచ రెజ్లింగ్‌లో భారత్ బలమైన శక్తిగా మారిందన్నాడు. పురుషులు, మహిళల విభాగంలో అంతర్జాతీయ స్థాయి రెజ్లర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారన్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో భారత రెజ్లర్లు అద్భుతంగా రాణిస్తారనే నమ్మకం తనకుందన్నాడు. ఈ క్రీడల్లో భారత్ స్వర్ణాల పంట పండించడం ఖాయమని సుశీల్ జోస్యం చెప్పాడు.



పాక్ మహిళల జయకేతనం

దంబుల్లా: శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు 69 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. మంగళవారం దంబుల్లాలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య శ్రీలంక జట్టు 181 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ చమారి ఆటపట్ట, శశికళ సిరివర్ధనే తప్ప మిగతా వారు విఫలం కావడంతో లంకకు ఓటమి తప్పలేదు. కీలక ఇన్నింగ్స్ ఆడిన శశికల ఆరు బౌండరీలతో 44 పరుగులు చేసింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన ఆటపట్టు ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 46 పరుగులు సాధించింది. పాక్ బౌలర్లలో కెప్టెన్ బిస్మా మరూఫ్ మూడు వికెట్లు తీసింది. సనా మీర్‌కు రెండు వికెట్లు లభించాయి. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన పాక్‌ను జవేరియా ఖాన్ అజేయ శతకంతో ఆదుకుంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన జవేరియా 15 ఫోర్లతో 113 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. నిదాదర్ (34), సనా మీర్ (27), నటాలియా పర్వేజ్ 21 (నాటౌట్) తమ వంతు సహకారం అందించడంతో పాక్ స్కోరు 250కి చేరింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.